అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 21-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 51 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



మాట్లాడుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య

బీజేపీకి షాక్

- ఆప్ అభ్యర్థి విజేత
- చండీగఢ్ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు



వివరాలు 13లో

2018 పరువునష్టం కేసులో... రాహుల్‌కు బెయిల్



వివరాలు 13లో

ఏడాదికి రెండుసార్లు

- 10, 12 తరగతుల బోర్డు ఎగ్జామ్స్‌పై కేంద్ర విద్యాశాఖ నిర్ణయం
- ఈ ఆప్షన్ 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



వివరాలు 13లో

నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్

- 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎప్‌సెట్ కన్వీనర్ వెల్లడి

వివరాలు 6లో

ఆర్ఆర్ఆర్‌కు పచ్చజెండా..

భూసేకరణ, విధాన ప్రక్రియలు వేగవంతం

- యుటిలిటీస్ తరలింపు భారం భరిస్తామన్న కేంద్ర మంత్రి
- హైదరాబాద్-విజయవాడ ఆరు లైన్లు, హైదరాబాద్-కల్వకుర్తి నాలుగు లైన్లకు అనుమతికై రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల భేటీ



నితిన్ గడ్కరీతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, కోమటిరెడ్డి..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం(చౌటుప్పల్-ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి- 182 కిలోమీటర్లు) జాతీయ రహదారికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రహదారులు, ఫ్లై ఓవర్‌లు, రీజనల్ రింగ్ రోడ్డుతో సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులపై గడ్కరీతో సీఎం చర్చించారు. ఆ మేరకు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కోరాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను గడ్కరీ ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ అంశంతో పాటు తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు అనుమతి, పలు ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జాతీయ ...13లో

జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి కోరిన రహదారుల వివరాలు

- మరికల్-నారాయణపేట్-రామసముద్ర-63 కి.మీ
- పెద్దపల్లి-కాటారం-66 కి మీ
- పుల్లూర్-అలంపూర్-జటప్రోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల్-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్గొండ-225 కి.మీ
- వనపర్తి-కొత్తకోట-గద్వాల-మంత్రాలయం-110 కి మీ
- మన్నెగూడ-వికారాబాద్-తాండూర్-జహీరాబాద్-బీదర్-134 కి మీ
- కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పిట్లం-16 కిమీ
- కరీంనగర్-రాయపట్నం-60 కిమీ
- ఎర్రవెల్లి క్రాస్ రోడ్-గద్వాల-రాయచూర్-67 కి మీ
- జగిత్యాల-పెద్దపల్లి-కాల్వ శ్రీరాంపూర్-కిష్టంపేట-కల్వపల్లి-మోరంచపల్లి-రామప్ప దేవాలయం-జంగాలపల్లి-164 కి మీ
- సారపాక-ఏటూరునాగారం-93 కి మీ
- దుద్దెడ-కొమురవెల్లి-యాదగిరిగుట్ట-రాయగిరి క్రాస్‌రోడ్-63 కిమీ
- జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం-100 కిమీ
- సిరిసిల్ల-వేములవాడ-కోరుట్ల-65 కిమీ
- భూత్పూర్-నాగర్‌కర్నూల్-మన్ననూర్-మద్దిమడుగు (తెలంగాణ)-గంగలకుంట-సిరిగిరిపాడు-166 కిమీ

మిగులు భూమి
లెక్క తేల్చాలి..

ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్, పోడు భూములు పేదలకు పంచాలి

- జీవో నెంబర్ 58 ప్రకారం 120 గజాల ఇంటి స్థలం కేటాయించాలి
- సర్కార్ భూముల్లో గుడిసెలేసుకున్న వారికి పట్టాలివ్వాలి
- పోరాటంలో పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి
- భూ చట్టంలో ఉన్న లొసుగులను సవరించాలి : తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక భూ సదస్సు డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర భూ సర్వే జరిపి ప్రభుత్వ సీలింగ్, అసైన్డ్, పోడు భూములను అర్హులైన పేదలకు పంచాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో నిర్వహించిన భూ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూమి పంచాలని పలు తీర్మానాలను ఐక్యవేదిక కన్వీనర్ ఎస్. వీరయ్య ప్రవేశ పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లో 69 భూ పోరాట కేంద్రాల్లో పేదలు గుడిసెలేసుకొని మూడేండ్ల నుంచి నివాసముంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు భూ కేంద్రాల్లోని గుడిసెలను తొలగించి, పోరాటంలో పాల్గొన్న వారిపై అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపించిందని విమర్శించారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పలు చోట్ల గుడిసెలను తొలగించి దాడులకు పాల్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీల్లో ప్రధాన గ్యారంటీగా ఉన్న ఇండ్ల స్థలాల కోసం మాత్రమే తాము పోరాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మూడు సార్లు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రెండు సార్లు కలిసి విన్నవించిన సందర్భంలో సానుకూలంగా ఉన్నామని ప్రకటించినా, ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. మహబూబాబాద్ భూ పోరాట కేంద్రంలో గుడిసెలను గత ప్రభుత్వం 18 సార్లు తొలగించిందనీ, కాంగ్రెస్ సర్కార్ 19వ సారి గుడిసెలను నేలమట్టం చేసి అక్రమ కేసులు బనాయించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను రేవంత్ ప్రభుత్వం భవిష్యత్‌లో చేయదని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలాలు, సాగు భూములను రేవంత్ సర్కార్ అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య మాట్లాడుతూ 11.5 లక్షల ఎకరాల అటవీ భూములను గుర్తించిన గత ప్రభుత్వం కేవలం 4.2 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చిందని తెలిపారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా అటవీ భూములకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర భూసర్వే నిర్వహించి, మిగులు భూమిని పేదలకు భూములు పంచాలనీ, ఇండ్ల నిర్మాణానికి రాష్ట్రం రూ.5లక్షలు, కేంద్రం రూ.10 లక్షలు మొత్తం రూ.15 లక్షలివ్వాలివ్వాలనీ, డంపింగ్ యార్డులు, ...3లో

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

ఈసీ కసరత్తు పూర్తి

- లోక్‌సభతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- 2019లో మార్చి 10న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సీఈసీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కార్యాచరణకు సమాయత్తమైంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు తెలుస్తున్నది. ఎన్నికల సంఘం వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగించే అవకాశముందని విశ్వసనీయ వర్గాల సమాచారం. మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించే అవకాశముందని జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. కాగా, పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల ...13లో

రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవం

- రేణుకా, అనిల్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర ఎన్నిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యసభ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ఖాళీఅయిన మూడు స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఎమ్మెల్యేల బలాబలాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం గెలిచే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, ...13లో



రాజ్యసభకు సోనియా ఎన్నిక

వివరాలు 13లో

కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

కాలిబూడిదైన 50 పేదల గుడిసెలు

- మంటల ధాటికి పేలిన ఐదు గ్యాస్ సిలిండర్లు
- భయంతో పరుగులు తీసిన జనం
- గుడిసెవాసులంతా మేడారం వెళ్లడంతో తప్పిన ప్రాణనష్టం
- కనీస ఆనవాళ్లు లేకుండా బూడిదైన పేదలగూళ్లు
- కుటుంబానికి రూ.లక్ష సాయం, పక్కా ఇళ్లు నిర్మించాలని ఎమ్మెల్యే గంగుల డిమాండ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/కరీంనగర్ క్రైం

కరీం'నగరం' నడిబొడ్డున మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సుభాష్‌నగర్ నుంచి ఆదర్శనగర్‌కు వెళ్లే దారిలోని గుడిసెలకు మంటలు అంటుకోవడంతో.. అందులోని ఐదు వంటగ్యాస్ సిలిండర్లు భారీ శబ్ధాలతో పేలుడు సంభవించి పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. భయంతో చుట్టుపక్కవాళ్లు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలకుపైగా శ్రమించి మంటలు ఆర్పారు. ఆ గుడిసెవాసులంతా మేడారం జాతరకు వెళ్లడంతో పెనుప్రమాదం తప్పినా.. అప్పటికే ఆనవాళ్లు లేకుండా ...13లో

నేటి నుంచి
మేడారం మహాజాతర

వెలసిన గుడారాలు.. బయలెల్లిన పగిడిద్దరాజు

- నేడు కన్నెపల్లి నుంచి రానున్న సారలమ్మ
- రేపు చిలకలగుట్ట నుంచి సమ్మక్క
- జాతరకు రూ.105 కోట్లతో ఏర్పాట్లు
- 12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు



మేడారం నుంచి నవతెలంగాణ ప్రాంతీయ ప్రతినిధి బి.దయాసాగర్

మేడారం సమ్మక్క, సారక్కల మహా జాతర బుధవారం ప్రారంభం కానుంది. ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే ఈ జాతరకు లక్షలాది మంది సందర్శకులు తరలిరానున్నారు. ఇప్పటికే చాలా మంది తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల గ్రామం నుంచి సమ్మక్క భర్త పడగ రూపంలోనున్న పగిడిద్దరాజు, కన్నాయిగూడెం మండలంలోని కొండాయి నుంచి గోవిందరాజులును, తాడ్వాయి మండలం కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొని బుధవారం మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠించనున్నారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొని వచ్చి గద్దెలపై ఉంచనున్నారు. అధికారిక లాంఛనాలతో ఉద్విగ్న వాతావరణంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. లక్షలాది మంది ప్రజల నడుమ యాటలు, కోళ్ల బలులతో సమ్మక్కను తీసుకువచ్చే రహదారిపై రక్తతర్పణం చేస్తారు. శివసత్తులు, కొమ్ము వాయి ద్యాలు, ఆదివాసీ యువతీయువకుల సంప్రదాయ నృత్యాల నడుమ భారీ పోలీసు బందోబస్తుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కాగా, జాతరకు ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ 6 వేల బస్సులను ఏర్పాటు చేసింది.

పడగ రూపంలో బయలెల్లిన పగిడిద్దరాజు

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి సమ్మక్క భర్త పగిడిగిద్దరాజుకు పెనుక వంశానికి చెందిన ప్రధాన పూజారి పెనుక రాజేశ్వర్ ...3లో

అన్ని ఏర్పాట్లు పూర్తి

- రద్దీకనుగుణంగా సౌకర్యాల పెంపు
- పెరుగుతున్న భక్తుల తాకిడి
- సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ వెల్లడి

వివరాలు 6లో

గాంధీభవన్‌కు ఎంపీ అనిల్‌కుమార్

- అసెంబ్లీ నుంచి గాంధీభవన్‌కు భారీ ర్యాలీ
- అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడుగా మంగళవారం రిటర్నింగ్ అధికారి నుంచి నియామకపత్రం అందుకున్న తర్వాత అసెంబ్లీ నుంచి గాంధీభవన్‌కు అనిల్‌కుమార్‌యాదవ్ భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ కాన్వాయ్‌తో బాణసంచా కాల్చుతూ నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, అనిల్ కుటుంబసభ్యులు ఉన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అనిల్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. చిన్న వయసులో అధిష్టానం తనకు పెద్ద పదవి ఇచ్చిందనీ, ఇది నా జీవితంలో గొప్ప సంఘటన అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. . ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతోపాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఒక బీసీ బిడ్డను పెద్దల సభకు పంపుతున్నారంటే, ఇది బీసీలందరికీ గర్వకారణమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో తమకు మంచి జరుగుతుందన్న నమ్మకంతోనే పార్టీ కోసం కష్టపడి పని చేశామన్నారు. ఇది అనిల్ కుమార్ విజయం కాదు యువజన కాంగ్రెస విజయమన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం తమ సామాజిక వర్గానికి గొప్ప అవకాశం కల్పించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గొల్ల కుర్మలు పూర్తిగా కాంగ్రెస్‌కు మద్దతు పలికారని గుర్తు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరింత మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా చూస్తామన్నారు.

జ్యోతి అక్రమాస్తులు రూ.5 కోట్ల పైనే

- ఏసీబీ సోదాల్లో వెల్లడి

నవతెలంగాణ-ప్రత్యేకప్రతినిధి

భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) జగ జ్యోతి అక్రమాస్తులు రూ.5 కోట్లకు పైనేనని ఏసీబీ అధికారులు జరిపిన తదుపరి సోదాల్లో వెలుగు చూసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ సి.వి ఆనంద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. రూ.84 వేలను ఒక కాంట్రాక్టర్ నుంచి తీసుకుంటుండగా జ్యోతిని సోమవారం ఆమె కార్యాలయంలోనే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం విదితమే. కాగా, తదుపరి చర్యల్లో భాగంగా విజయనగర్ కాలనీ సెయింట్ అన్స్ కాలేజీ దగ్గర ఉన్న వెంకటసాయి అపార్ట్‌మెంట్స్‌లోని ఆమె నివాసంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆమె నివాసం నుంచి రూ.65,18,000 నగదుతో పాటు 363 గ్రాముల బంగారు నగలు కూడా దొరికాయి. వీటితో పాటు కొన్ని ఫ్లాట్లు, మరికొన్ని ఓపెన్ ప్లాట్లతో పాటు వ్యవసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా దొరికాయి. సీజ్ చేసిన బంగారం విలువ రూ.1.50 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. మిగతా ఆస్తుల విలువ కూడా కలిపి మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తుల విలువ రూ.5 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నదని తెలిపారు.

నేటి నుంచి శిక్షణ షురూ

- 13,953 మంది కొత్త కానిస్టేబుళ్లకు ...
- టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లకు త్వరలో నిర్వహిస్తాం :అదనపు డీజీ అభిలాష బిస్త్ వెల్లడి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కొత్తగా నియమితులైన 13,953 మంది కానిస్టేబుళ్ల శిక్షణా కార్యక్రమం నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించి పోలీసు ట్రెనింగ్ కాలేజీలు, జిల్లా ట్రెనింగ్ కాలేజీలు, బెటాలియన్లలో రాష్ట్ర పోలీస్ ట్రెనింగ్ విభాగం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు అదనపు డీజీ అభిలాష బిస్త్ తెలిపారు. నియామకమైన టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లు 4,723 మంది మినహా మిగతా సివిల్, ఏఆర్, సీఏఆర్, ఐటీ, పీటీఓ లకు చెందిన 13,953 మంది కానిస్టేబుళ్లకు శిక్షణను తొలి విడతగా ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. వీరికి 9 నెలల పాటు వివిధ అంశాలలో ఇండక్షన్ ట్రెనింగ్ కోర్సు ఉంటుందని చెప్పారు. మహిళా కానిస్టేబుళ్లకు మేడ్చల్ ట్రెనింగ్ కాలేజీలో, సివిల్ కానిస్టేబుళ్లకు కరీంనగర్‌లో, ఏఆర్ కానిస్టేబుళ్లకు నల్గొండ, మంచిర్యాల బెటాలియన్స్‌లలో శిక్షణనిస్తున్నట్టు ఆమె తెలిపారు. మిగతా టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లకు త్వరలోనే ట్రెనింగ్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. కాగా, తమకు శిక్షణను ఆలస్యం చేయటం వలన ఏడాది కాలం పాటు తమ సర్వీసును కోల్పోతామని టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా తమను ట్రెనింగ్‌కు

అంతర్గత ప్రజాస్వామ్యానికి చెల్లుచీటీ

బీజేపీలో అధికారమంతా ఇకపై పార్లమెంటరీ బోర్డుదే | జాతీయ సమావేశాల్లో కొనసాగిన మోడీ హవా

న్యూఢిల్లీ : బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం భూతద్దంతో వెతికినా కానరావడం లేదు. ఇటీవల ముగిసిన బీజేపీ జాతీయ సమావేశాల్లో ఈ విషయం తేటతెల్లమై పోయింది. పార్టీ అధ్యక్షుడిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకునే పద్ధతికి స్వస్తి చెబుతూ బీజేపీ రాజ్యాంగాన్ని సవరించారు. అధ్యక్షుని పదవీకాలం, అత్యవసర పరిస్థితుల్లో దాని పొడిగింపు వంటి విషయాలలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ పార్లమెంటరీ బోర్డుకు కట్టబెట్టారు. ఈ సవరణపై సమావేశంలో చర్చ జరిగిందా లేదా అనే విషయం ఎవరికీ తెలియదు. ఎందుకంటే సమావేశానికి పాత్రికేయులను అనుమతించలేదు. పీటీఐ వార్తా సంస్థ ఇచ్చిన సమాచారాన్నే మీడియా సంస్థలు ప్రజలకు చేరవేశాయి.

'సవరణల వివరాలను, వాటిలోని హేతుబద్ధతను బీజేపీ వివరించలేదు. భవిష్యత్తులో పార్టీ అధ్యక్ష పదవిని నియామకం ద్వారా భర్తీ చేసే పరిస్థితి రావచ్చునని మాత్రం పార్టీ వర్గాలు తెలిపాయి' అని పీటీఐ వివరించింది.

1980లో బీజేపీ ఆవిర్భవించినప్పటి నుండి కాంగ్రెస్ అంతర్గత పనితీరుకు పూర్తి భిన్నమైన రీతిలో వ్యవహారాలను నడిపింది. కాంగ్రెస్ ఓ కుటుంబ పార్టీ అని, అంతర్గత ప్రజాస్వామ్య సూత్రాలను తుంగలో తొక్కిందని బీజేపీ ఆరోపిస్తూ వస్తోంది. ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియ ద్వారానే తమ అధ్యక్షులందరూ ఎన్నికయ్యారని గొప్పలు చెప్పుకుంది. అయితే ఈ వాదనలో ఏ మాత్రం వాస్తవం లేదని బీజేపీ అధ్యక్ష ఎన్నికల ప్రహసనాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

అంతా ఏకగ్రీవమేనట

1997లో మొదటిసారి, గత సంవత్సరం రెండోసారి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. కానీ దీనికి భిన్నంగా బీజేపీ అధ్యక్షులందరూ 'ఏకగ్రీవం'గానే ఎన్నికయ్యారు. ముందుగానే ఎంపిక చేసుకున్న వ్యక్తికి వ్యతిరేకంగా





ఎవరూ నామినేషన్ వేసే సాహసం చేయకుండా పార్టీ పెద్దలు, ఆర్ఎస్ఎస్ నేతలు జాగ్రత్తలు తీసుకునే వారు. 2014 వరకూ బీజేపీ అధ్యక్షుడిని ఎంపిక చేసింది ఆర్ఎస్ఎస్ సంస్థే.

2005లో మహమ్మద్ అలీ జిన్నా లౌకిక విశ్వసనీయతలను ప్రశ్నించిన తర్వాత అద్వానీని పూర్తిగా విస్మరించారు. 2013లో నితిన్ గడ్కరీని రాత్రికి రాత్రే పార్టీ అధ్యక్ష పదవి నుండి తప్పించి, రాజ్‌నాథ్ సింగ్‌ను నియమించడానికి కారణమేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. అయినప్పటికీ తమ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని బీజేపీ చెప్పుకుంటుంది.


2014 తర్వాత సీను మారింది

2014 తర్వాత బీజేపీకి ఓట్లు సంపాదించే నేతగా మోడీ ఆవిర్భవించారు. అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వంటి సీనియర్ నేతలు పూర్తిగా తెరమరుగయ్యారు. ఒకప్పుడు బీజేపీ రాజకీయాలను శాసించిన ఆర్ఎస్ఎస్ కూడా మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది. 2014లో బీజేపీ అధ్యక్షుడుగా అమిత్ షా ఎన్నికైన తర్వాత పార్టీలో మోడీ ప్రభంజనం మొదలైంది. ఇందిరాగాంధీ మోడల్‌నే బీజేపీ అనుకరించడం ప్రారంభించింది. తాజాగా బీజేపీ రాజ్యాంగానికి చేసిన సవరణతో పార్లమెంటరీ బోర్డే సూపర్ పొలిట్‌బ్యూరోగా అవతరించింది. పార్లమెంటరీ బోర్డులో ఎవరు ఉండాలనేది నిర్ణయించేది అమిత్ షాయే. పార్టీ అధ్యక్షుడుగా జేపీ నడ్డా ఉన్నా లేక వేరెవరు ఉన్నా పూర్తి అధికారం, పట్టు మాత్రం మోడీదే. అటల్ బిహారీ వాజ్‌పేయి సైతం ప్రభుత్వం పైన, పార్టీ పైన ఇలా పెత్తనం చెలాయించే వారు కాదు. బీజేపీ జాతీయ సమావేశాల్లో రాజ్‌నాథ్ సింగ్, నడ్డా, చివరికి అమిత్ షా కూడా డమ్మీలుగా మిగిలి పోయారు. ఆర్ఎస్ఎస్ సైతం జరుగుతున్న పరిణామాలను నిస్సహాయంగా చూస్తూ ఉండిపోతోంది. ఏదేమైనా తాజా సవరణ ఆర్ఎస్ఎస్‌కు ఎదురు దెబ్బగానే భావించాలి. రాజ్యాంగం, ఏకాభిప్రాయం, ప్రజాస్వామ్యం వంటి పదాలన్నీ కంటితుడుపు మాటలుగానే మిగిలిపోయాయి.

నేడు హైదరాబాద్‌లో రెడ్ బుక్స్‌డే కార్యక్రమం

'లెనిన్ ఓ విప్లవాయుధం' పుసక్తంపై సామూహిక పఠనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ బుక్స్ డే కార్యక్రమం జరగనుంది. 'లెనిన్ ఓ విప్లవాయుధం'అనే పుస్తకంపై సామూహిక పఠన కార్యక్రమం ఉంటుంది. ఇందులో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, పార్టీ సభ్యులు పాల్గొంటారు.

కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ(సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. లోధిరోడ్‌లోని కేసీ వేణుగోపాల్ నివాసంలో ఆయనను కలిసారు. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారు. దాదాపు గంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, ఆరు గ్యారెంటీల అమలు తీరును నేతలు కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. అలాగే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై మంతనాలు జరిపారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు, సీటు ఆశిస్తోన్న అభ్యర్థుల వివరాలపై చర్చించినట్టు సమాచారం. అలాగే మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా సమాలోచన చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటి రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు.



150 మంది అవుట్ సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్ల తొలగింపు

వారిని యథావిధిగా కొనసాగించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ నర్సింగ్ ఆఫీసర్లను తొలగించింది. తాజాగా సిద్ధిపేట మెడికల్ కాలేజీలో దాదాపు వంద మంది, మహబూబ్ నగర్ నర్సింగ్ కాలేజీలో దాదాపు 50 మందిని తొలగించడంతో వారిలో ఆందోళన నెలకొంది. దీంతో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సిద్ధిపేట జిల్లా సీఐటీయూ నాయకులు రవితో కలిసి ఉద్యోగాలు కోల్పోయిన నర్సింగ్ ఆఫీసర్లు మంగళవారం హైదరాబాద్ కోఠిలో రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, తదితర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు, నర్సింగ్ ఆఫీసర్లు మాట్లాడుతూ కోవిడ్ కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యోగాలు చేశామని గుర్తుచేశారు. రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ల స్థానంలో ఇంతకాలం పని చేసిన వారిన తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఐదేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యారోగ్యశాఖలోని ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌వన్నీ 420 హామీలు

- కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి ఇచ్చిందే కాంగ్రెస్
- అమరులకు నివాళ్లర్పించని వ్యక్తి.. నేడు సీఎం :

షాద్‌నగర్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-షాద్‌నగర్

కాంగ్రెస్ పార్టీ 420 దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పగించిందే కాంగ్రెస్ అని తెలిపారు. తెలంగాణ కోసం పుట్టిన పార్టే బీఆర్ఎస్ అని, రాష్ట్ర హక్కుల విషయంలో ఎప్పుడూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారని, ఎప్పుడూ కూడా జై తెలంగాణ అనని వ్యక్తి, ఉద్యమకారులపైకి తుపాకి పట్టుకొని వెళ్లిన వ్యక్తి నేడు సీఎం అయ్యాడని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు అమరవీరులకు నివాళి అర్పించలేదని, ఈ విషయంలో తాను ఎంతో కలత చెందానని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో షాద్‌నగర్ ఎంతో క్రియాశీలకంగా పాల్గొన్నదని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, మళ్లీ స్పీడ్ అందుకుంటామని తెలిపారు. కరోనా కాలంలో కూడా రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ఓడినా, గెలిచినా ఎప్పటికీ ప్రజల పక్షమేనని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. హామీల గురించి అడిగితే అసెంబ్లీలో తప్పుడు శ్వేత పత్రాలతో డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారని, వాస్తవాలు బయట పెడితే తిట్టడం మొదలు పెట్టారని అన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో వచ్చి అబద్ధాలు మాట్లాడరని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80శాతం పూర్తి అయ్యాయని, కాలవలు తవ్వితే నీళ్ళు వస్తాయని, కాంగ్రెస్ వాళ్ళు ఆ పని పూర్తి చేసి నీళ్ల అందియ్యాలన్నారు. స్వరాష్ట్రంలోనే పాలమూరుకు మెడికల్ కాలేజీలు వచ్చాయన్నారు. అక్రమ కేసులకు కార్యకర్తలు భయపడొద్దని, ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ గడ్డపై మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దీని కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. అంతకుముందు తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, అలాగే దివంగత గాయకుడు సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నటరాజన్, నాయకులు రాజవరప్రసాద్‌రావు, ఇబ్రహీం, రాంబాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నిపుణుల బృందం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను రాష్ట్ర డ్యాం సెఫ్టీ అథారిటీ బృందం, సాంకేతిక, ఇంజినీరింగ్ నిపుణుల బృందం మంగళవారం పరిశీలించింది. ఇరిగేషన్ ఈఎన్‌సీ(అడ్మిన్) అనిల్‌కుమార్, నిపుణులు మొరం రాములు, దేశ్ సాయి నేతృత్వంలో డ్యాం సెఫ్టీ బృందం పరిశీలించారు. ముందుగా అన్నారం బ్యారేజ్ వద్దకు చేరుకొని 39 పియర్ వద్ద ఏర్పడిన సీపేజీని పరిశీలన చేశారు. బ్యారేజ్ 4వ బ్లాక్‌లోని డౌన్ స్ట్రీమ్ 38,39 పియర్ల మధ్య గల వెంట్ వద్ద ఏర్పడిన సీపేజీను పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. బ్యారేజీ సమస్యలు, పలు అంశాలపై ఈఈ యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్ 7లోని దెబ్బతిని, కుంగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నది గర్భంలో బ్యారేజ్ కిందికి వెళ్లి 20పియర్ పగుళ్లను, ఆ ప్రాంతంలో నీటి ప్రవాహం, ఇసుక మేటలనూ పరిశీలించారు.

యాదాద్రిలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

- రెండోసారి ఎందుకు పెట్టారు
- ప్రభావిత గ్రామాలకు నష్ట పరిహారం ఇవ్వాలి : జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను మళ్లీ ఎందుకు పెట్టాల్సి వచ్చిందో ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయం సేకరణ జరిగింది. ఇందులో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఏర్పాటు చేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ఆ సమయంలో విదేశీ బొగ్గు వాడుతామని చెప్పారని, దానివల్ల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి కాలుష్యం, ప్రాణాపాయం ఉండదని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు స్వదేశీ బొగ్గును వాడేందుకు చూస్తున్నారని, దీనిపై న్యాయస్థానానికి వెళ్లడం వల్ల మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని చెప్పారు. ఎందుకు స్వదేశీ బొగ్గు వాడుతున్నారో, మాట మార్చాల్సిన అవసరం ఎందుకొచ్చిందో ప్రజలకు వివరించాలన్నారు. ప్లాంటు నిర్మాణం సమయంలో 40శాతం గ్రీనరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఒక్క మొక్క కూడా నాటలేదని చెప్పారు. ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని.. ఇప్పుడు గ్రీనరీ లేక, చెట్లు లేక గాలి, నీరు కలుషితమవుతున్నాయని.. దాని ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి పంట పూర్తిగా దిగుబడి తగ్గిపోయిందని తెలిపారు.ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న నర్సాపురం, వాడపల్లి, మరికొన్ని గ్రామాలను కూడా బాధిత గ్రామాలుగా చేర్చి అక్కడి రైతులకు పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. ప్రాజెక్టు ప్రభావితం చూపే ప్రాంతం వరకు అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.రంగారెడ్డి మాట్లాడే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు.

మిగులు భూమి లెక్క తేల్చాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంలో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పట్నం ప్రధాన కార్యదర్శి డిజి. నర్సింహరావు మాట్లాడుతూ ఢిల్లీ రైతుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇండ్ల స్థలాలు, సాగు భూమి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ భూమి కోసం రాష్ట్రంలో జరుగుతున్న పోరాటంలో మహిళలు వీరోచితంగా పోరాడి జైలుకెళ్లారనీ, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా భూ కేంద్రాల్లో ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు.

పట్టాలు పురుషుల పేరున కాకుండా మహిళల పేరున ప్రభుత్వం పంచాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరల నేపథ్యంలో పేదలు ఇండ్ల స్థలాలు కొనే పరిస్థితి లేదనీ, అర్హులైన పేదలందరికీ పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ 2016లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 22 లక్షల మంది ఇండ్లు లేని పేదలున్నారనీ, ఇప్పుడాసంఖ్య 30 లక్షలకు చేరుకుందని చెప్పారు. 2015లో ఇచ్చిన జీవో 58 ప్రకారం ఇండ్లు లేని అర్హులైన పేదలందరికి 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద కార్మికులందరికి న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన హామీలు అమలు చేయకుంటే మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ సైతం గత ప్రభుత్వం లాగానే నిర్బంధాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. జగిత్యాల భూ పోరాట కేంద్రంలో గుడిసెలేసుకున్న వారిపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దాడులు చేయించి కేసులు బనాయించారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కోయపోశం గూడెం పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు పోవాలని సూచించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నిలువ నీడ లేని పేదలకు భూమిపై హక్కుందని చెబుతున్న రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రభుత్వాలు నిర్బంధాన్ని సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటంలో సవాళ్లను ఎదురించి పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, తదితర తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారులో తొలి ప్రాజెక్టుకు శంకుస్థాపన

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు శ్రీకారం


నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ప్రాజెక్టుకు బుధవారం శంకుస్థాపన జరగనుంది. ఈమేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2945.5 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. మక్తల్, నారాయణపేట, కోడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. సీఎం రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి దీని కోసం ప్రయత్నం చేస్తున్న సంగతి తెలిసిందే.

వివాహమైతే విధుల నుంచి తొలగిస్తారా ?

ఆ మిలటరీ నిబంధనలు లింగ వివక్ష, రాజ్యాంగ విరుద్ధమే : సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : వివాహం చేసుకుంటున్నందుకు లేదా ఇంట్లో సమస్యలున్నందుకు మహిళా ఉద్యోగులను వారి ఉద్యోగాల నుండి తొలగించాలని కోరుతున్న నిబంధనలు 'తీవ్రమైన లింగ వివక్ష' కిందకు వస్తాయని, అవి పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మహిళకు పెళ్లైందనే కారణంతో ఆమెను ఉద్యోగం నుండి తొలగించడం దారుణమైన లింగ వివక్షకు, అసమానతలకు నిదర్శనమని కోర్టు ఇటీవల జారీ చేసిన ఒక ఉత్తర్వులో వ్యాఖ్యానించింది. ఇటువంటి పితృస్వామ్య నిబంధనను ఆమోదించడం మానవ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొంది. లింగ ప్రధానమైన పక్షపాతాల ప్రాతిపదికన చట్టాలు, నిబంధ నలు రూపొందించడం రాజ్యాంగపరంగా అనుమతి యోగ్యం కాదని స్పష్టం చేసింది. మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో మహిళా పర్మినెంట్ కమిషనర్ ఆఫీసర్ హక్కులను పరిరక్షిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఆమె వివాహం చేసుకుంటో ందన్న కారణంగా ఆమెను విధుల నుండి తొలగించారు. మాజీ లెఫ్టినెంట్ సెలీనా జాన్‌కు 8వారాల్లోగా పూర్తిగా 60లక్షల రూపాయిలను నష్టపరిహారంగా చెల్లించాలని జస్టిస్ సంజయ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది. ఆమెకు అనుకూలంగా రూలింగ్ ఇచ్చిన సాయుధ బలగాల ట్రిబ్యులన్ లక్నో బెంచ్ నిర్ణయానికి వ్యతిరేకంగా కేంద్రం అప్పీల్ చేసింది. ఆమెను సర్వీసు నుండి తొలగించడమనేది 'తప్పు, అక్రమం' అని స్పష్టం చేసింది.



ఇండియన్ కోస్ట్ గార్డ్‌ల్లో మహిళలను సమానంగా చూడాలి

మహిళా ఆఫీసర్లకు పర్మినెంట్ కమిషన్‌ను తిరస్కరించినందుకు కేంద్రం, ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి)లపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. మహిళలను కూడా సమానంగా చూసేలా ఒక విధానాన్ని రూపొందించాలని కోస్ట్ గార్డ్ బలగాలను ఆదేశించింది. ఐసిజిలో అర్హత గల వుమెన్ షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్లకు శాశ్వత నియామకాన్ని మంజూరు చేయాలని కోరుతూ మహిళా అధికారి ప్రియాంక త్యాగి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం విచారణ జరిపింది.

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు ఊమంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆచార వ్యవహారాలతో పగిడిద్దరాజును పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. అనంతరం అక్కడ నుంచి మేడారానికి అటవీ మార్గంలో కాలినడకన కర్లపెల్లి, గుండ్లవాగు మీదుగా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం చేరుకుంటారు. గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో రాత్రి బస చేయడానికి పగిడిగిద్దరాజు పూజారుల కోసం నిర్మించిన భవనాన్ని మంగళవారం మంత్రి సీతక్క ప్రారంభించారు. పగిడిద్దరాజు పూజారులు బుధవారం మధ్యాహ్నం జంపన్నవాగు వద్దకు చేరుకుంటారు. అలాగే, కన్నాయిగూడెం మండలం కొండాయి నుంచి గోవిందరాజులును పూజారి దబ్బకట్ల గోవర్దన్ తీసుకొని బుధవారం సాయంత్రం జంపన్నవాగు సమీపంలోకి వస్తారు. ఆ తర్వాత సారలమ్మను తీసుకొనివచ్చే క్రమంలోనే పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా తీసుకొని వచ్చి మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠిస్తారు.

నేటి నుంచి మేడారం మహాజాతర

నేడు గద్దెలకు సారలమ్మ, రేపు సమ్మక్క.

కన్నెపల్లిలో తొలుత ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సారలమ్మ దేవాలయంలో అధికారిక లాంఛనాలతో పూజలు చేస్తారు. అనంతరం ప్రధాన పూజారి కాకసారయ్యతో పాటు ఇతర పూజారులు సారలమ్మను ఆదివాసీల డోలు, కొమ్మువాయిద్యాలతో తీసుకొని బుధవారం మేడారం గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. గురువారం మధ్యాహ్నం చిలుకలగుట్టలోని సమ్మక్క దేవాలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత ప్రధాన పూజారి కొక్కెర కృష్ణ సమ్మక్కను తీసుకుని బయలుదేరుతారు. ఈ క్రమంలో అధికారిక లాంఛనాలలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్కకు ఆహ్వానం పలుకుతారు. భారీ భద్రత నడుమ, రోప్ పార్టీ మధ్యలో పూజారులు, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆధ్వర్యంలో సమ్మక్కను పూజారి కొక్కెర కృష్ణ తీసుకుని గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. శుక్రవారం నాటికి గద్దెలపై సమ్మక్క, సారలమ్మ, పగడిద్దరాజు, గోవిందరాజులు కొలువుతీరి ఉండటంతో ఆదివాసీలు మొక్కులు సమర్పించుకుంటారు. జాతర ముగింపులో భాగంగా ఈనెల 24న సాయంత్రం సమ్మక్క, సారలమ్మల వనప్రవేశం నేపథ్యంలో పగిడిగిద్దరాజును తీసుకొని పూజారులు మళ్లీ పూనుగొండ్ల గ్రామానికి చేరుకొని 26వ తేదీన దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. ఈనెల 28, 29 మార్చి 1వ తేదీలలో తిరుగువారం జాతర జరుపుకుంటారు.

జాతరకు రూ.105 కోట్లతో ఏర్పాట్లు

మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లతో వివిధ శాఖల కింద పలు పనులను ప్రారంభించి పూర్తి చేసింది. జాతర విజయవంతానికి మంత్రి సీతక్కతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పలుమార్లు మేడారం వచ్చి ఏర్పాట్లను సమీక్షించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, మినీ డంపింగ్ యార్డులనూ ఏర్పాటుచేశారు. పారిశుద్ధ్యం నిర్వహణకు 4000 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. జాతరలో నిరంతర విద్యుత్ నందించడానికి కొత్తూర్, మేడారంలలోని సబ్‌స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మేడారంలోని కళ్యాణమండపంలో రూ. ఒక కోటితో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు.

12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తు

మేడారంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ నాయకత్వంలో 12 వేల మంది సిబ్బందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 500 సీసీ కెమెరాలతో మొదటిసారి శాశ్వత ప్రాతిపదికన రూపొందించిన పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి జాతరతోపాటు పరిసర ప్రాంతాలను పర్యవేక్షించనున్నారు.

సంపాదకీయం

నాణ్యతేది..?

ఇటీవల యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఎఎస్ఇఆర్) తన తాజా నివేదికను విడుదల చేసింది. ఆ లెక్కలు చూస్తూ మన భావిభారతం పరిస్థితి ఏంటనే భయం కలుగుతోంది. దేశంలో నాణ్యమైన విద్య కొరవడిందని ఆ రిపోర్ట్ తేల్చి చెప్పేసింది. దీనికి ప్రభుత్వ అలసత్వమే ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత, వారి విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఎఎస్ఇఆర్ 2005లో తన అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటి వరకు మూడు నివేదికలు విడుదల చేసింది. తాజాగా గతేడాది విడుదలైన నివేదికైతే పాఠశాల విద్యపై ఆందోళన వ్యక్తం చేసింది. 14-18 ఏండ్ల మధ్య విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది చాలా బలహీనంగా ఉందని ఆవేదన చెందుతోంది. పునాదే బలహీనంగా ఉంటే ఇక దానిపై నిర్మించబోయే భవనం పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విద్యార్థి దశలో బలమైన పునాది లేకపోవడంతో యువత సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారని, ఇది కూడా నిరుద్యోగానికి ఓ కారణమని ఆ నివేదిక చెబుతోంది.

> కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం - 2020 తీవ్రమైన అసమానతలతో కూడుకొని ఉందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు మొదటి నుండి అంటూనే ఉన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందని నెత్తీనోరూ కొట్టుకుంటూనే ఉన్నారు. సిలబస్ మార్పిడి పేరిట శాస్త్రీయ భావాలను తొలగించడమే దీనికి ఉదాహరణ. మేధావులను తయారు చేసే విశ్వవిద్యాలయాల్లో మూఢనమ్మకాలు పెంచిపోషించే జ్యోతిష్య, వాస్తు, భూత వైద్యాన్ని ప్రవేశపెట్టారంటే భావిభారతం పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో విద్యావంతులైన వారందరికీ ఉద్యోగాలు లభించడం లేదు. పట్టభద్రుల్లో 45శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారని మెర్సర్ మెటిల్ సంస్థ రూపొందించిన నివేదిక తెలిపింది. భారత్‌లో విద్యనభ్యసించి పట్టభద్రులైన వారిలో నైపుణ్యం పరిమితంగా ఉంటుందని గతేడాది ఏప్రిల్‌లో విడుదలైన బ్లూమ్‌బర్గ్ నివేదిక నిగ్గుతేల్చింది. 'ప్రపంచాన్ని మార్చగలిగే శక్తిమంతమైన ఆయుధం విద్య' అన్నాడు నెల్సన్ మండేలా. అంటే ప్రజల జీవన ప్రమాణాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు వారికి అందించే విద్యపై మాత్రమే ఆధారపడి ఉంటాయి. ఏ దేశమైనా అభివృద్ధి చెందిందంటే అక్కడ విద్యాభివృద్ధి ఉన్నట్టే. దేశ ప్రగతికి సాధనం విద్య. ప్రపంచంలో కొన్ని దేశాలలో అత్యుత్తమ విద్యా విధానం అమల్లో ఉన్నట్టు కొన్ని లెక్కలు చెబుతున్నాయి. ఆయా దేశాల్లో విద్యకు అవసరమైన నిధులు కేటాయించి అందరికీ కనీసం హైస్కూల్ వరకైనా సమాన విద్యను అందించడమే




దీనికి కారణమని కూడా అవే లెక్కలు తేల్చాయి. కాబట్టే ఆయా దేశాలు అభివృద్ధి చెందాయి. అయితే ఇవేవి మన ప్రధాని కండ్లకు కనబడడం లేదు. తమ పరిపాలనా, వ్యాపార సౌలభ్యం కోసం నాడు విదేశీ పాలకులు మెకాలే విద్యా విధానం అమలు చేస్తే నేటి మన బీజేపీ పాలకులు తమ కుర్చీని సుస్థిరం చేసుకునేందుకు అంతరాల విద్యను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం ఉచిత నిర్బంధ విద్య అందించాల్సిన ప్రభుత్వాలు ఆ నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్ విధానాలకు వత్తాసు పలకుతున్నాయి. ఇది దేశ ప్రగతి నిరోధిస్తుంది. నాణ్యమైన విద్య మాత్రమే యువతను సమాజ అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తుంది. కానీ మన దేశంలో గత 30 ఏండ్లుగా విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ బాట పట్టిందనేది ఎవ్వరూ కాదనలేని సత్యం. ఫలితంగా సామాన్యులు నాణ్యమైన విద్యకు దూరమయ్యారనేది కూడా పచ్చి నిజం.

ఇక కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం - 2020 తీవ్రమైన అసమానతలతో కూడుకొని ఉందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు మొదటి నుండి అంటూనే ఉన్నారు. కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందని నెత్తీనోరూ కొట్టుకుంటూనే ఉన్నారు. సిలబస్ మార్పిడి పేరిట శాస్త్రీయ భావాలను తొలగించడమే దీనికి ఉదాహరణ. మేధావులను తయారు చేసే విశ్వవిద్యాలయాల్లో మూఢనమ్మకాలు పెంచిపోషించే జ్యోతిష్య, వాస్తు, భూత వైద్యాన్ని ప్రవేశపెట్టారంటే భావిభారతం పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే దేశాన్ని పెను ప్రమాదంలోకి నెట్టేసే అంశాలు నూతన విద్యా విధానంలో ఎన్నో ఉన్నాయి.

ఇలాంటి విద్యా విధానం సామాన్యులకు నాణ్యమైన చదువును దూరం చేస్తుందనడంలో, అసమానతలు మరింత పెంచిపోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కనుక ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అభివృద్ధికి అవసరమైన విద్యా విధానాన్ని ప్రభుత్వం అమలు చేయకపోతే సామాన్యులు నాణ్యమైన విద్యకు మరింత దూరమవ్వడం ఖాయం. మరీ ముఖ్యంగా శాస్త్రీయ, లౌకిక, ప్రజాతంత్ర విద్యా విధానాన్ని మానవీయ విలువలు పెంపొందించే విధంగా రూపొందించాల్సి బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అయితే నిత్యం హిందూ, కార్పొరేట్ల జపంలో తరించే బీజేపీ ఈ బాధ్యత తీసుకుంటుందనే నమ్మకం ప్రజలు పూర్తిగా కోల్పోయారు. కనుక పాలకుల కనుసన్నల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టి, విద్యా వ్యవస్థను కాపాడుకోవల్సిన బాధ్యత పౌర సమాజంపై ఎంతైనా ఉంది. ఇప్పటికే కార్మిక, కర్షకులు ఏకమై కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలపై పోరాడేందుకు సిద్ధమయ్యారు. వారితో విద్యార్థులు, యువత, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావేత్తలు సైతం భుజం కలిపే సమయం ఆసన్నమయ్యింది.

దేశానికి కావాల్సింది 'ఎర్ర కాగితాలు'



ఆర్. రఘు
9490098422

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 ఓట్‌ఆన్ ఎకౌంటు బడ్జెట్ ప్రవేశపెడుతూ 2014లో తాము అధికారంలోకి వచ్చేవరకు పాలించిన ప్రభుత్వాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా భ్రష్టు పట్టించాయో (తమ వాజ్‌పాయ్ పాలన ఆరేళ్లనూ దాన్లో కలపాలనుకు న్నట్టుంది) శ్వేత పత్రం (తెల్ల కాగితాలు) ద్వారా తేల్చిపారేస్తానని హూంకరించారు. దానికి ప్రతిగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖార్గే మీ పదేండ్ల పాలన బండారం తేల్చడానికి బ్లాక్ పేపర్ (నల్ల కాగితాలు) ప్రవేశపెడతానని ధీటుగా ప్రకటించారు. వీరిద్దరూ చెప్పే దాంట్లో అబద్ధాల మాట ఎలా ఉన్నా ఒక నిజం మాత్రం ఉంది. 75 ఏండ్లు దేశాన్ని పాలించిన వీరు, మధ్యలో తొంగిచూసిన జనతా, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాలు కలిసి మొత్తం మీద దేశాన్ని అధోగతి పాలు చేశాయన్నది మాత్రం వాస్తవం. పార్టీల అభిమానాల్ని పక్కనపెట్టి వాస్తవాలను వాస్తవాలుగా పరిగణించి పరిశీలిస్తే డెబ్బయి అయిదేండ్లుగా నడిచిన ఆర్థిక విధానాలు కొన్ని తాత్కాలిక ఉపశమనాలను కల్పించినా ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపలేకపోయా యన్నది యదార్థం.

వామపక్షాలు అధికారంలోకి వచ్చిన కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ముందుకు తెచ్చిన ప్రత్యామ్నాయాలను సహించలేని పాలక పార్టీలు ప్రారంభం నుండి కమ్యూనిస్టు పార్టీ పైన, వారి సైద్ధాంతిక అంశాల మీద దాడి చేస్తూనే ఉన్నాయి. 2008లో యూపీఏ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును వామపక్షాలు ఉపసంహరించుకున్న సందర్భంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ "హమ్మయ్య మా కాళ్లకి ఉన్న సంకెళ్లు తెగిపోయాయి. ఇక స్వేచ్ఛగా ఆర్థిక సంస్కరణలను (ఉదారవాద ఆర్థిక విధానాలను) అమలు చేసుకోవచ్చని" బడా పెట్టుబడిదారుల తరఫున ఊపిరి పీల్చుకోవడం మనం చూసాం. కానీ ఆ రోజు వామపక్షాలు ఒత్తిడి వలనే గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి వచ్చాయన్న సంగతి మనం మర్చిపోగలమా? ఏమైనా ఆ తరువాత క్రమంగా వామపక్షాలు బలహీనపడటంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఒకే తరహా ఆర్థిక విధానాలు, పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గ అనుకూల ఆర్థిక విధానాలు అమలులోకి రావడం మొదలైంది. సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడి తీవ్రతరమైంది. ఆ దేశాల ప్రాపకం కోసం అర్రులు చాచడం ప్రారంభమైంది. పాలకవర్గ పార్టీలు జయప్రదంగా పాలకవర్గాల గురించి, ఆ వర్గాల ప్రయోజనాల గురించి, వాటి కోసం వారు పడుతున్న తాపత్రయం గురించి మాత్రం ప్రజల్లో చర్చలు రాకుండా జాగ్రత్త పడగలుగుతున్నాయి. "ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోలేనం తకాలం ప్రజలు పదేపదే మోసపోతూనే ఉంటారు" అని ఓ ఎర్ర కాగితంలో లెనిన్ చెప్పాడు

గ్యారెంటీగా గ్యారెంటీ లేని గ్యారెంటీలు!

ఎన్నికల సీజన్ వచ్చింది. పోటీలు తీవ్రంగా ఉండనున్నాయి. 'మోడీజీ గ్యారెంటీ', 'కాంగ్రెస్సే భవిష్యత్తుకు గ్యారెంటీ' నినాదాలు ఆకాశాన్నంటుతున్నాయి. నిజానికి ఈ తతంగం కొత్తేమీ కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గరీబీ హటావో, రైతు సాధికారిత, మహిళా సాధికారిత, దేశం వెలిగిపోతోంది, తాజాగా ఆత్మ నిర్భర భారత్, స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, స్వర్ణాంధ్ర, బంగారు తెలంగాణ, వికసిత భారత్, సబ్‌కా సాత్- సబ్‌కా వికాస్... ఇలా అన్ని రాష్ట్రాల్లోనూ, అన్ని భాషల్లోనూ పాలక పార్టీల ప్రభుత్వాలు ఎన్నికల వేళ మరింత బిగ్గరగా హోరెత్తిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టిన నాటి నుండి దాన్ని బలపరిచే రాజకీయ పార్టీలన్నింటినీ పీడించే సమస్య, దాన్నే వారి ఆయుధంగా మలుచుకునే సమస్య 'పేదరికం'. మనదేశంలో కూడా పేదరికం నిర్మూలనకు సవాలక్ష పథకాలున్నాయి. కొన్ని రద్దయ్యాయి, కొత్తవి వస్తున్నాయి. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అయినా పేదరికానికి శాశ్వత పరిష్కారం వీళ్లకి దొరకటం లేదు. ఆ పేదరికం ఆకలిని, రక్తహీనతను, న్యూనతను, వివక్షను, అసమానతలను సృష్టిస్తున్నది. నేడు పెట్టుబడిదారీ ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మూలం కూడా ఈ పేదరికాన్ని నిర్మూలించలేని దానిలోని వైరుధ్యమే. కానీ నిన్నటి కన్నా ఈ రోజు మెరుగా? గత ప్రభుత్వం కన్నా నేటి ప్రభుత్వం మెరుగా? అని ఆలోచించటం తప్ప మరో మార్గం లేదన్నట్లు బూర్జువా రాజ్యం నిరంతరం ప్రజల మనస్సులను నింపేస్తూనే ఉంటుంది.

పేదరికంపై ఎర్ర కాగితాలేమి చెబుతున్నాయి ?

సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వ సొమ్మును పంచి పెట్టడం వలన ప్రజలు సోమరులవుతున్నారని, ఆ సొమ్ముకు అలవాటు పడి కూలీకి రావటం లేదని పాలకవర్గాల ప్రతినిధులు వాపోతున్నారు. మధ్యతరగతిలో కూడా ఈ భావనకు మంచి గిరాకీ వచ్చింది. అలా అధికారంలో ఉన్న పార్టీలను తిట్టిన ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి రాగానే కొత్త రాగం ఎత్తుకుంటున్నాయి. మోడీ 'రేవడీ' (పాలకోవా) అంటే ఉచితాలకు మేము వ్యతిరేకమని చెబుతూనే సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ఉంటాడు. నిర్మలా సీతారామన్ స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి తమ ప్రభుత్వం 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేశారంటారు. కానీ మోడీజీ 80 కోట్ల మందికి అందిస్తున్న ఉచిత రేషన్ (బియ్యం,గోధుమలు) మరో ఐదేండ్లు కొనసాగించటం తమ గొప్పగా చెబుతున్నారు. 80 కోట్లమంది అంటే దాదాపు 57 శాతం మంది నిరుపేదరికంలో ఉన్నారనేగా!? అందువలన పేదరికం నిర్మూలించాలంటే పేదరికాన్ని చూసే చూపు మారాలి. పేదరికం పెట్టుబడిదారులు, వారి ఆర్థిక శాస్త్ర పండితులు చెబుతున్నట్లు అది జబ్బు కాదు, అది పెట్టుబడిదారీ విధానం అనే జబ్బు సృష్టించే లక్షణం. "పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు బలపడే కొద్ది అవి సరళమైన, ఏకోన్ముఖమైనవి కావని, ద్విముఖమైనవని రోజురోజుకి అర్థమవుతుంది. ఒక పక్క సంపద ఉత్పత్తి అవుతుంటే మరోపక్క పేదరికం ఉత్పత్తి సమాంతరంగా జరుగుతూ ఉంటుంది". (తత్వశాస్త్ర దారిద్ర్యం - మార్క్స్) కానీ పెట్టుబడిదారీ వర్గం వారి పండితులు మాత్రం "ప్రకృతిలో ప్రతి జననం అప్పుడు వచ్చే పురిటి నొప్పులు లాగా పారిశ్రామిక అభివృద్ధిలో పేదరికం అనేది ఉంటుంది" (అదే గ్రంథం) అని బుకాయిస్తూ ఉంటారు. పేదరికం నిర్మూలన కోసం ఆర్థిక శాస్త్ర పాండిత్యం కావాలని పాకులాడనక్కర్లేదు. "తమ కండ్ల ముందు ఏం జరుగుతుందో గ్రహించి దాన్ని ప్రచారం చేస్తే సరిపోతుంది. మనం ఎంతకాలం శాస్త్ర పరిజ్ఞానం కోసం వెతుకుతూ, ప్రణాళికలు రూపొందిస్తూ పోరాట ప్రారంభంలోనే ఉండిపోతామో పేదరికంలో పేదరికాన్ని మాత్రమే చూస్తాం. దాంట్లో పాత సమాజాన్ని కూలదోసే విప్లవాత్మక, విధ్వంసకర పాత్రను చూడలేము" (పై గ్రంథం నుండి) అని కార్ల్‌మార్క్స్ ప్రకటించాడు.

> 2008లో యూపీఏ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును వామపక్షాలు ఉపసంహరించుకున్న సందర్భంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ "హమ్మయ్య మా కాళ్లకి ఉన్న సంకెళ్లు తెగిపోయాయి. ఇక స్వేచ్ఛగా ఆర్థిక సంస్కరణలను (ఉదారవాద ఆర్థిక విధానాలను) అమలు చేసుకోవచ్చని" బడా పెట్టుబడిదారుల తరఫున ఊపిరి పీల్చుకోవడం మనం చూసాం. కానీ ఆ రోజు వామపక్షాలు ఒత్తిడి వలనే గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి వచ్చాయన్న సంగతి మనం మర్చిపోగలమా?

ఎర్రకాగితాలే (రెడ్ బుక్స్) శరణ్యం

ప్రపంచవ్యాప్తంగా ఎర్ర పుస్తకాల కోసం వెతుకులాట ప్రారంభ మైంది. కారణం నేటి ప్రపంచానికి ప్రత్యామ్నాయం కావాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ సమస్యలను పరిష్కరించలేని నిర్జీవస్థితికి జారుతూ ఉంటే, ప్రత్యామ్నాయం కోసం వెతుకులాట అనివార్యం. మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి, అనివార్యంగా వచ్చే సంక్షోభం గురించి ఏమి చెప్పాడని తెలుసుకోవడానికి ఆయన రాసిన పెట్టుబడి గ్రంథాన్ని పెట్టుబడి దారీ మేధావులు తిరగేస్తున్నారు. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమైతే రావలసింది సోషలిజమేనన్న సహజ సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించగలగాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్లీనంగా అభివృద్ధి చెందే ప్రాథమిక వైరుధ్యానికి పరిష్కారమే సోషలిజం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సమాజపరంగా ఉంటుంది. పంపిణీ వ్యక్తి పరంగా ఉంటుంది. అంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ కష్టించి సృష్టించే సంపదని కొద్దిమంది హస్తగతం చేసుకుంటూ ఉంటారు. సంపదను కూడా ఉత్పత్తి లాగా సమాజపరం చేయడం ద్వారా అంటే సోషలిస్టు వ్యవస్థ నిర్మించుకోవడం ద్వారా అన్ని ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు దొరుకుతాయి.

> మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి, అనివార్యంగా వచ్చే సంక్షోభం గురించి ఏమి చెప్పాడని తెలుసుకోవడానికి ఆయన రాసిన పెట్టుబడి గ్రంథాన్ని పెట్టుబడి దారీ మేధావులు తిరగేస్తున్నారు. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమైతే రావలసింది సోషలిజమేనన్న సహజ సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించగలగాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్లీనంగా అభివృద్ధి చెందే ప్రాథమిక వైరుధ్యానికి పరిష్కారమే సోషలిజం.

గతంలో రష్యా, తూర్పు యూరప్ దేశాలలో నేడు చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తరకొరియా, లావోస్ వంటి సోషలిస్టు దేశాలలో సంక్షోభరహిత ఆర్థిక అభివృద్ధి కనబడుతుంది. అందువలనే పెట్టుబడిదారీ పాలకులు, వారి పార్టీలు ఎన్నికల చుట్టూ, సంక్షేమ పథకాల చుట్టూ పరిభ్రమించేటట్లు ప్రజల్ని తిప్పుతున్నారు. ఇప్పుడు బంతి కమ్యూనిస్టులు, వామపక్షాలు, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులు, పార్టీల కోర్టులో పడింది. ఈ శక్తులు ప్రస్తుతం బలహీనంగా ఉన్నా వేగంగా ఆ బలహీనతను అధిగమించాలి. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక పోరాటాలను పెంపొందించాలి. అందుకు కఠోర కృషి చేయాలి. మార్క్సిస్టు శాస్త్ర మౌలిక గ్రంథాలను (రెడ్ బుక్స్) అధ్యయనం చేయాలి. ఈ సందర్భంగా అత్యున్నత ఎర్ర పుస్తకం కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ముగింపులో కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు వక్కాణించి "కమ్యూనిస్టు విప్లవాన్ని చూసి పాలకవర్గాలని వణకనివ్వండి. శ్రామికులు తమ సంకెళ్లను తప్ప కోల్పోయేదేమీ లేదు. వారికి గెలవాల్సిన మరో ప్రపంచం ఉంది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి!!" ఈ మాటలు మననం చేసుకుంటూ కార్యోన్ముఖులు కావాలి.

(ఫిబ్రవరి 21 'రెడ్‌బుక్స్‌డే')

> గిరిజనుల, దళితుల, ప్రజల మధ్య చిచ్చుపెట్టే పని ఈరోజు ఆర్ఎస్ఎస్ చేస్తున్నది. ఇప్పటివరకు కలిసున్న, కలిసి తిన్న, మన మధ్య చిచ్చుపెట్టే పని చేస్తున్నది. సర్వమత సమ్మేళనంగా జరిగే ఈ మహా జాతరను కులం పేరుతో, మతం పేరుతో విచ్ఛిన్నం చేయజూస్తున్నది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆదివాసులు, దళితులు, బడుగు బలహీన వర్గాలు తాము సహజ సిద్ధంగా జరుపుకొనే మహా వీరవనితల జాతరలో వీరి బ్రాహ్మణ జోక్యాన్ని నివారించాలి.

బడుగుల మహా జాతర

సమ్మక్క సారక్క




ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరు నాగారం అడవుల్లోని ఆదివాసీ గూడాల్లో ఎగిసిపడ్డ అగ్గిపిడుగులు సమ్మక్క సారక్కలు. కాకతీయ రాజుల పెత్తనంపై సివంగుల్లా తిరగబడ్డ యోధులు. వారి అమరత్వానికి గుర్తుగా ప్రజలు జరుపుకునే మహా ఉత్సవమే మేడారం జాతర. నేటి నుండి ఆ మహాజాతర ప్రారంభం కాబోతోంది. ఒక కుగ్రామమైన మేడారం ఈ రెండు రోజులు మహాజనసంద్రంగా మారుతుంది. ఆ వీరవనితల చారిత్రక పోరాటగాథను ముక్తకంఠంతో నినదిస్తుంది. 12వ శతాబ్దంలో శిస్తుల పేరుతో కాకతీయుల పీడనకు, పెత్తనాలకు వ్యతిరేకంగా సమ్మక్క, సారక్క, జంపన్న పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఆదివాసీల సంస్కృతి, ప్రాకృతిక సంస్కృతి. చనిపోయిన తాత ముత్తాతలను పూజించడం వారి సంప్రదాయం. అలాంటి సంప్రదాయంలో తమ జాతికోసం యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వారిని ఆదివాసులందరూ వీరులుగా కొలిచారు. నిత్యం వారి త్యాగాలను, తెగువను, చరిత్రను స్మరించుకున్నారు. తమ ముందు తరాలకు కథలుగా చెప్పడం ప్రారంభించారు. తమ భావితరాలు వారిలా తలవంచకుండా బతకాలని భావించి, వారి త్యాగాన్ని మించిన వేడుక లేదని ఒక మహా జాతర ప్రారంభించారు.

ఆదివాసుల సాంప్రదాయం ప్రకారం వారి వంశస్తులే పూజారులుగా వ్యవహరిస్తారు. సమ్మక్క సిద్దబోయిన ఆడబిడ్డ కనుక ఆ సిద్దబోయిన కుటుంబమే సమ్మక్క గద్దెల వద్ద ఇప్పటివరకు పూజారులుగా ఉన్నారు. సారక్క కాక ఇంటి వంశస్తురాలు, అందుకే కాక ఇంటి పేరు ఉన్నవారే సారక్క గద్దె వద్ద పూజారులుగా ఉన్నారు. ఈ సమ్మక్క సారక్కలకు పూజ ప్రాకృతికమైనది. విగ్రహారాధనకు పూర్తిగా సంబంధం లేనిది. కేవలం గద్దెలకు మొక్కడమే వీరి పద్ధతి. అందుకే చేను చెలక, చెట్టు చేమా, గొడ్డు గోదా వీరి దేవుళ్ళు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతే ఆదివాసుల దైవం. రెండేండ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి ముందు బుధ, గురు, శుక్రవారాలు పండుగ చేస్తారు. వారం రోజులపాటు అట్టహాసంగా కుల, మతాలకు వ్యతిరేకంగా ఈ జాతర జరుగుతుంది. సర్వమత సమ్మేళనంగా ఈ జాతర ఉంటుంది. బుధవారం రోజు కన్నెపల్లి గ్రామం నుంచి కుంకుమ భరణి, కంక బొంగు(వెదురు)ను సారక్కగా కాక వంశస్తులు తీసుకొని సాయంత్రం నాలుగు గంటల వరకు మేడారంలోని ఆమె గద్దెకు చేరుస్తారు. అదేరోజు కొత్తగూడ మండలం పోనుగండ్ల కామారం నుండి దాదాపు 100 కిలోమీటర్ల దూరం నుండి ఆదివారం ప్రారంభమై బుధవారం సాయంత్రం వరకు పగిడిద్దరాజుని మేడరానికి తీసుకొని వస్తారు. గురు వారం రోజున చల్లపేయను (పిల్లలు కనని ఆవు) బలి ఇచ్చి, ఇప్పపువ్వు సార తాగి చిలకల గుట్ట నుండి సమ్మక్కను గురువారం రోజు గద్దెకు చేరుస్తారు. శుక్రవారం రోజున మొక్కులు అప్పజెప్పితే శనివారం ఆ తల్లులు గద్దెకు చేరుతారని ఆదివాసుల నమ్మకం. నిజానికీ 1950వరకు ఆ ప్రాంతానికే పరిమితమై ఈ జాతర ఉండేది. ఆ తర్వాత చుట్టూ పక్క గ్రామాలకు పాకింది. 1980 తరువాత ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ నుండి ఎక్కువగా వచ్చే వారు. కాలక్రమేణా నాలుగు రాష్ట్రాల నుండి జనం తండోపతండాలుగా వస్తున్నారు. 2000 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇతర రాష్ట్రాల నుండి కోటి మందికి పైగా ఈ జాతరకు వస్తున్నారు. రెండేండ్లకు ఓసారి జరిగే ఈ సమ్మక్క సారక్క జాతర ఆసియాలోనే అతిపెద్ద జాతరగా గుర్తింపు తెచ్చుకుంది.ఈ జాతరలో బ్రాహ్మణ సమాజంలో ఉన్న ఉపవాసాలు, వెజిటేరియన్ భోజనాలు, ఆంక్షలు, వివక్షా పద్ధతులూ, ఆడవాళ్లు రావద్దు అనే పద్ధతులు ఏవీ ఉండవు. అంతేకాక ఫుడ్ డెమోక్రసీ ఉంటుంది. 'ఏదైనా తిను, ఏమైనా తాగు, అవి అయ్యాకే నన్ను దర్శనం చేసుకో' అనేది ఈ జాతర ప్రత్యేకత. కానీ క్రమేణా బ్రాహ్మణవాదులు ఈ జాతరను ఆవహిస్తున్నారు. రాజకీయాలకోసం, మతాధిపత్యం కోసం హిందుత్వ సంప్రదాయాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. హిందూ, ముస్లిములు కూడా ఈ జాతరకు వస్తారు. వారు ఎలా తింటారు, ఎలా ఉంటారనేది వాళ్ల ఇష్టం. కానీ కొత్తగా జాతరలో హలాల్ చేయొద్దని ఒక చర్చను కొత్తగా ఆర్ఎస్ఎస్ తీసుకొస్తున్నది. అందరూ కలిసి చేసుకునే జాతరలో కులాల, మతాల పేరుతో చిచ్చులు పెట్టే పని చేస్తున్నది. దాంట్లోకి ఆదివాసులను లాగే ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటివరకు ఏ కులం, ఏ మతానికి సంబంధం లేకుండా నడిచే ఈ జాతరను భ్రష్టు పట్టించే పని కి పూనుకుంది. ఆర్ఎస్ఎస్ లక్ష్యం ఈ దేశంలో ఒకే దేవుడు ఉండాలి. కానీ ఈరోజు ఈ జాతరకు ఇంత మంది వస్తున్నారు కనుక దాన్ని కబ్జా చేసి హిందుత్వాన్ని చొప్పించాలనేది వారి ప్రయత్నం. అసలు ఆదివాసులు ఏ రకంగా హిందువులు అవుతారు. ఆదివాసులు ఒక తెగ. ఏ మతంతోనూ వారికి సంబంధం లేదు. కానీ ఈ ఆదివాసీ జాతరను హిందూ పండగగా మార్చాలని, ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తున్నది. మరి సమ్మక్కని తీసుకొచ్చేటప్పుడు చల్ల పేయను బలిచ్చి తింటారు కదా! మరి వారు దాన్ని వీరు అంగీకరిస్తారా? విగ్రహారాధన ఉండదు. బ్రాహ్మణ మంత్రాలు ఉండవు...వీటిని ఆమోదిస్తారా? చిన జీయర్ స్వామి సమ్మక్క సారక్కలను విమర్శించినప్పుడు వీరు నోరు మెదుపలేదు. "సమ్మక్క సారక్క లేమన్నా బ్రహ్మలోకం నుండి దిగొచ్చారా... జాతర ఒక వ్యాపారం" అని ఆయన అన్నప్పుడు ఆర్ఎస్ఎస్ ఏమీ మాట్లాడకుండా ఎందుకు నోరు మూసుకుంది? పైగా పరోక్షంగా మద్దతు ఇచ్చింది. గిరిజనుల, దళితుల, ప్రజల మధ్య చిచ్చుపెట్టే పని ఈరోజు ఆర్ఎస్ఎస్ చేస్తున్నది. ఇప్పటివరకు కలిసున్న, కలిసి తిన్న, మన మధ్య చిచ్చుపెట్టే పని చేస్తున్నది. సర్వమత సమ్మేళనంగా జరిగే ఈ మహా జాతరను కులం పేరుతో, మతం పేరుతో విచ్ఛిన్నం చేయజూస్తున్నది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆదివాసులు, దళితులు, బడుగు బలహీన వర్గాలు తాము సహజ సిద్ధంగా జరుపుకొనే మహా వీరవనితల జాతరలో వీరి బ్రాహ్మణ జోక్యాన్ని నివారించాలి.



బీరెడ్డి సాంబశివ
9490300329

'తెలుగు'కు ఏది వెలుగు?



మేకిరి దామోదర్
9573666650

ప్రపంచంలో నేడు సృజనకు, వినూత్నతకు పట్టం కడుతున్న వేళ.. ఈ సృజన, వినూత్నత ఎక్కడి నుంచి వస్తుంది? మాతృభాష బతికితేనే సృజన పుడుతుంది, వినూత్నత విచ్చుకుంటుంది. విద్యా విజ్ఞానం వాటి నుంచి విరాజిల్లుతుంది. ఇది పరిశోధనలో తేలిన శాస్త్రీయతే కదా!. దీనిని కాదనగలరా? మాతృభాష అంటే వట్టి అక్షరాల పోగు కాదు. తల్లి పేగు నుంచి గర్భస్థ శిశువుకు ప్రాణధార ఎలా ప్రవహిస్తుందో, తల్లి భాష నుంచి మనిషికి జ్ఞానధార అలానే సంక్రమిస్తుందనేది శాస్త్రీయంగా రూఢీ అయింది. అలాంటి మాతృభాష పరిరక్షణ కోసం కొందరు యువకులు ప్రాణాలర్పించిన "ఫిబ్రవరి 21వ తేదీని" ఐక్య రాజ్యసమితి సాంస్కృతిక విభాగమైన యునెస్కో" అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా" ప్రకటించింది. ప్రపంచంలో ఆంగ్లభాష అనే రోడ్డురోలర్ కింద పడినలిగిపోతున్న మాతృభాషలెన్నో..! భాష అనేది ఆ జాతికి తల్లి వేరు అని యునెస్కో గుర్తించింది. ఏ మాతృభాష అంతరించినా మానవ మేధలో కొంత భాగం అంతరించినట్లే. అంతేకాదు ఆ జాతి సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి అనేక వెలకట్టలేని రూపాలైన ఆచార వ్యవహారాలు, సామెతలు, నానుడులు, చమత్కారాలు, జాతీయాలు, మౌఖిక, లిఖిత ఆ ప్రాంత సమాచార సంగతులు సర్వం అంతరించిపోతాయి. "మాతృభాష కన్నయితే ఆంగ్ల భాష కళ్లజోడు" లాంటిది. అసలు కళ్లుంటే? కదా కళ్లజోడుతో పని పడేది. నేడు ఆధునిక వైద్యశాస్త్రం నవజాత శిశువుకు తల్లిపాలు తప్పనిసరి తాగించాలి, బొడ్డు (పేగు) తాడు మూలకణాల్ని భద్రపరిస్తే భవిష్యత్తు ఆపత్కాలంలో ఎనలేని మేలు జరుగుతుందని చెబుతుంది. అలాగే ఆయా జాతులకు జీవనాడి, సంస్కృతికి, మూల కణాలకు, సహజ వికాసానికి మారుపేరైన మాతృభాషను ఇంతగా నిర్లక్ష్యం చేయరాదు. మాతృభాషలో బోధన జరపడం అంటే పరభాషను నేర్చుకోవద్దని కాదు. ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలో తప్పనిసరి చేసి, ఉన్నత విద్యలో తెలుగును ఒక విషయంగా ఉంచినప్పుడే భాష మనుగడలో ఉండగలదు. ఆ తరువాత ఎన్ని భాషలు అయినా నేర్చుకోవచ్చు. రాజ్యాంగంలో పొందుపరచుకున్నట్లు మాతృ భాషలను రక్షించుకుంటూ అన్యభాషలు నేర్చుకుందాం. అంతే కాదండోయ్ ప్రపంచంలో సొంతభాషను నమ్ముకుని అభివృద్ధి చెందిన దేశాలు జపాన్, చైనా, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ లాంటివి వారి వారి మాతృభాషల్లోనే విశ్వ విద్యాలయ స్థాయి వరకూ విద్యాబోధనాభ్యాసన చేస్తున్నారు. పాలనలోనూ అవే భాషలను ఉపయోగిస్తూ ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన వారి చిత్తశుద్ధి నుంచి స్ఫూర్తి పొందాల్సి ఉంది. ప్రపంచీకరణ ముసుగులో ఆంగ్ల మాధ్యమాన్ని అద్దాల మేడలో చూపిస్తూ మాతృభాషను పురిటి నొప్పులకు గురిచేస్తున్న కార్పొరేట్‌శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాలపై, సమాజం పైనే ఉంది. మాతృభాషను మృతభాషగా మారడానికి ముమ్మాటికీ ప్రభుత్వాలు, చదువుకున్న తెలుగు సమాజం, మానవ నిర్లక్ష్యమే కారణం. చదువుకోని జనం నాల్కలపై నడయాడిస్తూ భాషను బతికిస్తున్నారు. ఆధునిక ప్రపంచీకరణ యుగంలో పేదోడి పిల్లలకేమో మాతృభాష మాధ్యమంలో బోధన, పెద్దోడి పిల్లలకేమో ఆంగ్ల చదువులు అనే భేదాభిప్రాయాలు పొడచూపుతున్నాయి. అందుకే పాలకులు పేదోడి పిల్లలైనా, పెద్దోడి పిల్లలైనా ఒకే పాఠశాలలో చదివేలా విద్యా విధానంలో సమూల మార్పులు చేయాలి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యలోనైనా, సర్కారు బడిలోనైనా మాతృభాష తప్పనిసరి చేయాలి. ఏ రాష్ట్రంలోనైనా ఏ దేశంలోనైనా ప్రపంచంలో ఎక్కడైనా ఏ మాతృభాషకైనా పెను ప్రమాద సంకేతా నికి కారణం అది మాట్లాడే వారి సంఖ్య క్రమేపి తగ్గిపోతుండటం వల్లనే. భావ వ్యక్తీకరణకు మాతృ భాషను సాధనంగా వినియోగించే వారు తగ్గిపోతుంటే? ఆ భాష ఉనికికే పెను ప్రమాదం పొంచి ఉంది. అలాగే నెమ్మదిగా నశించి పోతుంది. అలా భారత్‌లో 1961 నాటికి 1652 భాషలు వినియోగంలో ఉండేవి. 2011 నాటికి అందులో 280 పైగా అంతరించిపోయాయి. మాట్లాడే వారి సంఖ్య నానాటికి తగ్గడం వల్ల తెలుగు కనుమరుగయ్యే ముప్పు పొంచి ఉందని భాషా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఐదు దశాబ్దాల పాటు దేశంలో అత్యధికులు మాట్లాడే భాష జాబితాలో తెలుగు మూడో స్థానంలో



కొనసాగేది. నేడది హిందీ, బెంగాలీ, మరాఠీల తర్వాత నాలుగో స్థానానికి పరిమితమైంది. సైబర్ శకం, డిజిటల్ యుగంలో భాషలు మరింత వేగంగా ప్రాధాన్యం కోల్పోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏకత్వంలో భిన్నత్వానికి, సాంస్కృతిక వైవిధ్యానికి నెలవైన భారతావనిలో భాషలు మన ఘన వారసత్వానికి ప్రతీకలు. ఆసంపదే నాగరికతకు గట్టి పునాది. అది ఇప్పుడు బీటలు వారుతోంది!.

మన దేశ జనాభాలో తెలుగు మాట్లాడేవారు 1971 నాటికి 8.16శాతం ఉండేవారు. నాలుగు దశాబ్దాలలో 6.7 శాతానికి పడిపోయారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మాతృభాషపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అందువల్ల పతన కొనసాగుతూనే ఉందన్న ఆందోళన మాతృభాష అభిమానులలో పెరిగిపోతోంది. ఎందుకింతటి దుస్థితి దాపురించింది?. అమ్మ భాషను పాఠశాల గుమ్మంలోనే వదిలి పెట్టాల్సి వస్తున్న దురవస్థ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను చావు దెబ్బతీస్తుందంటూ జాతీయ సాధన సర్వే (నాస్), అసర్-2023 లాంటి సర్వేలు సమస్య మూలాలను స్పృశించాయి. మాతృభాషలో పట్టులేని వారు ఇతర భాషల్లోని నైపుణ్యాలు ఒడిసి పట్టలేరన్న నిజాన్ని పరభాష మోజులో పడి మనవారు గుర్తించడం లేదు. ఇది "అంధుడికి అద్దం ఇవ్వడం లాంటిదే" అన్న మేధావుల హెచ్చరికలను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు, ఆంగ్లంలో చదివితేనే తమ పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్న తల్లిదండ్రుల భావన చాలామందిని ఆంగ్లభాష వైపు మళ్లిస్తుంది. అన్నింటా మాతృభాష వినియోగం పెరిగితేనే కాపాడుకోగలం. దీనికి ప్రభుత్వాలే విశేషకృషి, ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ నియామకాల్లో అమ్మ భాషకు, తెలుగు మాధ్యమానికి పెద్దపీట వేయాలి. మన తెలంగాణ ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల్లో తెలుగు వినియోగాన్ని పెంపొందిం చడానికి గట్టి కృషి చేయాలి. తేనెలొలికే తెలుగు రుచిని పసినాలుకలకు పంచి, వారిలో మాతృభాషపై అనురక్తిని పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులు అందిపుచ్చు కోవాలి. తెలుగు గడ్డపై అమ్మ భాషకు ప్రాణప్రతిష్ఠ చేయడానికి ఆధునిక సాంకేతిక ఉపకరణాల్లో తెలుగును వాడటానికి ఉపయోగపడేలా ఆధునికరించే కృషి తక్షణమే చేపట్టాలి. తెలుగును ప్రపంచ భాషగా గుర్తించేలా ఆధునీక రించాలి. సాంకేతిక నిపుణులు, భాషావేత్తలు, పాలకులు, తెలుగుజాతి చిత్తశుద్ధితో కృషిచేయాలి. ఏ భాషైనా వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం ద్వారానే అభివృద్ధి చెందుతుంది. ప్రతి ప్రభుత్వ శాఖలో, పాలన, న్యాయ, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరగాలి. తెలుగు మాధ్యమాలు చదివేవారికి సరియైన భవిష్యత్తు, ప్రత్యేక అవకాశాలు కల్పించబడాలి. అప్పుడే తెలుగుభాష వెలుగొందుతుంది.

> అమ్మ భాషను పాఠశాల గుమ్మంలోనే వదిలి పెట్టాల్సి వస్తున్న దురవస్థ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను చావు దెబ్బతీస్తుందంటూ జాతీయ సాధన సర్వే (నాస్), అసర్-2023 లాంటి సర్వేలు సమస్య మూలాలను స్పృశించాయి. మాతృభాషలో పట్టు లేని వారు ఇతర భాషల్లోని నైపుణ్యాలు ఒడిసి పట్టలేరన్న నిజాన్ని పరభాష మోజులో పడి మన వారు గుర్తించడం లేదు. ఇది "అంధుడికి అద్దం ఇవ్వడం లాంటిదే" అన్న మేధావుల హెచ్చరికలను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు, ఆంగ్లంలో చదివితేనే తమ పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్న తల్లిదండ్రుల భావన చాలామందిని ఆంగ్ల భాష వైపు మళ్లిస్తుంది. అన్నింటా మాతృభాష వినియోగం పెరిగితేనే కాపాడుకోగలం. దీనికి ప్రభుత్వాలే విశేష కృషి, ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది.





ప్రపంచ గమనం

రోజురోజుకూ బలహీనపడుతున్న ఉక్రెయిన్ - మస్క్



రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ ఓటమి పాలవుతుందని, భవిష్యత్తులో జరగబోయే శాంతి చర్చలలో ఉక్రెయిన్ పరిస్థితి మరింతగా బలహీనపడుతుందని ఎలన్ మస్క్ ఒక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ప్రకటనలో పేర్కొన్నాడు. అమెరికాలోని ఉక్రెయిన్ మద్దతుదారుల్లో ఆందోళన పెరుగుతోందని, ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు ఉక్రెయిన్‌కు సహాయం అందించటానికి ఉద్దేశింపబడిన 60బిలియన్ల సహాయ బిల్లును అడ్డుకుంటున్న విషయం తెలిసిందేనని మస్క్ సోమవారం ఒక ఎక్స్ కామెంట్‌లో తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. "చాలామంది దష్టిలో ఇదే ఉక్రెయిన్ అందుకోబోయే ఆఖరి పెద్ద సహాయం. అందుకోసం ఉక్రెయిన్ ఏమైనా చేస్తుంది "అని తన పే పాల్ మిత్రుడు డేవిడ్ శాక్స్‌తో మాట్లాడుతూ మస్క్ అన్నాడు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కాల్పుల విరమణకు, శాంతి చర్చలకు ఇదే తగిన సమయమనీ, ఈ యుద్ధంలో ఉక్రెయిన్ ఓడిపోయిందనీ, ఈ వాస్తవాన్ని మార్చలేమని కూడా ఫైనాన్షియల్, జనరల్ వార్తలపై స్పందించే ఒక పాపులర్ వాల్ స్ట్రీట్ సిల్వర్ అకౌంట్ తన స్పందనలో పేర్కొంది. అంతేకాక ఒకవేళ అమెరికా సహాయం అందినా యుద్ధంలో పరిస్థితి ఉక్రెయిన్‌కు అనుకూలంగా మారజాలదని కూడా ఆ స్పందన ఊహిస్తోంది. "ఈ వాస్తవాన్ని గుర్తించటానికి ముందు ఎంతమంది చనిపోవాలి అన్నదే మిగిలిన ప్రశ్న" అని పైస్పందనతో ఏకీభవిస్తూ మస్క్ ప్రకటించాడు. ఒక సంవత్సరం క్రితమే శాంతి ఒప్పందం జరిగి వుండాల్సిందని, అప్పటి నుంచి వేలాది యువ సైనికులు చనిపోయారని, ఉక్రెయిన్ పరిస్థితి రోజురోజుకూ మరింతగా బలహీనపడుతోందని కూడా మస్క్ అన్నాడు.

2022లో ఇరు దేశాల మధ్య సాయుధ సంఘర్షణ మొదలైన తరువాత కొద్ది రోజులకే రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందం దాదాపు కుదిరింది. అయితే అంతిమంగా పశ్చిమ దేశాలిచ్చిన భరోసాతో ఉక్రెయిన్ సదరు శాంతి ఒప్పంద ముసాయిదాను తిరస్కరించి రష్యాను ఓడించటమే తమ లక్ష్యం అని ప్రకటించింది. అమెరికా

నిర్ద్వందంగా ఉక్రెయిన్‌కు అండగా వుంటుందని అప్పటి బ్రిటీష్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరాన్ని దర్శించి మరీ ఇచ్చిన వాగ్దానం వల్లనే రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమయ్యాయని ఉక్రెయిన్ తరపున చర్చలలో పాల్గొన్న డేవిడ్ అరఖామియా గత సంవత్సరం అంగీకరించాడు. ఉక్రెయిన్ యుద్ధం " ఎలా మొదలయింది, ఎలా నడుస్తోంది, ఎలా ముగియగలదు" అనే విషయాలన్నీ "అబద్ధాల హెూరు"లో మునిగి తేలుతున్నాయనే శాక్స్ వాదనతో మస్క్ అంగీకరించాడు.

"బ్రెజిల్ అధ్యక్షుడికి ఇజ్రాయిల్‌లో ప్రవేశం నిషిద్ధం"



గాజాలో హమస్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధం గురించి బ్రెజిలియన్ ప్రెసిడెంట్ చేసిన వ్యాఖ్యపై ఇజ్రాయిల్ తీవ్రంగా స్పందించింది. గాజాలో ఇజ్రాయిల్ చర్యలు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నాజీలు లక్షలాది యూదులను కిరాతకంగా హతమార్చిన విషయాన్ని గుర్తుకు తెస్తున్నాయని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ప్రకటించటంతో ఆయనను 'ఇజ్రాయిల్ ఆహ్వానించదగిన వ్యక్తి కాదు(పర్సోనా నాన్ గ్రాటా)అని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి బ్రెజిల్ రాయబారిని పిలిచి చెప్పటం జరిగింది. ఒక దేశ అధ్యక్షుడిని పర్సోనా నాన్ గ్రాటా గా ప్రకటించటం మూర్ఖత్వం అని లూలా ప్రధాన సలహాదారు సెల్సో అమోరిమ్ ప్రకటించాడు. గాజాలో హమస్ మిలిటెంట్లపై దాడి పేరుతో ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై సాగిస్తున్న దాడులను "మానవ హననం" అని, ఇది 80 ఏండ్ల క్రితం హిట్లర్ పాలనలో లక్షలాది యూదుల ఊచకోతను పోలివుందని గత వారాంతంలో లూలా వర్ణించాడు. పాలస్తీనాను ఒక రాజ్యంగా గుర్తించటానికి ఇజ్రాయిల్ నిరాకరిస్తోందని ఆదివారం నేతాన్యాహు ప్రకటించాడు.ఇజ్రాయిల్‌తో పాటుగా పాలస్తీనాను కూడా ఒక దేశంగా గుర్తించాలని అంతర్జాతీయ సమాజం ఎప్పటినుంచో విజ్ఞప్తి చేస్తోంది. ఇజ్రాయిల్ తనను పర్సోనా నాన్ గ్రాటా గా ప్రకటించిన తరువాత లూలా తమ రాయబారి మేయర్ ను చర్చల కోసం బ్రెజిల్ కు రమ్మని ఆదేశించాడు. లూలా తన మాటలకు కట్టుబడి ఉన్నట్టు ప్రకటించాడు. అంటే ఇజ్రాయిల్ లోని బ్రెజిల్ రాయబారి కార్యాలయం ఇకనుంచి ఒక చార్జ్ డి అఫైర్స్ ఆధ్వర్యంలో నడుస్తుంది. గాజాపైన ఇజ్రాయిల్ చేస్తున్న మారణహెూమంలో ఇప్పటికే 35000 పాలస్తీనా ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. వీరిలో అత్యధిక శాతం మహిళలు, పిల్లలు. గాజాను నేలమట్టం చేసిన ఇజ్రాయిల్ అక్కడ నివసిస్తున్న 20లక్షల పాలస్తీనా వాసులను ఈజిప్ట్ కు తరలించాలని అనేకమంది ఇజ్రాయిలీ ప్రభుత్వాధికారులు

ప్రయత్నిస్తున్నారు. జెనొసైడల్ కన్వెన్షన్ కింద దక్షిణ ఆఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో గాజాపైన ఇజ్రాయిల్‌చేస్తున్న మారణహెూమం గురించి వేసిన కేసులో కోర్టు అటువంటి చర్యలకు పాల్పడవద్దని ఇజ్రాయిల్ ను ఆదేశించింది.

మేడారానికి 6వేల ప్రత్యేక బస్సులు

- జిల్లాల్లో 51 క్యాంపులు ఏర్పాటు : టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క, సారక్క జాతరకు ఆరువేల ప్రత్యేక బస్సుల్ని నడుపుతున్నట్టు టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. తెలంగాణ కుంభమేళాగా ప్రాచుర్యం పొందిన ఈ జాతరకు ప్రయాణీకులు ఆర్టీసీ సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బస్సులు ఇప్పటికే మేడారానికి వెళ్లాయనీ, ముఖ్యంగా యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉండే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో 51 క్యాంపులను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని తెలిపారు. ఈ జాతరకు ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకం అమల్లో ఉంటుందనీ, మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చని వివరించారు. జాతర ప్రత్యేక బస్సుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో రెగ్యులర్ సర్వీసులను తగ్గించామని చెప్పారు. దీనివల్ల సాధారణ ప్రయాణికులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందనీ, ప్రత్యేక పరిస్థితుల్లో ఆర్టీసీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మాటే మంత్రం...

- 'సురభి' వాయిస్ స్పీచ్ వర్క్‌షాప్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాట...విలువ కట్టలేని వ్యక్తిత్వానికి నిలువెత్తు సాక్ష్యం. ఆ మాటను మృదుమధురంగా చెప్పగలిగితే ఎదుటి వ్యక్తులు సమ్మోహితులు కావల్సిందే. అందరూ మాట్లాడతారు. కానీ కొందరే ఆకట్టుకోగలుగుతారు. మాట్లాడే మాటలో స్వర సంబంధం, స్పష్టత, గాంభీర్యం, మృదుత్వం, లాలింపు ఉంటే వినడానికి వినసొంపుగా ఉంటాయి. మనం నిత్యం మాట్లాడే మాటలకు కొంత శిక్షణ తోడైతే, ఆ చిలుక పలుకులకు ఉండే ప్రాధాన్యతే ప్రత్యేకం. దానికితోడు 'మాటనే పెట్టుబడిగా పెట్టి ఉపాధి అవకాశాలు పొందొచ్చు. ఇలాంటి మాటలకు శిక్షణ ఇచ్చి, ఆత్మస్థైర్యంతో కూడిన వ్యక్తిత్వ వికాసాన్ని అందించేందుకు సురభి కళా క్షేత్రం సిద్ధమైంది. మాటల స్వర స్థాయిల్ని తెలుసుకుని, ఎవరి రంగంలో వారు గుర్తింపు పొందే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రముఖ రేడియో జాకీ (ఆర్‌జే), వాయిస్ అండ్ యాక్టింగ్ ట్రైనర్ డాక్టర్ సురభి రమేష్ నేతృత్వంలో ఈనెల 25 నుంచి వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. నెలరోజుల ఈ శిక్షణా శిబిరంలో డబ్బింగ్, స్టోరీ టెల్లింగ్, పాడ్ కాస్ట్, న్యూస్ రీడింగ్, పబ్లిక్ స్పీకింగ్, స్క్రిప్ట్ రీడింగ్ వంటి అనేక అంశాలపై శిక్షణ ఇస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట, యశోదా ఆస్పత్రి పక్కనే ఉన్న దుర్గా అపార్ట్‌మెంట్‌లో శిక్షణా తరగతులు ఉంటాయి. మరిన్ని వివరాల కోసం సురభి రమేష్‌ను ఫోన్ నెంబర్లు 9490423885, 6309413885 లో సంప్రదించవచ్చని మంగళవారం నాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.

చంపేస్తున్న ఒత్తిడి

- పెరుగుతున్న గుండెపోటు కేసులు: ఆందోళన కలిగిస్తున్న యువవైద్యుల మరణాలు
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న సీనియర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చికిత్స చేసి ప్రాణాలు పోయాల్సిన వృత్తి వారిది. కాని ఒత్తిడి సమస్య వారినే పొట్టన పెట్టుకుంటున్నది. వారిలో గుండెపోటుకు గురవుతున్న కేసులు పెరుగుతున్నాయి. హార్ట్ ఎటాక్‌లకు గురై మరణిస్తున్న యువ వైద్యులు, మెడికోలు ఎక్కువవుతుండంతో ఆ రంగంలో పని చేస్తున్న సీనియర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జూనియర్లకు సూచిస్తున్నారు. అంతర్లీనంగా ఈ వృత్తిలో ఉన్న ఒత్తిడి నిర్వహణలో విఫలం కావడమే ఇలాంటి పరిణామాలకు దారి తీస్తున్నదని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఇదే అభిప్రాయాన్ని పలువురు సీనియర్ డాక్టర్లు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాదిలో వైద్యేతర విద్యార్థుల్లో లక్ష మందిలో 12 మంది ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యల చేసుకుంటుంటే, ఈ వృత్తిలో ఉన్నవారు లక్షకు 30 మంది ఉండటం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కేరళ విభాగం 10 వేల మంది డాక్టర్లపై పదేండ్ల పాటు చేసిన అధ్యయనంలో కూడా ఇలాంటి ఫలితాలే వెల్లడయ్యాయి. అధ్యయన కాలంలో 289 మంది చనిపోగా అందులో 27 మంది గుండెకు సంబంధించిన ఇబ్బందితో ప్రాణాలొదిలారు. ఈ అధ్యయనంలో మరో ఆసక్తికర విషయం వెల్లడైంది. కేరళలో సామాన్యులు సగటున 74 ఏండ్లు బతుకుతుండగా, డాక్టర్ల సగటు వయస్సు 62 కావడం గమనార్హం. ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ ఉత్తర భారతదేశంలో 787 మంది మెడికల్ విద్యార్థులపై అధ్యయనం చేసి జర్నల్‌లో ప్రచురించింది. వీరిలో 37 శాతం మంది ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు చేయడం, 10 శాతం మంది ఎలా ఆత్మహత్య చేసుకోవాలనే ప్లాన్ వేసుకున్నట్టు, 3.3 శాతం మంది ఆత్మహత్య ప్రయత్నాలు చేసినట్టు వెల్లడించింది. కరోనా సమయంలో ప్రజల్లో సంభవించిన ఆకస్మిక మరణాలపై కూడా ఐసీఎంఆర్ మరో పరిశోధన చేసింది. ఇలా మరణించిన వారిలో ఎక్కువగా చనిపోవడానికి 2 గంటల ముందు ఎక్కువగా మద్యం సేవించడం, డ్రగ్స్ తీసుకోవడం, గుండెకు సంబంధించిన ఇబ్బందులున్న కుటుంబ నేపథ్యం, అతి తీవ్రంగా వ్యాయామం చేయడం తదితర కారణాలున్నట్టు తేలింది.

చికిత్స చేసే వారికి చికిత్స అవసరమని ప్రజారోగ్య కమిటీ సూచించిందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రంగారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి డాక్టర్ హెల్త్ చెకప్ చేయించి డేటాబేస్ నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ప్రతి ఐఎంఏ వైద్యునికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తక్షణావసరమని డాక్టర్ వెంకటరత్నం అభిప్రాయం వ్యక్తం చేశారు. తద్వారా హైరిస్క్ ఉన్న వారిని గుర్తించే వీలుంటుందని తెలిపారు. వత్తిలో రాణించి అందరిచేత ప్రముఖులు అనిపించుకునే తపనతో యువ వైద్యులు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం కనిపిస్తున్నదని డాక్టర్ సంతోష్ సీహెచ్ తెలిపారు. ప్రతి రోజు ఒకట్రెండు గంటలు తమ కోసం తాము ప్రత్యేకంగా కేటాయించుకోవాలని డాక్టర్ మహానంద చౌదరీ సూచించారు. తమ శక్తి మించిన విలాసవంతమైన వాటి కోసం రుణాలు తీసుకోవడం, విశ్రాంతి లేకుండా పని చేయడం కూడా ఇలాంటి విపరిణామాలకు దారి తీస్తున్నదని డాక్టర్ పెద్దినేని శ్రీకాంత్ తెలిపారు.

బ్యాలెన్స్ అవసరం

- డాక్టర్ కిరణ్ మాదాల



తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేసుకోవాల్సిన అవసరముందని ఐఎంఏ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కిరణ్ మాదాల సూచించారు. వైద్య విద్యార్థులపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. చదువు మొదలుకొని ఆలస్యంగా స్థిరపడటం, అనుకున్న స్థాయిలో సంపాదన లేకపోవడం తదితర కారణాలు ఒత్తిడిని పెంచుతున్నాయని చెప్పారు. కేవలం ర్యాంకుల ఆధారంగానే కాకుండా ప్రజల అవసరాలు, సమాజంలో డిమాండ్ మేరకు కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. గతంలో క్లినిక్‌లు నడిచేవని, కానీ మారిన పరిస్థితుల్లో వాటికి అంతగా రాబడి ఉండటం లేదనీ, దీన్ని దృష్టిలో ఉంచుకుని జీవనోపాధికి ఉన్న అవకాశాలను ఎంపిక చేసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

టీజీవో నూతన అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాసరావు

- ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ తిరిగి ఎన్నిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టీజీవో) సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శిగా ఎ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా బి శ్యామ్, ఉపాధ్యక్షులుగా ఎ జగన్ మోహన్‌రావు, కోశాధికారిగా ఎం ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా ఎ పరమేశ్వర్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా జి దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మాచర్ల రామకృష్ణగౌడ్, కార్యనిర్వాహక సభ్యులుగా పంతంగి యాదగిరిగౌడ్, సలహాదారులుగా టి రవీందర్‌రావు, జి పురుషోత్తమ్‌రెడ్డి, వాంకుడోత్ సురేష్‌లు ఎన్నికయ్యారు. వారు మూడేండ్లపాటు ఈ పదవుల్లో ఉంటారు. అంటే 2027 వరకు లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగుతారు. రిటర్నింగ్ అధికారులుగా ఎస్ రవి, సిహెచ్ సంపత్ కుమార్ వ్యవహరించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం అధికారులుగా శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు.

ప్రభుత్వానికి ప్రజల్లో మంచిపేరు తెస్తామన్నారు. తమ జెండా, ఎజెండా ఉద్యోగుల సంక్షేమం మాత్రమేనని స్పష్టం చేశారు. గెజిటెడ్ అధికారుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామ ని చెప్పారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం త్వరలో విడుదల చేయించడానికి, మెరుగైన పీఆర్సీ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాష్ట్రంలో గెజిటెడ్ అధికారులకు మెరుగైన వేతన సవరణ కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామనీ, న్యాయబద్ధమైన డిమాండ్లను సాధిస్తామని వివరించారు. సీపీఎస్ అంశం, ఈకుబేర్‌లో ఉన్న బిల్లుల విడుదల, 317 జీవో సమస్య, సాధారణ బదిలీల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి బైలాను పూర్తిగా మారుస్తామనీ, సవరి స్తామని చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించి త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానాన్ని ఆమోదించామని వివరించారు.

జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్ రూ.7,937 కోట్లు

- కౌన్సిల్ ఆమోదం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2024-25 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.7,937కోట్లకు ఆమోదం లభించింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ప్రారంభమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశంలో శానిటేషన్, అడ్వర్‌టైజ్‌మెంట్‌పై విచారణకు కౌన్సిల్ ఆమోదించింది. సభలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ప్రాపర్టీ టాక్స్, ఫుడ్, హెల్త్‌పై చర్చ జరిగింది. ఆర్థిక సంవత్సరం 2024 -25కి సంబంధించిన బడ్జెట్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ప్రవేశపెట్టారు. రూ.7,937 కోట్ల వార్షిక బడ్జెట్‌ను జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో సమర్పించారు. సాధారణ బడ్జెట్ రూ.7937 కోట్లు కాగా, డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు మేయర్ వివరించారు. జీహెచ్‌ఎంసీకి మేజర్ ఆదాయ వనరు పన్ను వసూళ్లని, బల్దియాలో ఆస్తి పన్ను సక్రమంగా వసూలు చేయాలని, బకాయిలపై దృష్టి సారించాలని కార్పొరేటర్లు కోరారు. ఆస్తి పన్ను చెల్లింపులకు వన్ టైం సెటిల్‌మెంట్ పథకం మళ్లీ అమలు చేయాలని, అందుకు కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు. రెసిడెన్షియల్ పేరుతో ఓయో రూమ్స్‌ను కమర్షియల్‌గా నడిపిస్తున్నారని, ఫ్యామిలీస్ ఉన్న ప్రాంతాల్లో ఓయో బిజినెస్ చేస్తున్నారని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయితే, విమర్శలు ప్రతి విమర్శలతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ సభ్యులు పలుమార్లు మేయర్ పోడియం వద్దకు దూసుకొచ్చారు. మేయర్ వారిని నివారించే ప్రయత్నం చేశారు.

ఓయో వ్యాపారంపై విచారణ చేస్తాం: జీహెచ్‌ఎంసీ కమిషనర్

ప్రాపర్టీ టాక్స్ అనేది జీహెచ్‌ఎంసీ ఆదాయానికి ముఖ్యమైన అంశం అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. త్వరలో డోర్ నెంబర్స్‌తోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని వివరాలను జీఎస్‌ఐ మ్యాప్‌లో పొందపరుస్తామన్నారు. టాక్స్ వసూళ్లలో కొన్ని సమస్యలున్నాయని తెలిపారు. రెసిడెంట్స్, నాన్ రెసిడెంట్స్‌పై వేర్వేరు రేట్లు ఉన్నాయని వివరించారు. ఓయో హాస్టల్స్, వ్యాపారంపై విచారణ చేసి పన్నులు వసూలు చేస్తామని తెలిపారు. డిగ్నిటీ హౌసెస్‌కు డోర్ నెంబర్లు వేసేందుకు యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టినట్టు తెలిపారు.

అరబ్ ప్రాంతంలో పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగం !

- 9.8 శాతానికి చేరుతుందంటూ ఐఎల్‌ఓ హెచ్చరిక

బీరుట్ : అరబ్ ప్రాంతంలో నిరుద్యోగం పెచ్చరిల్లుతోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) పేర్కొంది. 2024లో ఈ నిరుద్యోగం రేటు 9.8 శాతంగా వుండగలదని భావిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అరబ్ లేబర్ మార్కెట్‌లో పరిస్థితులు అత్యంత 'సంక్లిష్టం'గా వున్నందున అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని పిలుపిచ్చింది.

అరబ్ జాతీయులు, శరణార్థుల మధ్య తేడాలు చూపడం, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య తేడాలుండడం వంటి కారణాలు ఇందుకు కారణమని నివేదిక పేర్కొంది. జీసీసీయేతర దేశాలకు, అస్థిరత, ఘర్షణలు, సంక్షోభాలు, బలహీనమైన ప్రైవేటు రంగం, జనాభా ఒత్తిళ్ళు వంటి ఇతర కారణాలు కూడా వున్నాయని నివేదిక పేర్కొంది. అరబ్ దేశాల ఉపాధి, సామాజిక దృక్పథం - ధోరణులు 2024 పేరుతో ఐఎల్‌ఓ ప్రాంతీయ డైరెక్టర్ జరదత్ ఈ నివేదికను విడుదల చేశారు.

లేబర్ మార్కెట్లలో అవకాశాలను పెంచడానికి అనుసరించాల్సిన పరిష్కారాలను గుర్తించడంలో ఈ నివేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు జరదత్ తెలిపారు. అంతేకాకుండా అరబ్ ప్రాంత వ్యాప్తంగా శాంతి, సుస్థిరతలు నెలకొనడానికి కూడా దోహదపడుతుందని అన్నారు. ఉపాధి కావాలనుకునేవారికి అత్యంత నాణ్యమైన ఉద్యోగాలను ఉత్పత్తి చేయడంలో ఆర్థిక వ్యవస్థల అశక్తత వల్లనే ఉపాధి రంగానికి పలు సవాళ్ళు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొంది.

పర్యవసానంగా సగానికి పైగా కార్మికులు అనియత, అభద్రత కలిగిన ఉద్యోగాల్లో వుంటున్నారని, వారికి ఎలాంటి సామాజిక భద్రత లేదా ఇతర ప్రయోజనాలు లేవని ఆ నివేదిక పేర్కొంది.

కాశ్మీర్‌లో తొలి ఎలక్ట్రిక్ రైలు



కాశ్మీర్: కాశ్మీర్‌లో తొలి ఎలక్ట్రిక్ రైలు మంగళవారం పరుగులు తీసింది. ప్రధాని మోడీ పచ్చజెండా ఊపారు. దాంతో పాటు దేశంలోనే అత్యంత పొడవైన రైల్వే సొరంగాన్ని ప్రారంభించారు. దాంతో రైల్వే కాశ్మీర్ వెళ్లాలనే కల త్వరలోనే సాకారం కాబోతున్నది. శ్రీనగర్ నుంచి సంగల్దాన్, సంగల్దాన్ నుంచి శ్రీనగర్ వరకు రైల్వేశాఖ ఎలక్ట్రిక్ లైన్ నిర్మించింది. ఇది కాశ్మీర్‌లోనే తొలి ఎలక్ట్రిక్ రైలు కావడం విశేషం. రైలు ప్రారంభంతో లోయలో సామాజిక, ఆర్థిక వృద్ధి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టివేత

ముంబయి: ముంబయిఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులు భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల రెండు మూడురోజుల వ్యవధిలో 17 వేర్వేరు కేసుల్లో 9.83 కిలోల బంగారంతో పాటు ఐఫోన్లు, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని బట్టలు, ప్లాస్టిక్ ప్లేట్లు, టాంగ్ పౌడర్, క్యాబిన్ బ్యాగుల్లో పెట్టి తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుకున్న బంగారం విలువ రూ.5కోట్లకుపైగా స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడ్డారా? బంగారాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు ? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు కస్టమ్స్ వర్గాలు తెలిపాయి.

సందేశ్‌కాలీ వెళ్లకుండా సీపీఐ(ఎం) నేతలకు ఖాకీల అడ్డు



కోల్‌కతా : వివాదాస్పద సందేశ్‌కాలీకి వెళ్లకుండా మంగళవారం సీపీఐ(ఎం) సీనియర్ నేత బృందాకరత్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌కాలీకి వెళ్లే మార్గంలోని ధమఖలి ఫెర్రీ ఘాట్‌లో బృందాకరత్ సహా పలువురు నేతలను పోలీసులు నిలిపివేశారు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేత, రేషన్ బియ్యం స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ షాజహాన్ స్థానిక మహిళల భూములను కబ్జా చేయడంతో పాటు లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆందోళనలు చేపట్టిన సంగతి తెలి సిందే.

మహిళలను స్థానిక టీఎంసీ కార్యాల యాలకు పిలిచి లైంగిక వేధింపులకు పాల్పడినపుడు శాంతికి విఘాతం కలిగిందని, ఇప్పుడు తాము న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని బృందాకరత్ పేర్కొన్నారు. తమ పర్యటనతో సందేశ్‌ఖాలీలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఓ పోలీస్ అధికారి చెప్పారని అన్నారు.సందేశ్ కాలి వెళ్లకుండా తమని అడ్డుకోవడం సరికాదని, ఈ చర్యను ఖండిస్తున్నామని అన్నారు.

సందేశ్‌కాలీలో జరిగిన ఘటన అనాగరికమని మండి పడ్డారు.గత నెల 5న రేషన్ బియ్యం స్కాం కేసులో విచారణ కోసం టీఎంసీ నేత షాజహాన్ నివాసానికి వెళు తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై కొందరు దుండుగులు దాడికి దిగారు.అప్పటి నుంచి షాజహాన్ పరారీలో ఉన్నారు.

మోడల్ స్కూల్ అధ్యాపకులపై వివక్ష

- తగు నిష్పత్తి ప్రకారం ఇంటర్ పరీక్షల విధులను కేటాయించాలి : పీఎంటీఏటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ పరీక్షల విధుల కేటాయింపులో మోడల్ స్కూల్ అధ్యాపకుల పట్ల ఇంటర్ బోర్డు అధికారులు వివక్షను చూపుతున్నారని పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని మంగళశారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో), ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల వంటి విధులను మోడల్ స్కూల్ అధ్యాపకులకు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు.

పదవి అయిపాయే..బిల్లులు రాకపాయే

అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్న వైనం

- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో మాజీ సర్పంచులు
- రేపు చలో హైదరాబాద్



నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

సర్పంచుల ఐదేండ్ల పదవీ కాలం అయిపోయింది. వారి స్థానంలో గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. ఐదేండ్ల కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులపై వడ్డీల మీద వడ్డీల భారం పెరుగుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం ఎలాగూ సర్పంచులకు బిల్లులను సకాలంలో చెల్లించలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలని మాజీ సర్పంచులు వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.

మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ పంచాయతీకే అవార్డులు రావాలని పోటీపడి సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయనే ఆశతో దొరికినకాడల్లా అప్పులు తెచ్చిమరీ ముందుకెళ్లారు. డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతివనాలు, రైతువేదికలు, వైకుంఠదామాలు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల విషయంలో సర్పంచులతో గత ప్రభుత్వం ఉరుకులు పరుగులు పెట్టించి మరీ పనిచేయించింది. కానీ, బిల్లుల విడుదల విషయంలో తీవ్ర జాప్యం చేసింది. జీపీలకు 17 నెలల నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు అందలేదు. ఒక్కో సర్పంచికి తక్కువలో తక్కువ రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షలకుపైగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. అభివృద్ధి పనులకు సంబంధించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ నిధుల విడుదల జాప్యం నెలకొంది. దీంతో వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులు లేని మాజీ సర్పంచులే లేరు. వడ్డీలతో అప్పులు కొండంత పెరిగి వారికి తలనొప్పిగా మారాయి. సర్పంచి పదవిలో ఉన్నంత కాలం అప్పు ఇచ్చిన వాళ్ల గ్రామపెద్ద అనే గౌరవంతో పెద్దగా ఎవ్వరూ అడగలేదు. ఇప్పుడు పదవి అయిపోయిన తర్వాత అప్పులోళ్ల కోడికూయకముందే ఇండ్ల ముందు వచ్చి మాజీ సర్పంచుల ఇండ్ల ముందు తిష్టవేస్తున్న పరిస్థితి. రిజర్వేషన్ ద్వారా ఏదో అవకాశం వచ్చిందికదా ఊర్లో నాలుగు మంచి పనులు చేద్దామనే యావతో ముందుకెళ్లిన సర్పంచులంతా ఇప్పుడు అప్పుల కొలిమిలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. అప్పులోళ్ల పోరు భరించలేక, ఊర్లో తమ మొహం చూపించలేక లోలోపల కుమిలిపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచులకు తీరని అన్యాయం చేసిందనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిల్లులను చెల్లించి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీనిచ్చింది. ఈ నేపథ్యంలోనే మాజీ సర్పంచులు తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

22న చలో హైదరాబాద్



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమూ సర్పంచుల బిల్లులను ఇవ్వకుండా తొక్కిపెట్టింది. చేసిన పనులకు సంబంధించి నాకు రూ.35 లక్షలకుపైగా బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వమూ ఇవ్వడం లేదు. గ్రామ ప్రథమ పౌరులు అప్పుల బాధలతో ఇబ్బందులు పడుతుంటే ఒక్క ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో మాట్లాడకపోవడం బాధాకరం. అందుకే నిధుల కోసం ఈ నెల 22న వందలాది మంది మాజీ సర్పంచులు గన్‌పార్కు వద్దకు చేరుకుని నిరసన తెలుపుతారు. రాజకీయాలకు అతీతంగా మాజీ సర్పంచులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి. రేపోమాపో ఎలక్షన్ కోడ్ వస్తే మళ్లీ రెండు మూడు నెలలు పెండింగ్‌లో పెట్టే అవకాశముంది. దయచేసి ఎన్నికల కోడ్ రాకముందు బిల్లులిస్తే ప్రభుత్వానికి అండగా ఉంటాం. దేవుళ్లగా భావించి సపోర్టుగా నిలుస్తాం. లేకుంటే నేతలను ఊర్లల్లో అడుగుపెట్టనివ్వం.

- సుర్వి యాదయ్య గౌడ్, మాజీ సర్పంచి (అల్లం దేవి చెరువు, యాదాద్రి భువనగిరి జిల్లా)

నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్

- 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకు మార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ ఆరో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలో వంద శాతం సిలబస్‌తో ఎప్‌సెట్‌ను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 26 నుంచి పూర్తిస్థాయి వివరాలతో నోటిఫికేషన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఈనెల 21న ఉదయం పది గంటల నుంచి https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్ ను సంప్రదించాలని సూచించారు.

ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి

- బోయినపల్లి వినోద్ కుమార్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానసిక వికలాంగులకు బోధిస్తున్న ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లను రెగ్యులరైజ్ చేయాలని కరీంనగ ర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. వీరు గత 20 ఏండ్లుగా రాష్ట్రంలోని మానసిక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు విద్యను అందిస్తూ సేవలందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయనీ, అందుకు అవసరమైన పోస్టులను రెగ్యులర్ డీఎస్సీలో పొందుపర్చకుండా ఇతర ప్రక్రియ ప్రారంభమైందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని చూస్తున్న తరుణంలో వీరిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్రంలో 70 వేల మంది ఇలాంటి విద్యార్థులుండగా, వారికి బోధించేందుకు 1,523 మంది ఐఈఆర్పీలు అవసరమని తెలిపారు. ఇప్పటికే బోధిస్తున్న 996 మందిని రెగ్యులర్ చేసి, మిగిలిన పోస్టులను డిఎస్సీలో భర్తీ చేయాలని సూచించారు. కాంట్రాక్టు విధానంలో పనిచేసిన జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్‌లను రెగ్యులరైజ్ చేసినందున వీరిని కూడా రెగ్యులరైజ్ చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకపోవచ్చన్నారు. ప్రభుత్వంలో ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లేనందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు.

ఐదేండ్లలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- ఐఐటీహెచ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించి.. జాతికి అంకితం చేసిన ప్రధాని
- హాజరైన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ-కంది



ఐదేండ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. న్యూ ఇండియా భవిష్యత్తు విద్యను విశ్వని స్తుందన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) క్యాంపస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా (వర్చువల్) ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలో ఐఐటీ హైదరాబాద్ టాప్‌లో నిలిచిందని అన్నారు. క్యాంపస్ విద్య వివిధ నైపుణ్యతలకు దీటుగా స్టూడెంట్స్‌లో పరివర్తన తీసుకొస్తుందని తెలిపారు. దేశాభివృద్ధికి పాటుపడుతున్న ప్రధాని మోడీకి విద్యార్థులు, యువత సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో సాంకేతికత, ఆవిష్కరణలలో అత్యుత్తమంగా టాప్ 8 ర్యాంక్‌తోపాటు ఎన్‌ఐఆర్‌ఎఫ్ 2023 ఇన్నోవేషన్‌లో టాప్-3 ర్యాంక్‌తో నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. తక్కువ ధరతో కూడిన వెంటిలేటర్‌లను అభివృద్ధి చేయడం అభినందనీ యమన్నారు. అనంతరం ఐఐటీ డైరెక్టర్, ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. అత్యాధునిక హంగులతో నిర్మించిన అంతర్జాతీయ గెస్ట్‌హౌస్, కన్వెన్షన్ సెంటర్, టెక్నాలజీ ఇంక్యుబేషన్ పార్క్, నాలెడ్జ్ సెంటర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కాంప్లెక్స్, స్టూడెంట్స్ హాస్టల్స్‌తోపాటు వివిధ అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ల నిర్మాణానికి రూ. 1089 కోట్లు అయిందని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ హెచ్ చైర్మెన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, వెబెక్స్ సుజుకి హిరోషి, సచికో ఇమోటో, డీన్స్, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను గిరిజన సాంప్రదాయాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు జరగొద్దనే సంకల్పంతో ముఖ్య మంత్రి రూ. 105 కోట్ల నిధులను మంజూరు చేశారు. తెలంగాణలో మహా కుంభమేళగా ప్రసిద్ధి గాంచిన అతి పెద్ద ఈ గిరిజన జాతర రెండేండ్లకొకసారి మాఘ మాసంలో నాలుగు రోజుల పాటు జరుగుతుంది. ఈ జాతరకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. ప్రతి ఏడాది వారి తాకిడి పెరుగుతూనే వుంది. ఇప్పటికే 58 లక్షలకు పైగా భక్తులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక ఏర్పాట్లతో పాటు ఈ ఏడాది శాశ్వత ఏర్పాట్ల పైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే భక్తులకు వివిధ శాఖల ద్వారా నివాసానికి ఉన్న షెడ్లతో పాటు అదనంగా మరికొన్ని నిర్మాణాలను పూర్తి చేశారు. వరంగల్ నుంచి మేడారం మార్గంలో రూ. 1.65 కోట్ల చొప్పున మూడు షెడ్లను నిర్మించారు. వన దేవతలు గద్దెలకు చేరటానికి ముందు రోజు నుంచి తిరిగి వనంలోకి వెళ్లేవరకు భక్తులు నాలుగు రోజుల పాటు గుడారాలు వేసుకొని అమ్మవార్ల సన్నిధిలో ఉండడం ఆనవాయితీ. ఈ మేరకు గుడారాలతో భక్తులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ముందుచూపుతో ఏర్పాట్లు చేసింది.

జాతర నిర్వహణకు. త్రాగు నీరు, మరుగుదొడ్లు, అదనపు స్నాన ఘట్టాలు, బ్యాటరీ ట్యాప్స్, అంతర్గత రోడ్లు, వైద్యం, వసతి, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల అభివృద్ధి , క్యూలైన్, తదితర ఏర్పాట్లను పూర్తి చేసింది. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అనేక మార్లు పర్యటించింది. గత జాతర అనుభవాలను పరిగణనలోకి తీసుకొని లోపాలను సరిదిద్దింది. ఏర్పాట్లను విస్తృత పరిచింది. భక్తులకు ఇబ్బందుల్లేని దర్శనమే లక్ష్యంగా జిల్లా, రాష్ట్ర యత్రంగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. జాతరకు ముందు ఏర్పాట్లను పంచయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఉన్నతాధికారులు కూడా పలుమార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా మేడారంలో పర్యటించి పనులను పరిశీలించారు. మొత్తంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనులు పుర్తి చేశాయి. రవాణా వ్యవస్థను నియంత్రించేందుకు వాహనాల పార్కింగ్ స్థలాలను గద్దెలకు దూరంగా ఏర్పాటు చేయడం, రోడ్ల వెడల్పు, నూతన రోడ్లు, మరమ్మత్తులు చేసి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

నిరంతర నిఘా : జాతర జరిగే అన్ని ప్రాంతాల్లో 300 ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ కోసం 300సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి సెంట్రల్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించేందుకు ఆలయ పరిసర ప్రాంతాలను 10 జోన్లు, 38 సెక్టార్లు, 60 సబ్ సెక్టర్లుగా విభజించి సెక్టార్ల వారీగా అధికారులు సిబ్బందిని నియమించారు. సెక్టోరల్ అధికారులకు ఇచ్చిన వాకిటాకీ ద్వారా వివరాలు తెలుసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. దాదాపు 16 వేల మంది ఉద్యోగులు మేడారం విధుల్లో పాల్గొననున్నారు.

రవాణా శాఖ : భక్తుల రవాణాకు ఆర్టీసీ ఆరువేల బస్సులను ఏర్పాటు చేసింది. రవాణా సౌకర్యాలకోసం ప్రభుత్వంరూ.2.25 కోట్ల నిధులు మంజూరు చెసింది. తాత్కాలిక బస్ స్టాండ్‌తో పాటు, సీసీ కెమెరాలు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లైటింగ్, రైలింగ్, త్రాగు నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేసి రవాణాకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టింది.

ఆర్‌డబ్ల్యుఎస్ : ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా రూ.13.50కోట్లతో పనులు చేపట్టారు. 17 ఇన్ ఫిల్టరేషన్ వెల్స్ , 495 ప్రాంతాల్లో ఐదువేల నల్లాలను ఎర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కలగకుండా 40 జనరేటర్లు ఎర్పాటు చేశారు. 8,400 తాత్కాలిక మరుగుదొడ్లను 500 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఏడు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 300 మంది సిబ్బందిని నియమించారు.

పంచాయతీరాజ్ : జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తోన్న నేపథ్యంలో పారిశుధ్యం ఇక్కడ పెద్ద సవాలుగా మారింది. దానిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం నాలుగు వేల మంది కార్మికులను ఏర్పాటు చెసింది. పారిశుధ్య నిర్వహణకు మేడారంకు ఆవల డంపింగ్ యార్డులు, జాతర పరిసర ప్రాంతాల్లో 300 మిని డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులతో గద్దెల వద్ద, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యుత్ శాఖ: జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరాకు రూ.3.97కోట్లతో పనులు చేపట్టారు. నూతనంగా 210 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

వైద్య శాఖ : భక్తుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మేడారం కల్యాణ మండపంలో కోటి రూపాయలతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి 25 మంది వైద్యులు, 120 మంది వైద్యాధికారులు, 857 పారా మెడికల్ సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. పరిసర గ్రామాల్లో 75 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచింది. క్యూ లైన్ల వద్ద మినీ క్యాంపులు ఏర్పాటు చేశారు. తాడ్వాయిలో 10 పడకలు, పస్రలో ఐదు పడకల ఆసుపత్రులతోపాటు 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. జాతరలో ప్రత్యేకంగా 30 మొబైల్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

పోలీస్ శాఖ : శాంతి భద్రతల పరిరక్షణకు, జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 12 వేల పోలీస్ సిబ్బందితో 300 సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో జాతర పరిసర ప్రాంతాల్లో 33 పార్కింగ్ స్థలాలను ఎర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నదని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమీషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు..

పోస్ట్ ద్వారా మేడారం 'బంగారం'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మేడారం సమ్మక్క సారక్క జాతరలో పోస్టల్ శాఖ ద్వారా సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రంగారావు తెలిపారు. ఈ మేరకు దేవాదాయశాఖతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ జాతరలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బంగారం (బెల్లం)ను పోస్టల్ శాఖ ద్వారా బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించా మన్నారు. ఈ సౌకర్యం దేశంలోని అన్ని ప్రధాన పోస్టాఫీసుల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందనీ, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిలో బంగారం (బెల్లం) రూ.60 చొప్పున ఎన్ని కిలోలు కావాలంటే అన్ని కిలోలు బుక్ చేసు కోవచ్చని వివరించారు.



ఇలా మొక్కుకున్న బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించాక, ప్రసాదాన్ని స్పీడ్ పోస్ట్ ద్వారా ఇంటికి పంపి స్తామనీ, దీనికోసం అదనంగా రూ.135 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దేశం లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందనీ, నేరుగా జాతరలో పాల్గొనలేని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, జాతర ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

డీహెచ్‌పై నిరాధార ఆరోపణలకు మెడికల్ జెఏసి ఖండన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్‌పై చేస్తున్న ఆరోపణలు నిరాధారమంటూ మెడికల్ జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు అధికారులు తప్పుడు ఆడియోలు సృష్టించి దాన్ని మీడియాలో వచ్చేలా చేసి డీహెచ్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏ స్థాయిలో ఉన్నా... సహించేది లేదని అదే సందర్భంలో నిజాయితీగా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులను ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్న అధికారులు వెంటనే తమ పద్ధతిని మానుకోవాలనీ, లేనియెడల వారు తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీనియార్టీలో ముందున్న ఒక గిరిజన అధికారికి అవకాశం కల్పించడంతో కొందరు అధికారులు జీర్ణించుకోలేక ఆయనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు బి. వెంకటేశ్వర్ రెడ్డి, యాద నాయక్, నెహ్రూ నాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, రామలక్ష్మి సాయి రెడ్డి, వేణుగోపాల్ గౌడ్, కిరణ్ రెడ్డి, సకల రెడ్డి, జ్ఞానేశ్వర్, బీసీ శ్రీనివాస్ కలీముద్దీన్, పాండు నాయక్, తిరుపతి నాయక్, రాజశేఖర్, శిరీష, జమాలుద్దీన్, దేవ్ సింగ్, అనిల్ కుమార్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

- మంత్రి తుమ్మల భరోసా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్నీ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నాట్ల దశ నుంచి పంట అమ్ముకునే దాకా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకటి, రెండు పంటల కొనుగోళ్లు చేసి మిగతా పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. రాష్ట్రంలో 75 శాతం సాగుభూమి రెండు, మూడు పంటలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో మార్పు రావాలని సూచించారు. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు సీఐఐ కేంద్రాలను కొనసాగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు మార్కెట్లకు పోటెత్తుతున్న మిర్చి పంట అమ్మకాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులుగానీ, ధర విషయంలో తేడాగానీ రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అమ్మకాలు ఎక్కువగా జరిగే మార్కెట్లకు పర్యవేక్షకులను నియమించి, ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. యాసంగిలో 3.91లక్షల ఎకరాల్లో మిర్చి సాగుచేయగా ఇప్పటికే 94395.08 మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చిందని తెలిపారు. రానున్న రోజుల్లో 337014 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. వేరుశనగ అమ్మకాల్లో రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సత్వరం పరిష్కరించి అమ్మకాలు సజావుగా సాగేటట్టు చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానశాఖల నుంచి కూడా అధికారులను సంబంధిత జిల్లా అధికారులతో మిర్చి, వేరుశనగ అధికంగా పండించే జిల్లాలను సందర్శించి, రైతులందరికీ మార్కెట్లకు ఉత్పత్తులను తీసుకొచ్చే విషయములో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

హ్యూమన్ ట్రాఫికర్స్‌పై కలిసికట్టుగా పోరాడుదాం

- అదనపు డీజీ మహేశ్ భగవత్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పెరిగిపోతున్న మానవ అక్రమ రవాణాను నిరోధించటానికి పోలీసులే గాక ప్రతి ఒక్కరు కూడా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసర మున్నదని రాష్ట్ర రైల్వే పోలీసు విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్ పిలుపునిచ్చారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, చైల్డ్ మిస్సింగ్‌ల నిరోధంపై రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యాన ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడిన భగవత్.. హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అడ్డుకోవటానికి, తప్పిపోతున్న పిల్లల సంఘటనలను తగ్గించ టానికి పోలీసు శాఖతో పాటు మహిళా, శిశు సంక్షేమ విభాగం, స్వచ్ఛంద సంస్థలతో పాటు విదేశీ సంస్థలనూ కలుపుకొని పటిష్ట కార్యాచరణతో ముందుకు పోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

మహిళా భద్రతా విభాగం డీఐజీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ.. తమ విభాగంతో పాటు రైల్వే పోలీసులు, బచ్‌పన్ బచావో తదితర స్వచ్ఛంద సంస్థలతో కలిపి ప్రతి ఏటా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌కు సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించటం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. అమెరికన్ కాన్సులేట్ జఫ్రి లాసన్ మాట్లాడుతూ.. హ్యూమన్ ట్రాఫికింగ్ సమస్య కేవలం భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదనీ, ఇది అంతర్జాతీయంగా విస్తరించిన జాడ్యమని తెలిపారు. దీనిని అరికట్టడానికి అన్ని దేశాలతో కలిపి తగిన కార్యచరణతో అమెరికా కృషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కూడా పాల్గొని ప్రసంగించారు.

సహజత్వానికి అద్దం కాంచనపల్లి కవిత్వం

- "పెంకుటిల్లు" పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ కాంచనపల్లి కవిత్వం సహజత్వానికి అద్దం పడుతోందని శాసనమండలి సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన రచించిన పెంకుటిల్లు కవితా సంపుటిని కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాహిత్య నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించిన కాంచనపల్లి ఆ వారసత్వాన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రం సిద్ధించిన నేపథ్యంలో సాహిత్యంలోనూ తెలంగాణ ముద్ర బలంగా వేసిన కవి అని కొనియాడారు. పెంకుటిల్లు కవితా సంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్‌కు అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాన్ని అంకితం తీసుకోవడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. రచయిత కాంచనపల్లి మాట్లాడుతూ పుస్తకాల్లో జీవించే పరిణితి కవులకు రావాలనీ, అప్పుడే పాఠకులను కవిత్వం దగ్గరవుతుందని అన్నారు. తన "పెంకుటిల్లు" లో ఆ ప్రయత్నం చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, ప్రముఖ కవులు డాక్టర్ చెమన్, ఘనపురం దేవేందర్, కల్లెం నవీన్ రెడ్డి, కురుమయ్య, రాజీవ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 7
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

బోనాలు సమర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ - నాగోల్

హైదరాబాద్‌లోని గౌరెల్లి, పెద్ద అంబర్‌పేటలోని గోదాంలలో (వారి వ్యాపార సముదాయంలో) ఉన్న శ్రీ రేణుకా 'యల్లమ్మ తల్లి', మైసమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లి అమ్మవార్లను రాష్ట్ర పర్యాటక ప్రభుత్వ సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆ అమ్మవార్లకు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

సరూర్ నగర్
ఎక్సైజ్ ఇనిస్పెక్టర్‌గా నంద్యాల శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

సరూర్ నగర్ ఎక్సైజ్ ఇనిస్పెక్టర్‌గా నంద్యాల శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు మల్టీ జోన్‌కు బదిలీపై వెళ్లారు. నాచారం ఇండస్ట్రీ ప్రాంతంలో పనిచేసిన నంద్యాల శ్రీనివాస్ రెడ్డి సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇనిస్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. గంజాయి, డ్రగ్స్ పై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందన్నారు. యువత, విద్యార్థులకు మత్తు పదార్థాల వలన జరిగే ప్రమాదాలు, అనార్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

డీసీ, ఏసీపీలను కలసిన ఎమ్మార్పీఎస్ నాయకులు





నవతెలంగాణ - ఎల్బీనగర్

హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్‌గా తిప్పర్తి యాదయ్య, ఎల్బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణయ్యలను ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి బత్తిన సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ అట్టడుగున్నున్న పేద వర్గాల ప్రజలకు సమ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ప్రకాష్ మాదిగ, నియోజకవర్గ కార్యదర్శి రాజు మాదిగ, చంపాపేట్ డివిజన్ ఇంచార్జి మౌలాలి మాదిగ, రోషన్ దౌలా బస్తి అధ్యక్షులు రాజు నరసింహ, చిరంజీవి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

నవతెలంగాణ - బడంగ్‌పేట్

కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ గ్రీన్ హోమ్స్ కాలనీలోని రోడ్ నెం 10లో చేపట్టిన కొత్త కృష్ణ వాటర్ పైపులైన్ల నిర్మాణ పనులను బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నరసింహారెడ్డితో కలిసి కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో వేసవి దృష్టా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, నాయకులు శ్రీరామ్ రెడ్డి, బంగారి అశోక్, చల్మారెడ్డి, కాలనీ జనరల్ సెక్రటరీ సునీల్, జాయింట్ సెక్రటరీ కిష్టయ్య, ట్రెజరీ అభిషేక్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ చైర్మన్, తెలంగాణ కేబుల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బీసీఎన్, ఏబీఎన్ ఛానల్ ప్రొప్రైటర్ మిద్దెల జితేందర్ జన్మదిన వేడుకలను చంపాపేట్ డివిజన్లోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్, రవీందర్ గౌడ్, గ్యారగోని ప్రవీణ్ గౌడ్, జక్కా సందీప్ దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్

ఘనంగా సిరిపురం యాదయ్య వర్ధంతి





నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యాలయాన్ని కోహెడలోని ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర కన్వీనర్ గుర్జని వెంకటేశం గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, రాష్ట్ర సెక్రెటరీ పల్లె నర్సింహ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల, సీనియర్ ఉద్యమకారులు అత్తపురం లావణ్య, కావలి మల్లేష్ ముదిరాజ్, జెఏసి జిల్లా నాయకులు కందాల బల్ దేవ్ రెడ్డి, జేఏసీ గ్రామశాఖ అధ్యక్షులు ఇంజమూరి రవీందర్, తన్నీరు కళాపూర్ణ, ఆదోని లక్ష్మీ, గుండె రవీందర్, గుండె జంగయ్య, జీనుకుంట్ల వెంకట రాములు, నీలకంఠి శోభ, రాయబండి వాణి, మార్గపు అశ్విని పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట చౌరస్తాలో తెలంగాణ మలిదశ అమర వీరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని తరంగా ఫౌండేషన్ వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, ఎల్బీనగర్ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, సర్దార్ పుట్టం పురుషోత్తం, ఉద్యమ నేత చందూర్ ఎంపీపీ పల్లె రవి గౌడ్, జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్లే వినయ్ కుమార్, యువనేత బొగ్గరాపు శరత్ గుప్తా, బేర బాలకిషన్, ఆంకి రెడ్డి పాల్గొన్నారు.



నవ తెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం, కొత్తపేట్ చౌరస్తాలో తెలంగాణ మలిదశఉద్యమంలో అగ్నికి ఆహుతైన అమరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా..రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆయన విగ్రహానికి గజామాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, వంగాల శ్రీకాంత్ రెడ్డి, నగేష్, రఘు, రాజు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు అమరుడు సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా..ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం పరిధిలోని హయత్ నగర్ మండల పరిధిలో బస్ స్టాండ్ సమీపంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ ఉద్యమకారులు రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర కన్వీనర్ గుర్జని వెంకటేశం గౌడ్, రాష్ట్ర సెక్రటరీ పల్లె నర్సింహ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాఅధ్యక్షులు కొంతం యాదిరెడ్డి,కందాల బల్ దేవ్ రెడ్డి, బోడ నరసింహ, బట్టిల రవీందర్, వస్పరి బాల్‌రాం కుర్మ, కావాలి మల్లేష్ ముదిరాజ్, గుండె మాత్యుస్ పాల్గొన్నారు.



'రౌద్రీ సొసైటీపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ- సంతోష్‌నగర్

కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నా రౌద్రీ సొసైటీ వారు సింగరేణి కాలనీలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఆ అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ సైదాబాద్ మండల తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో సీపీఐ సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్, సీపీఐ ఐ.ఎస్.సదన్ డివిజన్ కార్యదర్శి.షేక్ మహమూద్, మహిళా నాయకలు సక్రీ బాయి, సీపీఐ శాఖ కార్యదర్శి అంజయ్య, బస్తీ నాయకులు వంశీ తదితరులు ఉన్నారు.



బంజారా భవన్ ప్రహరీని కూల్చివేశారని ధర్నా

నవతెలంగాణ - మీర్‌పేట్

బంజారా భవన్ ప్రహరీ గోడను కూల్చివేశారని కార్పొరేటర్లు ఇంద్రావత్ రవి నాయక్, కో ఆప్షన్ సభ్యులు జేటావత్ రవి నాయక్, బీజేపీ బంజారా నాయకులు రవి నాయక్, శ్రీను నాయక్ ఆధ్వర్యంలో రైతు బజార్ దగ్గర రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే 119 నెంబర్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమించి ప్రహరీ గోడను నిర్మించారని బాలాపూర్ రెవెన్యూ అధికారులు బంజారా భవన్ ప్రహరీ గోడను జేసీబీతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సర్వే నెంబర్ 119లో బంజారా భవన్ కు స్థలం కేటాయించారని తెలిపారు. ఆ స్థలంలో చాలా రోజుల కిందట ప్రహరీ గోడ నిర్మాణం చేశా మని చెప్పారు. రెండు రోజుల కిందట సంత్ సేవాలాల్ జయంతిని అక్కడే నిర్వహించినట్టు తెలిపారు. కానీ ఈరోజు రెవెన్యూ అధికారులు జేసీబీతో ప్రహరీ గోడను కూల్చివేయడం దారుణమన్నారు. సర్వే నెంబర్ 119లో దాదాపు 7ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది దానిపై చాలా సార్లు ఎంతో మంది ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవె న్యూ అధికారులు.. గిరిజనుల బంజారా భవన్ నిర్మాణం చేసుకుంటే కూల్చేస్తున్నారని మండిపడ్డారు. సర్వే నెంబర్ 119లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్య లు తీసుకోవాలని అధికారులను కోరారు. బంజారా భవన్ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులపై చర్యలు తీసుకోవా లని, కూల్చివేసిన చోటే ప్రభుత్వమే స్వయంగా బంజారా భవన్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బంజారా, గిరిజన నాయకులను, కార్పొరేటర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఎల్బీనగర్ డీసీపీ, వనస్థలిపురం ఏసీపీలు అక్కడికి చేరుకొని పరిశీలించారు.





గుంత పుడ్చకపోతే ప్రమాదమే



నవతెలంగాణ - మలక్ పేట్

మలక్‌పేట్ ఆనంద్ నగర్ క్రాస్ రోడ్ పల్టాన్‌లో తాగునీటి పథకానికి సంబంధించిన పైపులైను లీకు అయింది. పదిహేను రోజుల కిందట దానికి సరి చేసేందుకు గుంతను తీశారు.పైపు లైన్లు సరి చేసి గుంతను పూడ్చలేదు. నిత్యం వాహనాలు తిరిగే ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి, గుంతను పూడ్చేయాలని స్థానికులు కోరుతున్నారు.

100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

- కమిషనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ - మీర్‌పేట్

మార్చి చివరి నాటికి 100 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్ బి. చంద్రశేఖర్ బిల్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాల యంలో రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, శానిటేషన్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగు స్తుండడంతో మిగిలిపోయిన పెండింగ్ ఆస్తి, ఇంటి పన్ను లను మార్చి చివరి వరకు 100 శాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్(వ్యాపార పన్నులు) ప్రతి వాణిజ్య షాపులపై తీసుకునే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేయాలని సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్యం సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ఓ అంజన్ రెడ్డి, మేనేజర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వారసుడి కోసం 4 సార్లు..



చట్టవ్యతిరేక పనులు చేసిన ఓ న్యాయవాది
కొడుకు కోసం భార్యను ఆరేండ్లుగా టార్చర్
ఇద్దరు ఆడపిల్లలతో ధర్నా చేసిన బాధితురాలు



కడుపులో ఉన్నది ఆడ, మగ బిడ్డ అని తెలుసుకోవడమే చట్ట వ్యతిరేకం అని చట్టాలు తెలిసిన ఓ న్యాయవాది.. వారసుడి కోసం తన భార్యకు ఏకంగా నాలుగు సార్లు అబార్షన్స్ చేయించాడు. దీంతో భార్య గర్భసంచి బలహీనపడిందని తెలిసిన ఆ న్యాయవాది.. తన భార్య చనిపోయిందని రెండో పెండ్లి కూడా చేసుకున్నాడంటూ బాధితురాలు ఇద్దరు ఆడపిల్లలతో భర్త ఇంటి ఎదుట మంగళవారం ధర్నకు దిగింది.



నవతెలంగాణ- నాగోల్

బాధితురాలు పల్లవి తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ జైపూర్ కాలనీకి చెందిన అమరేందర్ అనే హైకోర్టు న్యాయవాదితో 2014లో పల్లవికి వివాహం జరిగింది. వారికి జాస్మితా రాయ్ (6), అన్షితరాయ్(5) ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇద్దరూ ఆడపిల్లలే అని.. మగ బిడ్డ కావాలంటూ అమరేందర్ తన తనను ఆరేండ్లుగా హింసిస్తున్నాడు. గర్భం దాల్చిన సమయంలో చట్టవిరుద్ధంగా వైద్య పరీక్షలు చేయించి, నాలుగు సార్లు అబార్షన్ కూడా చేయించాడు. దీంతో పల్లవి గర్భసంచి బలహీన పడిందని వైద్యులు చెప్పడంతో రోజురోజుకు ఆమెను దూరం పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలో పల్లవిని, పిల్లలను జైపూర్ కాలనీలో ఉన్న ఇంట్లో ఉంచి.. అమరేందర్ మాత్రం తట్టిఅన్నారం సమీపంలోని ఆర్యేనగర్‌లో ఉన్న ఇంట్లో తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. వారసుడి కోసం అనారోగ్యానికి గురిచేసి, చిత్ర హింసలు పెట్టి..పల్లవికి తెలియకుండానే నాలుగు నెలల కిందట భార్య చనిపోయిందని అబద్ధం చెప్పి.. రెండో పెండ్లి చేసుకున్నాడు.

తనకు, పిల్లలకు న్యాయం చేయాలని కోరుతూ పల్లవి తన కుటుంబ సభ్యులతో ధర్నా చేస్తుంటే..విషయం తెలుసుకున్న స్థానికులు కూడా వారికి మద్దతు పలుకుతూ ధర్నకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పి, ధర్నాను విరమింపజేశారు. న్యాయవాది అమరేందర్‌పై కేసు నమోదు చేసినట్టు సమాచారం.

ఉప్పల్ సమస్యలకు పరిష్కారం చూపాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ సమస్యలకు పరిష్కారం చూపాలని జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడారు. చెరువులను అభివృద్ధి చేయాలని, గుర్రపు డెక్క తొలగించాలని, డ్రయినేజీ, రోడ్లు, విధి దీపాల సమస్యలు, గ్రేవీయార్డ్, స్ట్రీట్ డాగ్స్, బోర్‌వెల్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పార్కింగ్‌కు స్థలం లేకుండా హెూటల్ అండ్ రెస్టారెంట్స్‌కు పర్మిషన్ ఇవ్వకూడదని కోరారు.



మల్లాపూర్ డివిజన్ పరిధిలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేస్తున్న థీమ్ పార్క్ అభివృద్ధి పనులు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారులు అశ్విని, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, శ్రీనివాస్, బుసాని రఘు, శీలం ప్రవీణ్, తదితరులున్నారు.
-నవతెలంగాణ,కాప్రా

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగ తుర్తి రవి అధ్వర్యంలో కార్పొరేషన్ 3వ డివిజన్ ఇన్‌చార్జిగా అలుగువెల్లి సుదర్శన్‌రెడ్డిని నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికలలో పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ చైర్మెన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మజార్,రాజు తదితరులు ఉన్నారు.

అభయ ఎన్జీవో ఆధ్వర్యంలో తాంబూల ఈవెంట్



నవతెలంగాణ-కాప్రా

అభయ ఎన్జీవో ఆధ్వర్యంలో తాంబూలా చారిటీ ఈవెంట్ కార్యక్రమాన్ని సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొజ్జ రాఘవరెడ్డిలు మాట్లాడుతూ.. అభయ సంస్థ సమాజానికి చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా భయ సంస్థ అధ్యక్షురాలు ధైర్యం ఉష, జనరల్ సెక్రెటరీ సుచిత్రరెడ్డి, జాయింట్ సెక్రెటరీ అలివేణి, సభ్యులు గౌరీ, భాను, ఈమణి శేషు, పద్మ అపర్ణ, ఝాన్సీ, హేమ, రత్న, హిందూ, వాలంటీర్స్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో 250 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల బహుమతులను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి టాపర్స్ జూనియర్ కాలేజ్, పూజ జ్యువెలర్స్ జోయ్ అలుకాస్, ఒరాఫో సిల్వర్ జ్యూవెలరీ, వైభవ్ జ్యూవెలర్స్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-అల్వాల్

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో అల్వాల్ వెంకటేశ్వర పార్క్ (పోలీస్ స్టేషన్ ఎదురుగా) 60 ఏండ్లు నిండిన వృద్ధులకు మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ చెక్‌చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ సౌందర్యషన్, సుదర్శన్ రావు, కేశవరావు, శ్రీనివాస్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో అభివృద్ధి పనులకు పెద్దపీట



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాల్టీలోని ప్రజల కోసం ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు పరిధిలోని ప్రగతి నగర్‌లో మున్సిప ల్ జనరల్ ఫండ్స్ రూ.7.80 లక్షలతో, శ్రీగణేశ్ నగర్‌లో రూ.6లక్షలతో చేపట్టుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేశ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ తిరువెంగళ లక్ష్మీ వేణుగోపాల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యలను పరిష్కరిస్తాం : పావని



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో రోడ్డు సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నామని ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు లో రూ.9లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవిమహిపాల్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2వ వార్డులో సాధారణ మున్సిపల్ నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రతి రోజు వాటర్ క్యూరింగ్ చేయాలని, అప్పుడే రోడ్డు దృఢంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు విమలరెడ్డి, 2వ వార్డు అధ్యక్షుడు యాదగిరిరావు, స్థానిక ప్రజలు పందిరి శశికళ, సల్ల శివ, ఆంజనేయులు గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన ఎల్ అండ్ టీ

మెట్రోరైల్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలి

- కొల్లగొట్టిన ప్రభుత్వ ధనాన్ని రాబట్టాలి
- సీపీఐ(ఎం)నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

గత ప్రభుత్వం ఎల్ అండ్ టీతో కుదుర్చుకున్న ఒప్పందానికి విరుద్ధంగా మెట్రో ఛార్జీలు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతుందని, కొల్లగొట్టిన ప్రభుత్వ ధనాన్ని రాబట్టి ఎల్ అండ్ టీ మెట్రోరైల్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎం) నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎల్ అండ్ టీ అక్రమాలపై ఆర్టీసీ క్రాస్‌రోడ్ గోల్కొండ చౌరస్తా వద్ద గల సీపీఐ(ఎం) నగర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ అండ్ టీ మెట్రోరైల్ సంస్థ ఒప్పందాలకు విరుద్ధంగా అధిక రైలు టికెట్ వసూలు చేస్తుందని, ప్రయాణీకులకు సరైన సదుపాయాలు కల్పించడ కుండా వందల కోట్ల లేబర్ సెస్ ఎగవేసి అక్రమాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. గత ప్రభుత్వం దృష్టికి ఈ అక్రమాలను తీసుకువచ్చినా పట్టించుకోకుండా ఎల్ అండ్ టీ సంస్థకు లొంగిపోవడం వల్లే ఈ దోపిడీ కొనసాగిందన్నారు. ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక ఎల్ అండ్ టీ సంస్థ అనేక అక్రమాలకు పాల్పడినట్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కాగ్ నివేదికతో సీపీఐ(ఎం) చెప్పిన విషయాలు వాస్తవమని తేలిందన్నారు. కాగ్ నివేదిక నిర్ధారించిన వివరాల ఆధారంగా దోచుకున్న ప్రభుత్వ సొమ్మును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి తిరిగి రాబట్టే చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ దోపిడీకి సహకరించిన అధికారులపై చర్య తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాగ్ అంచనా ప్రకారం 2020 నాటికి రూ.213 కోట్ల రూపాయలు ఎల్ అండ్ టీ అదనంగా వసూలు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ లెక్క రూ.500 కోట్లకు చేరిందన్నారు. మెట్రో స్టేషన్ల నిర్మాణం విస్తరణ తగ్గించి నిర్మించడంతో ఎల్ అండ్‌టీ సంస్థకు రూ.227 కోట్ల లబ్ది చేకూరిందని చెప్పారు. ఉప్పల్ కాస్టింగ్ యార్డ్ తక్కువ ధరకే లీజ్‌కు ఇవ్వడం వల్ల 2020 నాటికి రూ.95 కోట్లు నష్టం జరిగిందని తెలిపారు. పట్టణ పునరుద్ధరణ పనుల పేరుతో ఎల్ అండ్ టీ చేయాల్సిన పనులను హెచ్ఎన్ఆర్ఎల్ చేపట్టి రూ.112కోట్ల భారాన్ని తనపై వేసుకుందన్నారు. కేంద్ర చట్టం ప్రకారం నిర్మాణ ప్రాజెక్టు ఖర్చులో 1శాతం లేబర్ సెస్ చెల్లించాలని తెలిపారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సంస్థ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని చెప్పారు. మెట్రో స్టేషన్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించకుండా ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేసిందని పేర్కొన్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన హైటెక్ సిటీలో 15 ఎకరాలను అమ్ముకున్నదని ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా గత ప్రభుత్వం తన తప్పిదాల కారణంగా ఎల్ అండ్ టీసంస్థ దోపిడీకి అడ్డుకట్ట వేయలేకపోగా పూర్తిగా సహకరించిందని వెల్లడించారు. ఎల్ అండ్ టీ సంస్థ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మహేందర్, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లోని నీలోఫర్ కేఫ్‌లో మంగళవారం రాత్రి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్‌గౌడ్ ఇలా తేనీరు సేవిస్తూ కాసేపు సరదాగా గడిపారు. కమాండ్ కంట్రోల్ ఎదురుగా ఉన్న ఈ నీలోఫర్ నగరంలో వీఐపీలకు అడ్డగా మారింది. -నవతెలంగాణ,బంజారా హిల్స్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజ్ ముందు అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి (60) గమనించి స్థానికులు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వివరాల కోసం చుట్టుపక్కల వారిని ఆరా తీసినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో భద్రపరిచారు. మృతడి వివరాలకు దర్యాప్తు చేపట్టారు.

అధికారులతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సమీక్ష



నవతెలంగాణ-ఘట్కేసర్

మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మండలం, చౌదరిగుడ గ్రామపంచాయతీలో రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రత్యేక అధికారి సాంబశివరావు (డీఆర్డీఏ) అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమతులు లేని అక్రమ కట్టడాలు, నాలాల కబ్జాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామ పరిధిలో చేపట్టిన పనులు, చేపట్టాల్సిన పనులు, వాటి పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 62 కాలనీలలో మిషన్ భగీరథ నీరు అందరికీ అందే విధంగా పైప్ లైన్, గేట్ వాల్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని, గ్రామ పరిధిలో అవసరమైన రహదారులు, వాటి ఎస్టిమేషన్లపై చర్చించారు. ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ పనులు వాటి పురోగతి పై చర్చించారు. నిధులను పూర్తి స్థాయిలో ఉపయోగించి పనులను చేపట్టాలని అన్నారు. గ్రామలో పోస్ట్ ఆఫీస్‌కు గది ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రామారావు ముదిరాజ్, భాస్కర్ రెడ్డి, ఏఈలు వెంకటరెడ్డి, పరమేష్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, నర్సింగ్ ముదిరాజ్, గ్రామ కార్యదర్శి, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నేత అంజిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బోడుప్పల్

బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడ కార్పొరేషన్ నాయకులు పప్పుల అంజిరెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ అభిమానులు, డివిజన్ నాయకుల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డితో అభిమానులు కేక్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వాసులు బుచ్చిబాబు, రాజు, సందీప్, చిన్నరాయుడు, వర్మ, సుధీర్, సాజిద్, సాయి చరణ్, భవాని శంకర్, సాయి సురేందర్, సాయి, అనీల్, ఆసీఫ్, సుమంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-శామీర్‌పేట

ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, శామీర్‌పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డిలను వారి కార్యాలయాల్లో మంగళవారం తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ నారాయణ, మాజీ సర్పంచ్ రాంచందర్, మాజీ ఉపసర్పంచ్లు రాజు, శంకర్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి మురళీగౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పెండెం లక్ష్మీనారాయణ, ధర్మారెడ్డి, జాఫర్, జగదీశ్ గౌడ్,సాయి మనీష్, ప్రచార కమిటీ చైర్మెన్ రాంచందర్ యాదవ్, అధికార ప్రతినిధి మల్లేష్ యాదవ్, బీసీ సెల్ ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి దర్శన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్, వివిధ వార్డుల అధ్యక్షులు బాబు, భిక్షపతి, రామస్వామి, హరికృష్ణ, సత్యనారాయణ, బల్వంత్‌రెడ్డి, వార్డుల ప్రధాన కార్యదర్శులు ప్రదీప్, మల్లేష్ గౌడ్, దయానంద్, నాయకులు బాబు, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు హేమంత్ సాగర్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కాపీ ఇవ్వడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సకాలంలో సీసీ కాపీ ఇవ్వడం లేదని పట్టణానికి చెందిన జి.మహేష్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డాక్యుమెంట్ నెంబర్ 1396/1968 సీసీ కోసం ఈ నెల 13న టీయాప్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాగా దరఖాస్తు చేసుకున్న మ రుసటి రోజు నుంచి జూనియర్ అసిస్టెంట్ విఘ్నేష్ పొం తన లేని సమాధానం చెబుతూ దాటవేస్తున్నాడని ఆరోపి ంచారు. దయచేసి ఉన్నతాధికారులు తనకు సీసీ కాపీ ఇప్పించి జూనియర్ అసిస్టెంట్ విగ్నేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాచకొండ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ల బదిలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 8 మంది ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. హయత్‌నగర్ ఎస్‌హెచ్‌వోగా జి.రామకృష్ణ, హయత్‌నగర్ డీఐగా జి.రుద్విర్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌వోగా వి.సైదిరెడ్డి, బాలాపూర్ ఎస్‌హెచ్‌వోగా టి.భూపతి, డి.యాలాద్రి స్పెషల్ బ్రాంచ్‌కి, ఎస్.అశోక్, ఉప్పల్ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్‌గా ఇ.వెంకట్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్-2 ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సూర్యనాయక్ బదిలీ అయ్యారు. ఎస్ఐలు కె.రాఘవేంద్రగౌడ్ చౌటుప్పల్ పీఎస్‌కు, పి.మల్లయ్య రామన్నపేట్ ఎస్‌హెచ్‌వోగా, హెచ్.రాఘవేందర్ స్పెషల్ బ్రాంచ్‌కు, నారాయణపూర్ ఎస్‌హెచ్‌వోగా జె.జగన్ బదిలీ అయ్యారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి3వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఆర్. మధుసూదన్ రావు సూచించారు. మంగళవారం మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి, పోలీస్ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మార్చి 3న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆందోళన వద్దు..తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేదు

- వేసవి కార్యాచరణపై ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్ష
- నీటి నిల్వ, సరఫరాపై ఆరా
- అదనంగా15 నుంచి 20 ఎంజీడీల నీటి సరఫరా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంతోపాటు ఓఆర్ఆర్ పరిధి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అవస రం మేరకు నీరు అందుబాటులో ఉందని ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, ఎస్టీపీలపై జలమండలి ట్రాన్స్ మిషన్, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నగరంతోపాటు ఓఆర్ఆర్ లోపలి గ్రామా లకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపా రు. జలమండలి ప్రస్తుతం రోజూ 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తోందని, అదనంగా మరో 15 నుంచి 20 ఎంజీడీల నీరు అవసరముందని అంచనా వేశామన్నారు. ఆ మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలనిసీజీఎం నుంచి మేనేజర్ స్థాయి అధికారులను ఆదేశించా రు. తాగునీటి సరఫరా, కలుషిత నీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ట్యాంకర్లు, అదనపు నీటి కోసం వచ్చే వినతులను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలన్నారు. నీటి సరఫరా, ట్యాంకర్ల రవాణాపై విజిలెన్స్ అధికారులు డ్రైవ్ చేపట్టాలన్నారు. నగరంలో భూగర్భంలో నీటి మట్టాల స్థాయిపై నివేదిక తయారు చేసి అందిం చాలని ఎండీ ఆదేశించారు. జలమండలి పరిధిలో ఉన్న బోర్ వెల్స్ పనితీరును పరిశీలించి అవసరమైన చోట యా న్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్) కింద మరమ్మతు లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రస్తుతం 70 మంచినీటి ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా అవసరమైతే అదనపు స్టేషన్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు పొందాలని సూచించారు. అంతేకాకుండా అవసరం మేరకు ట్యాంకర్లు, ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. వేసవిలో రహదారులపై మురుగునీరు పొంగకుండా ముందస్తు చర్యలతోపాటు కలుషితనీరు సరఫరా కాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై తగిన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశిం చారు. వాటర్ లీకేజీలు, సీవరేజి ఓవర్ ఫ్లోలను ఎప్పటి కప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది నల్లాకు మోటార్లతో నీటిని తోడుతున్నట్లు బోర్డు దృష్టికి వచ్చినట్లు తెలిపారు. దీనివల్ల లో-ప్రెజర్ సమస్య తలెత్తి మిగతా ప్రజలకు ఇబ్బందులు వస్తున్నట్లు వివరించారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌ను ఆదేశించారు. చివరి దశలో ఉన్న ఎస్టీపీల పనుల్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. అంతర్గత రోడ్లు, లైటింగ్, గార్డెనింగ్, వాల్ పెయింటింగ్ తదితర పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈడీ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఓఅండ్ఎం, ట్రాన్స్ మిషన్ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ .. నిర్మాణం పూర్తయ్యేనా?

- 2024లో ప్రారంభిస్తామన్న మాజీ సీఎం
- నేటికీ 30శాతం పనులు మాత్రమే పూర్తి
- ఈ నిర్లక్ష్యానికి కారకులు ఎవరూ?
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిర్మాణం పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు



నవతెలంగాణ-అల్వాల్

రాష్ట్రంలో అత్యున్నత వైద్య సేవల అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) అల్వాల్ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేదు. 2022 ఏప్రిల్‌లోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి, 2024 నాటికి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి టిమ్స్ ఆస్పత్రి మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లలో కొత్త టిమ్స్ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి రూ. 897 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

ఆలస్యానికి కారణాలు ఏంటి?

నిర్మాణ సంస్థ మార్పు, నిధుల కొరత, సమస్యలు వంటి కారణాల వల్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజలు, వైద్య నిపుణులు మాత్రం ఈ వివరణలపై నమ్మకం లేదంటున్నారు. నిర్మాణంలో నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం ఆలస్యమవడం వల్ల సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రయివేట్ ఆస్పత్రులపై ఆధారపడే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చే అవకాశాలు తగ్గుతున్నాయి. ఇపుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణ సంస్థల పనితీరును పర్యవేక్షించాలని కోరుతున్నారు. అవసరమైతే మార్పులు చేసి, నిధుల కొరత లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. సకాలంలో ఆస్పత్రిని ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

నెలవారీ సమీక్షకు హాజరైన డీఎంఅండ్‌హెచ్‌వో



నవతెలంగాణ-సిటీబ్యూరో

వెంగల్‌రావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంగళవారం నెలవారీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలు, పనితీరులపై సమీక్ష కొనసాగింది. ప్రధానంగా మాతా శిశువు సేవలు, సమగ్ర మహిళా ఆరోగ్య కార్యక్రమం (ఆరోగ్య మహిళ), రోజువారీ ఓపీడీ నమూనా సేకరణలు (టిడి), పీసీపీఎన్‌డీటీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఫంక్షనాలిటీపై చర్చించారు. అనంతరం క్రిస్టినా డీఎఅండ్‌హెచ్‌వోతో మాట్లాడుతూ ఎంసీహెచ్ సేవలను మెరుగుపరచడం, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు.



కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్యసభ సభ్యులుగా ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కొమురెల్లి ఆలయ కమిటీ చైర్మెన్ లక్ష్మారెడ్డి బోర్డు మెంబర్స్, పయ్యావుల ప్రవీణ్ యాదవ్, కిరణ్ కుమార్ యాదవ్, అంజి యాదవ్, మల్లికార్జున్, మధు, శివ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్‌లో జరిగిన బల్దియా సమావేశంలో హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట సొసైటీలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్ చర్చించారు. ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కరించాలన్నారు.

బీజేపీ అంతమే..మాదిగల పంతం



- పిడమర్తి రవి, గజ్జల కాంతం, బూదాల బాబురావు

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్రంలోని మాదిగలు బీజేపీ వైపు వెళ్లకుండా మాదిగల పంతం బీజేపీ అంతం పేరుతో మాదిగలను సంఘటితం పరుస్తామని వారు తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా నేడు తెలంగాణలో జరుగనున్న మాదిగ జోడో యాత్రను విజయవంతం చేయాలని మంగళవారం మాదిగల జోడో యాత్రపోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మెన్ డా.పిడమర్తి రవి, గజ్జల కాంతం, బూదాల బాబురావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దేశ ప్రధాని మోదీ వర్గీకరణను పక్కన పెట్టి రామ మందిరాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం మాట ఇచ్చి 10 ఏండ్లు గడుస్తున్న ఎలాంటి ప్రకటన చేయకుండా మాదిగ, మాదిగ ఉప కులాలను మోసం చేస్తుందన్నారు. అందుకు తెలంగాణలో బీజేపీకి పతనం తప్పదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ నిర్లక్ష్యానికి నిరసనగా మాదిగల జోడో యాత్ర నిర్వహిస్తున్నామని, నేడు ప్రారంభం కానున్న ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రమాదంలో రాజ్యాంగం

- రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి
- న్యాయ విద్యార్థులు సామాజిక స్పృహ కల్గి ఉండాలి
- న్యాయ విద్యార్థుల సదస్సులో వక్తలు







నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దేశాన్ని పాలిస్తున్న పాలకులు రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను విస్మరించి, రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి చేస్తున్నారని రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జిల్లా స్థాయి న్యాయ విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు న్యాయ విద్యార్థి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య అధ్యక్షత వహించారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు మహోన్నతులు బాబాసాహెబ్ అంబేద్కర్, సావిత్రి పూలే, భగత్ సింగ్ చిత్ర పటాలకు పూలదండలతో నివాళ్ళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, హైకోర్టు న్యాయవాది అబీబ్ హూస్సేన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ...నేడు దేశంలో ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాని కాపాడేందుకు న్యాయ విద్యార్థులుగా ఎంతో కృషి చేయాలని అన్నారు. దేశంలో కులం, మతం, లింగం, ప్రాంతం పేరుతో ఇంకా వివక్ష కొనసాగుతుందని ఈ వివక్ష వ్యతిరేకంగా న్యాయ విద్యార్థులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. భారత దేశంలో సుప్రీం కోర్టులో ఒక్క ఆదీవాసీ జడ్జి కూడా లేరని, ఇప్పటి వరకు చరిత్రలోనే ఒక్క మహిళ ప్రధాన న్యాయమూర్తి కాలేదని అన్నారు. దేశంలో 50 మిలియన్ల కేసులు పెండింగ్ ఉన్నాయని వాటిని పరిష్కారం కోసం సరిపడా కోర్టులు, న్యాయమూర్తులు లేరని అన్నారు. ఈ సదస్సులో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా స్టాలిన్, కో -కన్వీనర్లుగా రమ్య, సుష్మ, సహన, నందిని, శ్యామ్, శంశిత, హరిప్రియ, ప్రవళిక, అనిల్, ఎస్.కె.సద్దాం, అచ్యుత్, కరుణాకర్, అక్షయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



- మేయర్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్.ఈ సత్యనారాయణతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు, పెండిగ్‌లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు, కావాల్సిన నిధులు, అవసరమైన మౌలిక సదుపాయాల పై చర్చించారు. మేయర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి, పెండింగ్ దశలో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రయినేజీలు, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ ఇబ్బందులు నియంత్రణ, రోడ్ ప్యాచ్ వర్క్స్, విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలు, వాటి తొలగింపు, లేక్ డెవలప్మెంట్, ఫుట్ పాత్‌లపై అక్రమ షాపులు, పండ్లు, ఇతర బండ్ల తొలగింపు, ఫాగింగ్, వీధి కుక్కల బెడద, ప్లాస్టిక్ కవర్ల నిషేదం తగు చర్యలు, ఇంటి పన్నుల బకాయిలు వాటి చెల్లింపు, వంటి విషయాలపై పరిపాలన, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, ఆయా విభాగాల అధికారులతో చర్చించి సమీక్ష నిర్వహించారు. అనంత రం 33 డివిజన్ల శానిటేషన్ సూపర్‌వైజర్లతో సమావేశ ంలో మాట్లాడు తూ ఎల్లపుడూ ఆయా డివిజన్ల పరిధిలోని అపార్ట్‌మెంట్స్, విల్లాలు, కాలనీలు, బస్తీలు, ఇతర సము దాయాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ప్రాంతాలలో శుభ్రతకు సంబందించి నెలకొన్న సమస్యలు అధికారుల సమన్వయంతో కృషి చేయాలని, కార్మికులు తమ విధుల నిర్వహణ పట్ల అప్రమత్తత, వంటి పలు అంశాలపై సమీక్ష సమావేశంలో చర్చించారు.

సీపీఐ(ఎం) నాయకులు సత్యం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కామ్రేడ్ బి.సత్యం 58వ జన్మదిన వేడుకలు కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భగత్ సింగ్ నగర్‌లోని ఆయన నివాసం వద్ద సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సన్నిహితులు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని శాలువాలతో సన్మానిస్తూ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిరంతరం పనిచేస్తూ ఈ ప్రాంతంలో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి కామ్రేడ్ బి.సత్యం అని తెలిపారు. అందరినీ ఆప్యాయంగా నవ్వుతూ పలకరించే వ్యక్తి అని కొనియాడారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో పదవులు అధిరోహించాలని నిండు నూరేండ్లు ప్రజా సేవలో జీవించాలని భగవంతున్ని ప్రార్థించారు. కామ్రేడ్ బి.సత్యం మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు అందరి మధ్య జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రియాజ్, దళిత చైతన్య కళా మండలి అధ్యక్షులు నిషాని చందర్, మదర్ తెరిసా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీసు వెంకటేశం గౌడ్, స్థానిక నాయకులు రాజిరెడ్డి, పరుశు రాం, ప్రేమ్ కుమార్, భూపాల్ పంతులు, రావు రవీందర్ రెడ్డి, పలువురు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా పాలనను చూసి, నిప్పులు కక్కుతున్న ఎమ్మెల్యే

- ఆల్విన్ కాలని డివిజన్ కాంగ్రెస్ నాయకుడు పట్వారీ శశిధర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కౌన్సిల్ సమావేశంలో, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభివృద్ధి నిధులపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు కక్కడం చూస్తే, గుమ్మడికాయ దొంగ కథ గుర్తుకొస్తుందనీ ఆల్విన్ కాలని డివిజన్ కాంగ్రెస్ నాయకుడు పట్వారీ శశిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి అస్తవ్యస్తంగా ఉండడానికి కారణం, గత పది సంవత్సరాలుగా శేరిలింగంపల్లికి తాను ఎమ్మెల్యేగా ఉండడమే అనేది ప్రజలకు కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని అన్నారు. పది సంవత్సరాలు ఆయనకు చేతగాని పనిని కప్పిపుచ్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందనీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 50 రోజుల్లోనే ప్రభుత్వ పని తీరును చూసి ప్రజల్లో ప్రజాపాలన స్పందనను చూసి, ఎమ్మెల్యేకి గుండెల్లో గుబులు పుట్టుకొస్తుందని పేర్కొన్నారు. డివిజన్‌కి సంబంధం లేని నాయకులు అని వక్రీకరిస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం మన్నారు. మా నాయకుడు పేద, ధనికులు అని తేడా లేకుండా, అందరినీ చేరదీసి ప్రజల సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తుండడం చూసి, ఓర్వలేక నోరు పారేసుకుంటే సహించం అంటూ, పేద ప్రజలను, స్లమ్స్‌ని దూరం పెట్టింది మీరు కాదా అంటూ ప్రశ్నించారు. ప్రజలు దొరల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని గట్టిగా విశ్వసిస్తున్నారనీ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో డివిజన్‌లో భారీ మెజారిటీ కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వివి నగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి



ప్రజా సమస్యలను ఏనాడు పట్టించుకోని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ నాయకుల పై అనుచిత వాక్యాలు చేసినందుకు, వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాషిపాక యాదగిరి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గతంలో, తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరి నేడు బీఆర్ఎస్ నుంచి ఏ పార్టీలోకి వెళ్దామని దిక్కులు చూస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్య కర్తల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. మరోసారి కాంగ్రెస్ నాయకులపై గానీ, కార్యకర్తలపై గానీ, అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంటనే గాంధీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకూ క్షమాపణ చెప్పాలనీ, లేదంటే కాంగ్రెస్, కార్యకర్తల ఆగ్రహానికి గురికావాల్సివస్తుందని తెలిపారు.



కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో వెలసిన, శ్రీ వీరాంజనేయ శివాలయ దేవస్థానము 17వ వార్షికోత్సవం వేడుకలకు, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ చంద్రారెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కూకట్‌పల్లి

హెల్త్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి : ఏఐటీయూసీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలో, సూరారం సాయిబాబా నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై, పారిశుద్ధ్య విధులను పర్యవేక్షిస్తున్న హెల్త్ ఆఫీసర్ భార్గవ్ నారాయణ, సరస్వతి దేవి గ్రూప్‌కు చెందిన మహిళా స్వీపర్లు మంజుల, జ్యోతి, అంజమ్మ నర్సింహులు, వెంకటస్వామి స్వీపర్లను మంగళవారం బహిరంగంగా నడిరోడ్డుపై అనుచిత పదజాల చేష్టలతో దూషిస్తూ...మానసిక వేదనకు గురి చేస్తున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే పనిలో నుంచి పీకేస్తానని బెదిరిస్తున్నారు. సంబంధిత హెల్త్ ఆఫీసర్ భార్గవ్ నారాయణ పై దయచేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో.. కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కే.స్వామి, జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు వి హరినాథ్, పారిశుద్ధ్య కార్మికులు పీటర్, జ్యోతి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు, నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ హెచ్చరించారు.డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో మంగళవారం రూ.96 లక్షల నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను బస్తీ వాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సమస్యలపై పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, డ్రయినేజీ, పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జెకె.శేఖర్ యాదవ్, బోగ్గుల సురేష్, జగన్ ముదిరాజ్, కెవి. శ్యామ్, రాజు, గోపాల్, ఏఈ. తిరుపతి నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, బస్తీవాసులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్స్, ఆయాలకు
- సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ అంగన్వాడీ టీచర్స్, ఆయాలకు పెండింగ్ జీతాలు, స్కూల్ అద్దెలు, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని సీడీపీవో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్స్ ఆయాలకు జీతాలు 3 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. అదేవిధంగా స్కూల్ అద్దె రెంట్లు, గ్యాస్, కూరగాయల బిల్లు ఇవ్వకుండా టీచర్లను, ఆయాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్స్, ఆయాలు ఇంటి అద్దెలు ఈఎంఐలు నిత్యావసర వస్తువులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చెల్లించకుంటే ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మర్రి కబంధ హస్తాల్లో భూమి కబ్జా

- చెరువును మింగేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- కబ్జాకి గురైన ప్రాంతాన్ని పరిశీలించిన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్





నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీలోని దుండిగల్ ఎంఎల్ఆర్ఐటిఎం కళాశాల పరిధిలోని సర్వే నెంబర్ 405 చిన్న దామెర చెరువు ప్రాంతం ప్రజాప్రతిని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చెరువు ఎఫ్‌టిఎల్ భూములు కబ్జా చేయడంతో ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు డిప్యూటీ సోలి సిటరి జనరల్ ఆఫ్ ఇండియా జడ్జి శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు రెండు రోజుల క్రితం పర్యవేక్షించిన విషయం తెలిసిందే... ఈ నేపథ్యంలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, ఇరిగేషన్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పరిశీలించారు. కళాశాల పరిసర ప్రాంతాలు పరిశీలించిన కలెక్టర్ దుండిగల్‌లోని ఆయనకు సంబంధించిన ఎంఎల్ఆర్ఐటిఎం కాలేజీ అంతా చెరువు స్థలంలోనే చాలా ప్రాంతం భూమి కబ్జాకు గురైనట్లు నిర్ధారించి, తదుపరి చర్యలపై నివేదిక ప్రభుత్వంకు అందజేయనున్నట్లు తెలిపారు. మేడ్చెల్ కలెక్టర్ గౌతమ్ రెవిన్యూ ఇరిగేషన్ అధికారుల సందర్శనతో బట్టబయలవుతున్న అవుతున్న భూములపై త్వరలో మూడు శాఖలను సమన్వయ పరిచి, అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు తప్పవంటూ వెల్లడించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిన్నదామర చెరువును ఆక్రమించి ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటిఎం కళాశాలలో చేపట్టిన షెడ్లు, శాశ్వత భవనాలు, పార్కింగ్, ప్లే గ్రౌండ్స్ నిదర్శనం. దుండిగల్ మున్సిపాలిటీ, దుండిగల్ గ్రామపరిధిలోని సర్వే నంబర్ 405,482,486,488,492 లో గల లేక్ ఐడి 2811 గల చిన్నదామర చెరువు 123.5 ఎకరాల విస్తీర్ణం,అందులో 20 ఎకరాలకు పైగా, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఎంఎల్ఆర్ఐటిఎం ,ఐఏఆర్ఈ, కళాశాలకు అనుకొని ఉన్న దామరచేరువు, ఎఫ్‌టిఎల్, భఫర్ జోన్‌లలో షెడ్లు, శాశ్వత భవనాలు, పార్కింగ్, ప్లే గ్రౌండ్స్ రూపంలో ఆక్రమించారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, ఎడి.బుచ్చిరెడ్డి, దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ మతిన్, ఇరిగేషన్ ఏఈఈ సారా, సర్వేయర్ సునీత, ఆర్ఐ భారతితో కలసి చెరువు శిఖం కబ్జాలను పరిశీలించారు.

వివేకానంద డిగ్రీ కాలేజ్ కల్చరల్ ఫెస్ట్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

గత రెండు రోజులుగా కూకట్‌పల్లి వివేకానంద డిగ్రీ కాలేజీలో జరుగుతున్న, కల్చరల్ ఫెస్టివల్‌లో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ ఫెస్ట్ కార్యక్రమంలో వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీశారు. సుమారుగా 30 డిగ్రీ కాలేజీల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ఈ దేశానికి ప్రధానమంత్రి కాకముందు, భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేదని అది నేడు ఐదవ స్థానానికి చేరుకుందనీ దానికి కారణం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నడుస్తున్న.. ప్రభుత్వంలో ఉన్న పారదర్శకత అని, దేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఈ దేశంలో సైంటిస్టులకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చి వ్యాక్సిన్ కనుగొన డంలో భారత ప్రభుత్వం యొక్క కృషిని ప్రోత్సాహాన్ని, మరువలేమని తెలియజేసారు. ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావు హాజరై మాట్లాడుతూ.. వివేకానంద డిగ్రీ కాలేజ్ ఎన్‌సీసీ విద్యార్థులు సమాజానికి గొప్పగా సేవ చేస్తున్నారని, పూర్తి సమయం వెచ్చించి ప్రభుత్వానికి సహకరించారని అభినందించారు. అలాగే యువత డ్రగ్స్ కూ అలవాటు కాకూడదని డ్రగ్స్ రహిత సమాజమే ఆశయంగా ఉండాలని తెలియజేసారు. ఈ సందర్భంగా కల్చరల్ కాంపిటీషన్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ డాక్టర్ కొరదాల నరేష్, డైరెక్టర్ కెవి లావణ్య, ఆర్గనైజేషన్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బి.ఎస్ రాజేష్, సంఘమిత్ర డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మీరావాలి వనిత, డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలి

- డీసీసీ మాజీ అధ్యక్షుడు కే.ఎం.ప్రతాప్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చిన్నారులు చిన్ననాటి నుంచే పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఎదుగుతారని డీసీసీ మాజీ అధ్యక్షులు కే.ఎం.ప్రతాప్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్‌లో గల కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో పోషక విలువలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కార్యక్రమం నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పోషక ఆహార విలువలు కలిగిన అరటి పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు, చక్కటి ఆరోగ్యాన్ని కూడా పెంపొందించుకోవాలన్నారు. చదువు, ఆటపాటలతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పండ్లను సొంత ఖర్చులతో అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయురాళ్లు భూలక్ష్మి, శ్రీ రమ్య, అరుంధతి, శిరీష, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి అధ్యాపకురాలు భార్గవి రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఇమ్రాన్, అధ్యాపకురాళ్లు పద్మజ, రజిత, మౌనిక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | ఫిబ్రవరి 21 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఖైరతాబాద్ మహా భారత్ నగర్‌నివాసులు ఎం.అశ్విన్ (14) వెన్ను పూసకు సంబంధించిన సమస్యతో బాధపడుతు చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్ర చికిత్స చేయాలని అందుకు రూ.1,25 లక్ష రూపాయల ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో స్థానిక కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయరెడని కలిసి వారి చికిత్సకు కావలసిన సహకారాన్ని కోరగా సీఎంఆర్ఎఫ్ నిధుల కింద ఎల్‌ఓసీని మంగళవారం ఆమె కార్యాలయంలో బాధితులకు అందజేశారు.

మాక్ అసెంబ్లీ పోస్టర్స్ విడుదల

నవతెలంగాణ-ఓయూ

సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించదలచిన మాక్ అసెంబ్లీ పోస్టర్స్‌ను మంగళవారం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.చింత గణేష్ సోషల్ సైన్స్ డీన్ ప్రొ.కుతాడి అర్జున్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకుని సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, ముదిరాజ్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, విద్యార్థి నేత శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎస్ఏ రాష్ట్ర అధ్య క్షుడు తాళ్ళ అజయ్ మాట్లాడుతూ కుల గణన, బీసీ లకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లు, ఉచిత విద్య,వైద్యం,సంపద సమాన పంపిణీ,ప్రయివేట్ రిజర్వేషన్ల కల్పన లాంటి అంశాలపై జరుగుతున్న కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్ రవి నాయక్, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ సమావేశాల్లో గన్ ఫౌండ్రీ డివిజన్ సమస్యలపై గలమెత్తిన

కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

జీహెచ్‌ఎంసీ నిర్వహించిన సమావేశంలో మంగళవారం సమ్మర్ క్యాంప్ పై గన్ ఫౌండ్రి డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. విక్టోరియా ప్లే గ్రౌండ్ లో ప్రతి సంవత్సరం ఏదో ఒక కారణం చూయించుతూ ఇండోర్ స్టేడియం (గ్రౌండ్స్) క్రీడాకారులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు ఇప్పుడు ఎలక్షన్స్ ఉన్నాయని ఈవీఎం మిషన్స్ ఇండోర్ స్టేడియంలో పెట్టడం జరిగింది అన్నారు. జీహెచ్‌ఎంసీలో ఎన్నో భవ నాలు ఉన్న విక్టోరియా ప్లే గ్రౌండ్‌లోనే ఎందుకు ఈవీఎంలు పెడుతున్నారు అని ప్రశ్నించారు. ఒకవేళ ఈవీఎంలు పెట్టి నట్లయితే క్రీడాకారులకు ఏదైనా ఇతర గ్రౌండ్లో కేటాయి ంచారా అని సభ దృష్టికి తీసుకెళ్లారు. 6 నెలల నుండి క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడం లేదు అని తెలిపారు. ఎంతోమంది జాతీయ అంతర్జాతీయ, క్రీడాకారులను అందించిన గన్ ఫౌండ్రీ డివిజన్ లో ఉన్న విక్టోరియా ప్లేగ్రౌండ్ ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యం వల్ల క్రీడాకారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వర్షాకా లంలో నేతాజీ నగర్, ఆదర్శ్ నగర్ ప్రాంతంలో తీవ్రమైన వరద రావడం జరుగుతుంది అని సభ దృష్టికి తీసుకెళ్లారు. గత మూడు సంవత్సరాల నుండి అధికారులకు, మేయర్ కు ఎన్నిసార్లు చెప్పినా సమస్య తీరడం లేదు అని అన్నారు. వెంటనే ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించకుంటే డివిజన్ ప్రజలు అందరితో కలిసి ఉద్యమిస్తామన్నారు.

బుక్ ఫెయిర్ పుస్తక ప్రదర్శనలో పాల్గొనలేకపోయా

- పుస్తక ప్రదర్శనలలో పాల్గనందుకు చింతిస్తున్నా..!
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 36వ జాతీయ పుస్తక ప్రద ర్శనలో ఈ సారి పాల్గొనలేకపోయి నందు కు చింతిస్తున్నాని ఎమ్మెల్సీ. ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు . హైదరాబాద్ బుక్ ఫెయి ర్ కమిటీ సభ్యులు మంగళవారం ఆయనను మర్యాదపూ ర్వకంగా కలిసి జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో ఎలా జరిగిందో వివరించారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను కోదండరాం కమిటీ సభ్యులతో చర్చించారు. బుక్ ఫెయిర్ ఆఫీస్ కోసం స్థలం కావా లన్న అంశాన్ని కూడా వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి బుక్ ఫెయిర్‌కు సం బంధించిన అంశాలను త్వరలో చర్చించాద్దా మని ఈ సందర్భంగా వారు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీతో పేర్కొన్నారు. ఆయ నను కలిసిన వారిలో హైదరాబాద్ బుక్ సెక్రటరీ ఆర్ వాసు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బల్ రెడ్డి పి నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సూరిబాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





హైదరాబాద్ 36వ జాతీయ పుస్తక ప్రదర్శనలో గుండ్రంపల్లి లైబ్రరీకి బుక్ ఫెయిర్ సొసైటీ ద్వారా పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ సొసైటీకి గుండ్రంపల్లి లైబ్రరీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ అభ్యర్థికే మా మద్దతు

దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ యూనియన్

నవతెలంగాణ-ఓయూ



వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీచేయడానికి ఆసక్తి కనపరిస్తున్న వేణుగోపాల్ స్వామి మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ ఆఫీస్‌ను సందర్శిం చారు. ఈ సందర్భంగా రైల్వే కార్మికులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంప్లాయిస్ సంఘ్ జాయింట్ ప్రధాన కార్యదర్శి భరణి భాను ప్రసాద్ మాట్లాడుతూ మొదటి నుండి రైల్వే కార్మికులు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారన్నారు. కార్మిక సంఘం కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘంగా ఉందని, టిక్కెట్ ఎవ్వరికీ ఇచ్చిన ఈ సంఘం మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో పాటు అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాకు టికెట్ కేటాయిస్తే రైల్వే కార్మికుల మద్దతు కోసం వారిని కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభు రాజ్, ప్రసాద్, చంద్ర శేఖర్, రాజు శేఖర్ పాల్గొన్నారు.

గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలి

- భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అస్మి బాబు,జావిద్

నవతెలంగాణ - ముషీరాబాద్



సంపత్ నంది, సాయి ధరంతేజ్ కాంబినేషన్లో వస్తున్న గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అస్మి బాబు,జావిద్ డిమాండ్ చేశారు. మంగళవారం భాగ్ లింగంపల్లిలో సుందరయ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. గాంజా శంకర్ మూవీ టైటిల్ చూస్తుంటే నేటి యువత విద్యార్థులు గాంజా శంకర్ లుగా తయారయ్యే ప్రమాదం ఉందని అన్నారు. యువత విద్యార్థులు డ్రగ్స్ కి, గంజాయిలకి చెడు అలవాట్లకి గురై వాళ్ళ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. చెడు అలవాట్లకు గురవుతున్న విద్యార్థి యువతలకు దూరంగా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి టైటిల్స్ పెట్టి సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారు. సినిమా దర్శకులు, హీరోలు సమాజాన్ని మార్చే బాధ్యత కూడా సినిమాల పైన ఉంటుంది కాబట్టి ఇలాంటి పేర్లతో సినిమాలు తీయడం సిగ్గుచేటు అన్నారు. సెన్సార్ బోర్డు కూడా ఇలాంటి సినిమాల పేర్లను పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలని కోరారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తారని హెచ్చరించారు.

జూమ్‌కార్ యాప్‌లో ఫేక్ అడ్రస్ ప్రూఫ్‌తో మోసాలకు పాల్పడుతున్న ఒకరు అరెస్ట్

నవ తెలంగాణ - ముషీరాబాద్



జూమ్ కార్ యాప్ లో ఫేక్ అడ్రస్ ప్రూ ఫ్‌తో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులలో ఒకరిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ అబ్దుల్ షోయబ్ , మహమ్మద్ సల్మాన్ అలీ అనే ఇద్దరు వ్యక్తులు వృత్తిరీత్యా డ్రైవింగ్ పని చేస్తున్నారు నిందితులు ఓవైసీ కాలనీ సంతోష్ నగర్ లో నివాసం వుంటున్నారు. ఈ ఇద్దరూ కలిసి జూమ్ కార్ యాప్ నందు ఫేక్ అడ్రస్ ప్రూఫ్ అప్లోడ్ చేసి వారిని నమ్మించి కారు బుక్ చేసుకుని దానిని సెల్ఫ్ డ్రైవింగ్ తీసుకుని వెళ్లి కారుకున్నటువంటి జీపీఎస్ తొలగించి అట్టికారును ఓనరుకు ఇవ్వకుండా తమ సొంత అవసరాలకు వాడుకుంటూ ఇతరులకు బుకింగ్స్ ఇచ్చుకుంటూ కారు ఓనరును మోసం చేస్తున్నారు. నిందితుల్లో ఒకరైన ఎండి సల్మాన్ అలీ ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి ఒక గూగుల్ మొబైల్ ఫోన్ రెండు కార్లు స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని రిమాండుకు తరలించారు. ఇంకొక నేరస్తుడు ఎండి అబ్దుల్ షోయబ్ పరారిలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కొరకు గాలింపు చేపట్టారు.

కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి 25సంవత్సరాల శిక్ష

నవతెలంగాణ-కంటోన్మెంట్



కన్న కూతురిపై అత్యాచారం చేసిన ఓ కషాయి తం డ్రికి 25 సంవత్సరాల కారాగార శిక్ష ఐదు వేల రూపాయల జరిమానా విధించిన ఘటన మంగళవారం నాంపల్లి12. మెట్రోపాలిటీ కోర్టు తీర్పు నిచ్చింది. బోయినపల్లి సీఐ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి గుడిసెల్లో నివాసం అంటున్న బాధితురాలు తన భర్త కుమారైపై అత్యాచారం చేశాడని ఫిర్యాదు ఇవ్వడంతో బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. మంగళవారం 12వ మెట్రో పాలిటీ కోర్టు నిందితుడికి 25 సంవ త్సరాల కారాగారి శిక్ష ఐదువేల రూపాయలు విధించిందని, ఇంకా బాధితురాలికి ఏడు లక్షల రూపా యలు చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముద్దాయి రమేష్ బాధితురాలు తల్లిని రెండో వివాహం చేసుకున్నాడని, బాధితురాలి తల్లి ఇంటింటికి చెత్త సేకరణగా పని చేస్తూ హనుమాన్ దేవాలయం సమీపంలో గుడిసెలో నివాసముంటుందన్నారు.



సి కిం ద్రా బా ద్ ఉజ్జయినిమహాకాళి అమ్మవారి ఆలయంలో మంగళ వారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈకార్యక్ర మంలో కళశస్థాపన పూజ, లయ ఈ.ఓ. గుత్తా మనోహరెడ్డి, చైర్మెన్ రామేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఈఓ గుత్తా మనోహ రెడ్డి దంపతులు పూజ నిర్వహి ంచారు. పూజలో 500 మంది మహిళా భక్తులు శ్రీ అమ్మవారికి కుంకుమార్చ నలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు.

నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్



డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పై నిరాధారమైన ఆరోపణలను మెడికల్ జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ జేఏసీ నాయ కులు మాట్లాడుతూ.. కొందరు అధికా రులు తప్పుడు ఆడియోలు సృష్టించి దా న్ని మీడియాలో వచ్చేటట్లు చేసి డీ హెచ్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏ స్థాయిలో ఉన్న సహించేది లేదని అదే సందర్భంలో నిజాయితీగా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరో పణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులను ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్న అధికారులు వెంటనే తమ పద్ధతిని మానుకోవాలని లేనియెడల వారు తగు మూల్యం చెల్లించుకోవలసి వస్తదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు బి వెంకటేశ్వర్ రెడ్డి, యాద నాయక్ ,నెహ్రూ నాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, రామలక్ష్మి, కె సాయి రెడ్డి, వేణుగోపాల్ గౌడ్, కిరణ్ రెడ్డి, సకల రెడ్డి, జ్ఞానేశ్వర్, టీసీ శ్రీనివాస్, కలీముద్దీన్,పాండు నాయక్, తిరుపతి నాయక్, రాజశేఖర్, శిరీష, జమాలుద్దీన్, దేవ్ సింగ్ అనిల్ కుమార్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 21 మాతృభాషా దినోత్సవం సందర్భంగా..

మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మాతృభాషను మరువద్దు..ప్రపంచంలో ఎన్నో భాషలు చెలామణిలో ఉన్నాయి. ఎవరి మాతృభాష వారికి ప్రీతికరమైనది. కానీ ఆంగ్ల భాష ఆధిపత్యంతో మాతృభాషలు చిన్నబోతున్నాయి. ఆంగ్లంలో చదువుకుంటేనే భవిష్యత్తు అన్న చందంగా మారాయి పరిస్థితులు. ఇదంతా మనం కల్పించుకున్న, చేసుకున్న దాని ఫలితమే. ప్రపంచంలోనే అత్యంత ఆధునికతతో దూసుకెళుతున్న ఇజ్రాయిల్ వాళ్లెవరూ ఇంగ్లీషు మాట్లాడరు. జర్మనీలో వాళ్లయితే ఇంగ్లీషును ద్వేషిస్తారు. ఇక టర్కీలో అయితే కార్యకలాపాలన్నీ అక్కడి టర్కీ భాషలోనే జరుగుతాయి. టీచర్ మొదలు జడ్జి దాకా అంతా వాళ్ల మాతృభాషలోనే మాట్లాడతారు. చైనాలోనూ కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల దాకా ఎవ్వరూ ఇంగ్లీషులో మాట్లాడరు. ఈరాన్ లో అధికారిక కార్యక్రమాలన్నీ అక్కడి ఫార్సీ భాషలోనే సాగు తాయి. ఈరాన్ వాసులెంతోమందికి నోబెల్ బహుమతులు వరించాయి. ఇంగ్లీషులో తప్పా మనం అభివృద్ధి అసాధ్యమనే విషయాన్ని ఎవరో మనకు నూరిపోశారు. మనల్ని తప్పుదోవ పట్టించారు. పరభాషలు నేర్చుకోవడంలో తప్పు అని నేననట్లేదు. మన మాతృభాషను మాత్రం నిర్లక్ష్యం చేయడం తగదు. ఎక్కడో ఒకచోట తప్ప మాతృభాషలో విద్యను అందించే పాఠశాలలు ఇంచుమించు కనుమరుగవయ్యాయి. పేరెంట్స్ తమ పిల్లల్ని చదివిద్దామన్నా అలాంటి స్కూళ్లు ఇప్పుడు లేవు.

అస్సాం సీఎం హేమంత బిశ్వశర్మకు సత్కారం

బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం : హేమంత బిశ్వ శర్మ

నవ తెలంగాణ-అంబర్‌పేట



ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ అన్నారు. మంగళవారం విజయ సంకల్పయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన ఆయనను బీజేపీ ఓబీసీ మోర్చా నేషనల్ సోషల్ మీడియా మెంబర్ పెరిక సురేష్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా అస్సా సీఎం మాట్లాడుతూ రాబోయే కేంద్ర ప్రభుత్వంలో తెలంగాణ ప్రజల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో విజయం సాధించిన పార్టీ రాబోయే ఎన్నికల్లో 17 కు 17 స్థానాల్లో గెలువడమే లక్ష్యంగా విజయసంకల్పయాత్ర జరుగుతోందన్నారు తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల విజయసంకల్పయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ వాడీవేడిగా జీహెచ్ఎంసీ కౌన్సిల్

- అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కార్పొరేటర్లు
- జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ రూ.7,937 కోట్లకు ఆమోదం





నవతెలంగాణ-సిటీబ్యూరో

రెండోరోజు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. 2024-25 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.7,937కోట్లకు ఆమోదం లభించింది. శానిటేషన్, అడ్వర్‌టైజ్‌మెంట్‌పై విచారణకు కౌన్సిల్ అమోదించింది. మంగళవారం రెండోరోజు సభలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ప్రాపర్టీ టాక్స్, ఫుడ్, హెల్త్‌పై చర్చ జరిగింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్య క్షతన సోమవారం ప్రారంభమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. తిరిగి మంగళవారం జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలను మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రొటోకాల్ లేదని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గత రెండు నెలలుగా సానిటేషన్ సరిగ్గా లేదని విమర్శించారు. ఎక్కడైనా నీళ్ల సమ స్యవస్తే జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పాలని ఒకరు, లేదు వాటర్ బోర్డులో చెప్పాలని ఇలా ఒకరిపైఒకరు చెప్తూ తప్పించుకుంటున్నారని సభ్యులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. క్రీడలకు, గ్రేవియార్డ్స్‌కు నిధు లు పెంచాలని ఒకరు అంటే, సానిటేషన్‌కు, ఇతర సమ్యలను, నాలాల పూడికలకు నిధులు ఇవ్వాలని మరో సభ్యులు విమర్శలు చేశారు. బల్ది యా 2014కు ముందు పటిష్టంగానే ఉందని, బీఆర్ఎస్ పాలనలోనే జీహెచ్ఎంసీకి నిధులు కేటాయించలేదని కాంగ్రెస్ సభ్యులు విమ ర్శించారు. ఒకవైపు నిధులు ఇవ్వకుండా మరోవైపు ప్రాజెక్టుల భారం మోసిందని కాంగ్రెస్ సభ్యులు మండిపడ్డారు. ఆదాయంలో ఉన్న జీహెచ్ఎంసీ అప్పుల పాలైందని బీజేపీ కార్పొరేటర్లు విమర్శించారు. విమర్శలు ప్రతి విమర్శలతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు ఒకరిపై ఒకరు మేయర్ పోడియం వద్దకు పలుసార్లు దూసుకొచ్చారు. మేయర్ వారిని నివారించే ప్రయత్నం చేశారు.

ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువగా

ఆర్థిక సంవత్సరం 2024 -25కి సంబంధించిన బడ్జెట్‌ను జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి ప్రవేశపెట్టారు. రూ.7,937 కోట్ల వార్షిక బడ్జెట్‌ను జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో సమర్పించారు. సాధారణ బడ్జెట్ రూ.7937 కోట్లు కాగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు మేయర్ వివరించారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ లెక్కలో స్పష్టత కనిపించడం లేదని ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ విమర్శించారు. రూ.3,646 కోట్లు ఆదాయం చూపిస్తు న్నారని, ఇందులో అన్ని ఖర్చులు కలిపి రూ.3,500 కోట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని ఖర్చులు పోగా మిగిలిన రూ.450 కోట్ల నిధులతో మాత్రమే జీహెచ్ఎంసీ నడుస్తుందా" అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉన్నాయని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కువకాలం పనిచేస్తున్న, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా లెక్కలు తయారు చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లకు, ప్రజాసమస్యలపై రెస్పాన్స్ కాని అధికారులను బదిలీ చేస్తూ ఈ తీర్మానం చేసింది.

వన్ టైం సెటిల్మెంట్ పథకం...

జీహెచ్ఎంసీకి మేజర్ ఆదాయ వనరు పన్ను వసూళ్లని, బల్దియాలో ఆస్తి పన్ను సక్రమంగా వసూలు చేయాలని, బకాయిలపై దష్టి సారించాలని కార్పొరేటర్లు కోరారు. ఆన్లైన్ సెల్ఫ్ అసెస్మెంట్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ విధానంపై వివరణ కోరగా సంబంధిత అధికారులు వివరించారు. ఆస్తి పన్ను చెల్లింపులకు వన్ టైం సెటిల్మెంట్ పథకం మళ్లీ అమలు చేయాలని, అందుకు కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాలని కార్పొరేటర్లు మేయర్ ను కోరారు. రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని రాత్రికి రాత్రే కమర్షియల్ గా మారుస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రెసిడెన్షియళ్లు... రాత్రికి రాత్రే కమర్షియల్ అవుతున్నాయి

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అక్ర మాలకు అడ్డాగా మారిందని కాంగ్రెస్ కార్పొరేటర్లు వ్యాఖ్య లు చేశారు. అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారన్నారు. టౌన్ ప్లానింగ్ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ కార్పొరేటర్లు స్పష్టం చేశారు. ఫేక్ డాక్యుమెంట్స్ పెట్టి ఇష్టం వచ్చినట్టు పర్మిషన్స్ తీసుకుంటున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు తెలిపారు. సెల్ఫ్ అసెస్మెంట్‌పై అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు. రెసిడెన్షియల్స్ రాత్రికి రాత్రే కమర్షియల్‌గా మారుస్తున్నప్పటికీ టాక్స్ కలెక్ట్ చెయ్యకపోవడంతో జీహెచ్ఎంసీ ఆదాయం కోల్పోతుందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాపర్టీ టాక్స్‌పై చాలా ఆదాయం తగ్గుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు.

హైటెక్ సిటీ, సరూర్‌నగర్‌లో ఒకేలా టాక్స్ వసూలు

టాక్స్ వసూలు చేస్తున్నాము కానీ ఎంత వరకు నగరవాసులకు మౌలిక సదుపాయాలు అందిస్తున్నామని బీజేపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. నగరవాసులకు కనీసం పార్కింగ్ సదుపాయం కూడా కల్పించడం లేదన్నారు. హైటెక్ సిటీ, సరూర్‌నగర్‌లో ఒకే లాగా టాక్స్ వసూలు ఎట్లా చేస్తున్నారని నిలదీశారు. టాక్స్‌పై అధికారుల నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. టాక్స్ కలెక్షన్ విభాగంపై క్రెడిబిలిటీ లేదన్నారు. తీసుకునే పర్మిషన్ ఒక్కటి, అక్కడ నడిపించేది మరొకటని బీజేపీ కార్పొరేటర్లు వ్యాఖ్యలు చేశారు. కాటేదాన్‌లో అనే గోదాంలు, పరిశ్రమలు వెలుస్తున్నాయని తెలిపారు. కాటేదాన్‌లో టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చేందుకు లక్షలు ఇస్తున్నారంటే అక్రమాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

ఓయో రూమ్స్‌పై రగడ

జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్‌లో ఓయో రూమ్స్‌పై రగడ చోటు చేసుకుంది. రెసిడెన్సియల్ పేరుతో కమర్షియల్‌గా నడిపిస్తున్నారని, ఫ్యామిలీస్ ఉన్న ప్రాంతాల్లో ఓయో బిజినెస్ చేస్తున్నారని కార్పొరేటర్లు మండిపడ్డారు. రెసిడెంట్స్ పేరుతో వ్యాపారం చేస్తుంటే జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. ఓయో రూమ్స్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓయో వ్యాపారంపై విచారణ చేస్తాం: జీహెచ్ఎంసీ కమిషనర్

ప్రాపర్టీ టాక్స్ అనేది జీహెచ్ఎంసీ ఆదాయానికి ముఖ్యమైన అంశం అని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. త్వరలో డోర్ నెంబర్స్‌తోపాటు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని వివరాలను జీ ఎస్ఐ మ్యాప్‌లో పొందపరుస్తామన్నారు. పన్నుల వసూళ్లపై జీహెచ్ ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వివరణ ఇచ్చారు. టాక్స్ వసూళ్లలో కొన్ని సమస్యలున్నాయని తెలిపారు. రెసిడెంట్స్, నాన్ రెసిడెంట్స్‌పై వేర్వే రు రేట్లు ఉన్నాయని వివరించారు. రెట్ల మార్పుపై 2017లో ఒకసారి 2019లో మరోసారి జీవోలు విడుదల య్యాయన్నారు. చట్ట ప్రకారమే నగరంలో పన్నులు వసూలు చేస్తున్నా మని, నిబంధనలు అతిక్రమిస్తే పెనా ల్టీ వేస్తున్నామని తెలిపారు. ఓయో హాస్టల్స్, వ్యాపారంపై విచారణ చేసి పన్నులు వసూలు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే సిటీలోని సెల్లార్ పార్కింగ్‌పై పోలీస్, జీహెచ్ఎంసీ కలిసి సర్వే చేస్తామన్నారు. డిగ్నిటీ హౌసెస్‌కు డోర్ నెంబర్లు వేసేందుకు యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టినట్టు తెలిపారు.

శివారు ప్రాంతాలకు నిధులు ఇవ్వడం లేదు: కార్పొరేటర్

నగర శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదని, నిధులు కేటాయించడం లేదని మౌలాలీ బీజేపీ కార్పొరేటర్ తెలిపారు. మౌలాలీ వాసులు టాక్స్‌లు కట్టడం లేదా అని ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితం మల్కాజ్‌గిరి నాలాలోపడి ఓ అమ్మాయి మృతి చెందిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారని గుర్తు చేశారు. నాలాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించినా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. వర్షాకాలంలో మౌలాలీలోని దీన్‌దయాల్ నాలా మురుగునీరు ఇండ్లలోకి వస్తోందని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు.

బల్దియా ఆస్తులను కాపాడాలి : ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ఆర్



బల్దియా ఆస్తులను కాపా డాలని ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ ఆర్ కోరారు. ఏండ్లతరబడి జీహెచ్ఎంసీ కాం ప్లెక్స్‌లో ఉన్న వారిని కాలీ చేయాలంటే కష్ట మవు తోందన్నారు. ఉప్పల్ నియోజక వర్గంలో జీహెచ్ ఎంసీ ఫంక్షన్ హాల్ ఉందని, దాన్ని ఖాలీ చేసేందుకు ఎంతో శ్రమిం చాల్సి వచ్చిందని గుర్తు చేశారు. రామం తాపూర్, ఉప్ప ల్ చెరువుల్లో గుర్రపు డెక్క లు పెరిగాయని, దాంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపారు. దోమలు, మురుగు వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. చెరువుల్లో గుర్రపు డెక్కతోపాటు పూడిక తీయ్యాలని కోరారు.

స్వీపింగ్ మిషన్లపై చర్చ.

నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తవేస్తున్నారని, చెత్త సేకరణలో రాంకీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇదుకు సమాధానంగా డీసీ ఉపేందర్ రెడ్డి రాంకీతో జీహెచ్ఎంసీ 2009లో అగ్రిమెంట్ చేసుకుందని, కమిర్షియల్ ఆపరేషన్ మాత్రమే 2012లో ప్రారంభమైందని వివరణ ఇచ్చారు. ఇదిలావుండగా స్వీపింగ్ మిషన్లు రోడ్లపై తిరుగుతున్నాయే తప్పా ఊడ్వడం లేదని కార్పొరేట్లు తెలిపారు. స్వీపింగ్ మిషన్లకు ఎంత చెల్లిస్తున్నారని సభ్యులు ప్రశ్నించాడంతో ఒక్కో వెహికల్‌కు సంవత్సరానికి రూ.1.25కోట్లు చెల్లిస్తున్నామని డీసీ వివరించారు. జీపీఎస్ అధారంగా బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. అందులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని సభ్యులు సభదృష్టికి తీసుకొచ్చారు.

ఆదివాసీలకు ఇంటి స్థలాలు జీవో నెంబర్ 58 ప్రకారం ఇవ్వాలి



- ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆదివాసీలకు ఇంటి స్థలాలు జీవో నెంబర్ 58 ప్రకారం ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద తుడుం దెబ్బ ఆదివాసీల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, కార్యదర్శి కోడప్ప నగేష్, హాజరై మాట్లాడుతూ. స్వతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు గడుస్తున్నా ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ఆదివాసీలు నివసిస్తున్న ఇంటి స్థలాలను కేటా యించకపోవడం తీవ్ర విచారకరమన్నారు.. ఆదివాసి ఇల్లు నివసిస్తున్న ఇళ్ల ప్రాంతాలకు తాగునీరు, కరెంటు, విద్యా, వైద్యం, రోడ్డు సౌకర్యాలు కల్పించాలి....ఆదిలాబాద్ జిల్లాలోని అనేక మండలాల్లో సర్వేనెంబర్ 72/23, 72/22 ప్రభుత్వం భూమిలో నివాసముంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు జీవో నెంబర్ 58 ప్రకారం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమయ్యాయి.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని, అని అన్నారు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ఉన్న 2043 మంది ఆదివాసి గిరిజనులు 22 ఏకురాలలో గత 30 సంవత్సరాలుగా స్థిరనివసులగా నివసిస్తున్నారని అనేక పోరాటాలు చేసి జైలు పాలై అక్కడే ఉన్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల ఆఫీసు ముట్టడించి అనేక పోరాటాలు చేశానన్నారు. ఆదివాసీలకు ఇంటి స్థలం ఇవ్వని ఎడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో ఆదిలాబాద్ తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్కే బాబురావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాపారావు, కార్యదర్శి ఇందూరు జలపతి, నాయకులు గోడ్డం రేణుక, పెందూర్ పుష్పరాణి, కర్రసాగుతానాజీ, నాయకులు పాల్గొన్నారు

మహిళలు అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యానికి మహిళా బిల్లు

- అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కిరణ్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

మహిళలు అన్ని రంగాల్లో సమాన ప్రాతినిధ్యం లభించడానికి మహిళా బిల్లు దోహద పడుతుందని హైదరాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఆర్థిక నేరాల విభాగం) కె.కిరణ్ కుమార్ అన్నారు. ఆ ప్రభుత్వ సిటీ కళాశాల అర్థ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారత దేశ రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులపై మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభావం అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. భారతీయ మహిళల సర్వతోముఖ వికాసానికి, సమానత్వానికి మహిళా రిజర్వేషన్ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యూరప్ లాంటి దేశాల్లో మహిళను మాత్రమే ఇంటి యజమానిగా గౌరవిస్తారని, ఈసత్ సంప్రదాయం విశ్వమంతా ఆచరించాల న్నారు. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ప్రొఫెసర్ డాక్టర్.ఆర్.సీతారామ్ కీలకోపన్యాసం చేశారు.వివిధ కళా శాలల ఆచార్యుల పరిశోధనా పత్రాలతో ముద్రించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్ శుక్ల, డాక్టర్. ఐజాజ్ సుల్తాన,బ్రదస్సు కన్వీనర్ డాక్టర్ పావని, కో కన్వీనర్ డాక్టర్.జె.నీరజ, లతా రాణి, డాక్టర్. కృష్ణవేణి పాల్గొన్నారు.

గురుకుల పోస్టులను భర్తీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్

నవతెలంగాణ-ముషీరాబాద్



గురుకుల ఉద్యోగాల పోస్టులను బ్యాక్ లాగ్ ఖాళీలు లేకుండా భర్తీ చేయాలి అని మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీ నారాయణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్ , నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్ డిమాండ్ చేశారు. గురుకుల నోటిఫికేషన్ లో ప్రకటించిన ఉద్యోగాలు పూర్తిగా భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ టి యు పి ఈ టి ఏ రాష్ట్ర అధ్యక్షులు మదిగోని సైదులు గౌడ్ అధ్యక్షతన ఇంద్ర పార్క ధర్నా చౌక్ వద్ద గురుకుల 1:2 సెలెక్టెడ్ అభ్యర్థులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్,నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్ హాజరై మాట్లాడుతూ. గురుకుల ఉపాధ్యాయ నియామక బోర్డ్ అయినటువంటి టిఆర్ఐఈబి సరియైన పద్ధతిలో నియామకాలు జరపనందున నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు 2017లో టీఎస్పీఎస్సీ ద్వారా 2018లో టి ఆర్ ఐ ఈ బి ఉద్యోగ నియామకాలు జరిపినప్పుడు తలెత్తని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందో అధికారులు తెలపాలని ప్రశ్నించారు. గురుకుల నియామకాల్లో అమలుపరిచిన బ్యాక్ లాగ్ ఖాళీలు లేకుండా భర్తీ చేయాలన్నారు. 9వేల 210 గురుకులాల ఉద్యోగుల పోస్టులను బ్యాక్ లాగ్ లేకుండా పూర్తి భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి గురుకులాల ఉద్యోగాలను నియమించాలని సీఎం రేవంత్ కు గురుకుల టీచర్ల విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో పలువురు నాయకులు పాల్గొన్నారు

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు

- నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమలారెడ్డి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగలరని నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమలా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉపాధి అవకాశాలు గల వివిధ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ ఆన్‌లైన్‌లో శిక్షణకై రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్‌లో దరఖాస్తులు కోరడం జరుగుతుందన్నారు.ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా చదువుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అని ఆమె తెలిపారు.కోర్సులు సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, కోర్సు ఫీజులో 50 శాతం తగ్గింపు, శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్స్ ప్రధానం చేయబడుతుందన్నారు.సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో విస్తృత స్థాయి ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఐటీ, సాఫ్ట్ వేర్ రంగంలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్ మొదలగు ఉద్యోగావకాశాలు ఉన్నా యని, ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నా యన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.nacsindia.org, దరఖాస్తులు స్వీకరించుటకు ఈ నెల 29వ తేదీ చివరి రోజు అని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్: 7893141797 సంప్రదించవలసిందిగా ఆమె కోరారు.






పిల్లలు పుట్టిన తర్వాత మహిళల జీవితం ఇంటికే పరిమితమవుదుందనుకుంటారు కొందరు. కానీ ఈ తరానికి చెందిన మహిళలు మాత్రం ఇది కరెక్ట్ కాదని నిరూపిస్తున్నారు. పిల్లలు పుట్టిన కొద్ది రోజులకే తిరిగి పనిలోకి అడుగు పెడుతున్నారు. ఒక వేళ పిల్లల ఆలనా పాలనా చూడడం కుదరకపోతే కొంతకాలం కెరీర్‌కి గ్యాప్ ఇచ్చి తిరిగి ఉద్యోగ వేట ప్రారంభిస్తున్నారు. ఇలా తిరిగి కెరీర్‌ను ప్రారంభించే ముందు కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకుంటే మంచిదంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...

అమ్మ తర్వాత ఉద్యోగమా..?

ఫలానా రంగంలో ఉద్యోగం తెచ్చుకోవాలి, ఉన్నత స్థాయికి ఎదగాలి... ఇలా కెరీర్ పరంగా ఒక్కొక్కరిదీ ఒక్కో దారి. అలాగని అందరూ ఇలా తమ తపనకు తగిన ఉద్యోగమే చేస్తారని చెప్పలేం. ముందు ఏదో ఒక ఉద్యోగం చేయాల్సిన పరిస్థితులు తలెత్తవచ్చు. కొంత ఉద్యోగ అనుభవం సంపాదించాక ఆ దిశగా ప్రయత్నాలు చేయొచ్చు కదా అనుకోవచ్చు. ఇలా పలు కారణాల వల్ల తమ అంతిమ లక్ష్యాన్ని వాయిదా వేస్తూ వచ్చిన వారికి సెకండ్ ఇన్నింగ్స్ సరైన సమయం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇంట్లో ఉంటూ పిల్లల బాధ్యతలు చూసుకున్నప్పటికీ రోజులో అప్పుడప్పుడూ ఎంతో కొంత సమయం దొరుకుతుంది. మీ తపనను నెరవేర్చుకోవడానికి ఆ సమయాన్ని కేటాయించుకోవచ్చు. కాబట్టి ముందు ఏదో ఒక ఉద్యోగంతో సరిపెట్టుకున్నా ఇప్పుడు మీ తపనేంటో తెలుసుకోండి. అంతిమ లక్ష్యం దిశగా అడుగువేయండి. ఇలా కొత్త విషయాలపై అవగాహన పెంచుకుంటూ, నైపుణ్యాల్ని మెరుగుపరచుకుంటూ, టెక్నాలజీ విషయంలో అప్‌డేట్‌గా ఉంటూ రెజ్యూమెను అప్‌డేట్ చేసుకోవడం ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు.

ఆత్మన్యూనత వద్దు

కొంత మంది మహిళలు సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగం చేయడానికి కాస్త జంకుతుంటారు. తిరిగి నిలదొక్కుకోగలమో లేదో అన్న భయం ఉంటుంది. వీటిని కూడా అధిగమించవచ్చు అంటున్నారు నిపుణులు. గతంలో చాలా ఇంటర్వ్యూలకు హాజరై ఉండి ఉంటారు. కానీ, ఇదే మీ మొదటి ఇంటర్వ్యూ అనుకోండి. ఇందుకోసం మిమ్మల్ని మీరు కొత్తగా మార్చుకోండి. అవసరమైతే నిపుణుల సహంతో శిక్షణ తీసుకోండి. సీనియర్ల సలహాలు స్వీకరించండి. ఒక్క ఉద్యోగం కోసం వందలాది మంది రావొచ్చు. అంత మందిలో మీ ప్రత్యేకత తెలిసేదెలా? అందుకే ఉద్యోగ ప్రయత్నాల కంటే ముందే మీ నైపుణ్యాలను సరి చూసుకోండి. అప్పుడే ఏ మాత్రం భయం లేకుండా కొత్త ఉద్యోగానికి ప్రయత్నించొచ్చు.



ఆత్మవిశ్వాసం అవసరం

విరామం తర్వాత ఉద్యోగం కోసం ప్రయత్నించేటప్పుడు ఆందోళన సహజమే. అలాగని ప్రయత్నించకుండా భయపడటం అవసరం. మీ గత విజయాలను గుర్తు తెచ్చుకోండి. భవిష్యత్‌లో బిడ్డ ఆలనా పాలనా చూసుకుంటూనే ఉద్యోగం చేయాల్సి రావొచ్చు. అందుకే మీరేవిధంగా సన్నద్ధమయ్యారో, సమన్వయం చేసుకోగలరో కూడా చెప్పాల్సి రావొచ్చు. కాబట్టి వాటన్నింటికీ సూటిగా, స్పష్టంగా సమాధానాలు చెప్పగలిగితే వెనకడుగు వేయనక్కర్లేదు.

సమయం వృథా చేయొద్దు

రోజులు గడుస్తున్న కొద్దీ సమయం వృథా తప్ప మరే ప్రయోజనం ఉండదు. దీని వల్ల ఒక రకమైన అలసత్వం ఆవహించే అవకాశమూ లేకపోలేదు. కాబట్టి తిరిగి కెరీర్‌పై దృష్టి పెట్టే వారు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఉద్యోగ వేట ప్రారంభించాలంటున్నారు నిపుణులు. లేదంటే గ్యాప్ పెరిగిన కొద్దీ దాన్ని పూడ్చుకోవడం కష్టమవుతుందంటున్నారు. అవకాశాలూ సన్నగిల్లుతాయంటున్నారు. కనుక మీరు గతంలో పని చేసిన మీ సహోద్యోగులతో నిరంతరం టచ్‌లో ఉండడం, లింక్డ్ఇన్‌లో నెట్‌వర్క్ పెంచుకోవడం మాత్రం మర్చిపోవద్దు. తద్వారా ఆయా కంపెనీల్లో ఉండే ఖాళీల వివరాలు వారు మీకు తెలియజేసే అవకాశం ఉంటుంది. తద్వారా ఉద్యోగ ప్రయత్నాలు మరింత సులభమవుతాయి. అంతటితో ఆగకుండా మీ వంతుగా మీరు ఆయా జాబ్ పోర్టర్స్‌లో మీ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకుంటే వీలైనంత త్వరగా తిరిగి ఉద్యోగంలో చేరొచ్చు.

ఆచితూచి

కెరీర్‌లో గ్యాప్ తీసుకోవడం వరకు బాగానే ఉంటుంది. కానీ ఒక్కోసారి ఆ గ్యాప్‌ను పూడ్చడం అంత తేలిక కాకపోవచ్చు. అయితే అందుకు ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించే ముందు నుంచే సన్నద్ధం కావాలంటున్నారు నిపుణులు. కాబట్టి మీరు కెరీర్ నుండి ఎందుకు విరామం తీసుకోవాల్సి వచ్చింది? ఇన్ని రోజులు సమయం వృథా చేశారా? ఏవైనా నైపుణ్యాలు నేర్చుకున్నారా? లేదంటే ఏదైనా బిజినెస్ చేశారా? వంటి వివరాలన్నీ ఇంటర్వ్యూ చేసే బృందానికి ఓర్పుగా నేర్పుగా వివరించాల్సి వుంటుంది. ఇలా చెప్పే క్రమంలో ఏమాత్రం తడబడినా ఎదుటివారికి సందేహం వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఓ తల్లిగా పిల్లల ఆలనా పాలన చూసుకోవడానికే కెరీర్ నుంచి విరామం తీసుకోవాల్సి వస్తే నిస్సందేహంగా అదే విషయం చెప్పచ్చు. ఇక ఇప్పుడు ఉద్యోగానికి పూర్తి సన్నద్ధమయ్యానంటూ వారికి వివరిస్తే సరిపోతుంది. తద్వారా మీ పరిస్థితి వారు అర్థం చేసుకొని మీ అర్హతలు, మీ నైపుణ్యాల్ని బట్టి మీకు ఉద్యోగం కల్పించే అవకాశం కచ్చితంగా ఉంటుందంటున్నారు నిపుణులు.

కోర్సులు నేర్చుకోవచ్చు

అమ్మయ్యాక తిరిగి ఉద్యోగ వేట ప్రారంభించే తల్లులు కొత్త కోర్సులు నేర్చుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. కొత్తగా తైన వారికి అంత సమయం ఉండచ్చు... ఉండకపోవచ్చు. కానీ పిల్లలు పెరిగి పెద్దయ్యే కొద్దీ, స్కూలుకెళ్లే వయసు వచ్చిన తర్వాత రోజులో గంటో, రెండు గంటలో సమయం దొరక్కపోదు. ఆ సమయాన్ని కెరీర్ పరంగా సద్వినియోగం చేసుకోవడం మంచిది. ఇందులో భాగంగా మీరు నేర్చుకోవాలనుకున్న కోర్సులు, పెంచుకోవాలనుకున్న నైపుణ్యాలకు సంబంధించిన తరగతులు ఆన్‌లైన్‌లోనే బోలెడున్నాయి. వాటిలో కొన్ని ఉచితంగానైనా చేరచ్చు. లేదంటే కొంత ఫీజు చెల్లించి చేరచ్చు. ఇలా మొత్తానికి ఖాళీగా సమయం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకుంటే మీ ఉద్యోగ వేట మరింత సులభమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాలనుకునే మహిళలని ఇప్పుడు ఎన్నో సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా కొన్ని వెబ్‌సైట్లు కూడా పని చేస్తున్నాయి. ఇలాంటి వాటి ద్వారా మీరు కోరుకున్న ఉద్యోగాన్ని సంపాదించవచ్చు.

బెల్లి ఫ్యాట్ కరిగిద్దాం

పొట్ట వద్ద పేరుకుపోయే కొవ్వు కొన్ని దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువ ప్రొటీన్ ఆహారం తినడం, వ్యాయామం చేయడం వంటివి పొట్ట కొవ్వును తగ్గించుకోవడానికి తీసుకోవలసిన కొన్ని చర్యలు మాత్రమే. ఈ కింది చిట్కాలతో పొట్ట కొవ్వును కరిగించుకోవచ్చు. పొట్ట కొవ్వును తగ్గించడానికి, మీ డిన్నర్‌లో ఈ కూరగాయలను చేర్చుకోండి

- రాత్రి భోజనంలో దోసకాయ తదితర కాయగూరలు తింటే బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది.



- పోషకాలు వుండే సొరకాయ రాత్రి భోజనంలో తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతుంది.
- రాత్రి భోజనంలో ఆకుకూరలు తింటే బరువు తగ్గుతారు.
- రాత్రి భోజనంలో వెజిటబుల్ రైస్ లేదా బచ్చలికూర సూప్ తీసుకోవడం వల్ల బెల్లీ ఫ్యాట్ త్వరగా తగ్గుతుంది.
- డిన్నర్‌లో బ్రకోలీని సలాడ్‌తో తీసుకుంటే కొవ్వు తగ్గుతుంది.
- క్యారెట్ బెల్లీ ఫ్యాట్ తగ్గించడంలో చాలా ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది.

ఎదగాలంటే..?

కెరీర్ అయినా, వ్యాపారమైనా మేమూ ఎవరికీ తీసిపోము అంటున్నారు ఈ తరం అమ్మాయిలు. టాప్‌లో నిలవడానికి ఎంత కష్టపడటానికైనా సిద్ధమంటున్నారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి విజేతల జీవితాల గురించి తెలుసుకుంటున్నారు.

- ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలి. కొన్నిసార్లు సమయం వెంట పరుగెత్తి టాస్కులు పూర్తి చేయాల్సి వస్తుంది. అది సహజమే. చాలా సమయం ఉందని కూర్చోవడం, ఫోన్లు, చాటింగ్‌లు, ఇతర వ్యాపకాలు చూసుకుంటూ ఆఖర్లో పరుగులు తీస్తోంటే మాత్రం మీ తీరు మార్చుకోవాల్సిందే.



- ఎంత మెరుగ్గా పని చేస్తున్నారన్నదే ముఖ్యం. మనకు ఇల్లు, పిల్లలు బాధ్యతలు అదనమే అయినా, వాటి సాకుతో పని చేయకపోవడం, పొరపాట్లకు తావిస్తానంటే కుదరదు.
- 'అమ్మో తప్పులొస్తాయి' అని ప్రతిదానికీ వెనకాడొద్దు. కచ్చితత్వానికి మారుపేరైన సాంకేతికత కూడా కొన్ని సార్లు పొరపాటు చేస్తుంది. మనుషులం కావాలని కాకపోయినా తెలియకుండానే పొరపాట్లు జరుగుతాయి. అలాగని భయపడుతూ ఉంటే మిమ్మల్ని ఎవరైనా ఎలా నమ్ముతారు. నాయకురాలవ్వడానికి, పొరపాట్లకు బాధ్యత వహించడానికి వెనకాడొద్దు. తప్పులకకు వెరవక వాటి నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తే చాలు.. అప్పుడు ఆగిపోవడమన్న మాటే ఉండదు.

2018 పరువునష్టం కేసులో... రాహుల్‌కు బెయిల్

లక్నో : 2018లో దాఖలైన ఓ పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా సివిల్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక శాసనసభ ఎన్నికల సందర్భంగా బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా రాహుల్ అభ్యంతరకరమైన వ్యాఖలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఓ హత్య కేసులో నిందితుడైన వ్యక్తి బీజేపీకి అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారంటూ రాహుల్ ఆ సమయంలో వ్యాఖ్యానించారు. కాగా విచారణకు రాహుల్ సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరు కావడంతో భారత్ జోడో న్యాయ్ యాత్రకు మరోసారి ఆటంకం ఏర్పడింది.

'రాహుల్ కోర్టులో లొంగిపోయారు. న్యాయస్థానం ఆయనను 30-45 నిమిషాల పాటు కస్టడీలోకి తీసుకుంది. ఆ తర్వాత రాహుల్ బెయిల్ కోసం దరఖాస్తు చేశారు. దానికి కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణ తేదీ ఇంకా తెలియరాలేదు. రాహుల్ అమాయకుడని, పరువుకు నష్టం కలిగించే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆయన న్యాయవాది కోర్టుకు తెలియజేశారు' అని న్యాయవాది సంతోష్ పాండే విలేకరులకు చెప్పారు. కాగా రాహుల్ వ్యాఖ్యకు నాలుగు సంవత్సరాల ముందే ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం అమిత్ షాకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2005లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అమిత్ షాపై మోపిన ఆరోపణలను తోసిపుచ్చింది. గుజరాత్ హోం మంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షాపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని, ఆయన గొంతును ఎవరూ అణచలేరని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తెలిపారు. కాంగ్రెస్‌ను ఎవరూ భయపెట్టలేరని ఆయన అన్నారు.

ఏడాదికి రెండుసార్లు

న్యూఢిల్లీ : బోర్డు ఎగ్జామ్స్ విషయంలో కేంద్ర విద్యాశాఖ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. క్లాస్ 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలను విద్యార్థులు ఏడాదికి రెండుసార్లు రాసే ఆప్షన్‌ని తీసుకొస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. 2020లో ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగా, విద్యార్థులపై అకాడమిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. విద్యాపరంగా రాణించటానికి విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలను కల్పించటం కోసం.. ద్వైవార్షిక బోర్డు పరీక్షల పద్ధతిని ఎన్ఈపీ-2020 సూచించిందని ఆయన పేర్కొన్నారు. గతేడాది ఆగస్టులో విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన న్యూ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్సీఎఫ్) ప్రకారం.. మంచి పనితీరును కనబరచడానికి విద్యార్థులకు తగినంత సమయం, అవకాశం ఉండేలా బోర్డు పరీక్షలు సంవత్సరానికి కనీసం రెండుసార్లు నిర్వహించాలి. విద్యార్థులు బెస్ట్ స్కోర్‌ను సాధించే అవకాశం కూడా ఉంటుంది. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లోని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాన్ పాల్గొన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. కొత్త ఎగ్జామ్ ఫార్మాట్‌కు స్వాగతం పలుకుతున్నట్టు, రెండు సిట్టింగ్‌లను ఉపయోగించుకుని తమలోని సామర్థ్యాన్ని బయటకు తీసుకురావాలని కేంద్ర మంత్రి వారిని కోరారు.

బీజేపీ నేతలవి దిగజారుడు రాజకీయాలు


- మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి నిజాయితీ, నిబద్ధతకు మారుపేరని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఆరోపణలు ఆయన దిగజారుడుతన రాజకీయాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు.

కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



గుడిసెలన్నీ కాలిబూడిదై రోడ్డున పడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బాధిత కుటుంబాలకు రూ.లక్ష సాయం సహా పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లే రహదారి పక్కనే సుభాష్‌నగర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు పూరిళ్లు వేసుకుని సుమారు 50 కుటుంబాలు 20ఏండ్లుగా నివాసముంటున్నాయి. గుడిసె వాసులంతా కలిసి సమ్మక్కసారలమ్మ దర్శనం కోసం సోమవారమే మేడారానికి వెళ్లారు. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో గుడిసెల నుంచి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలార్పేందు ప్రయత్నిస్తుండగానే ఓ గుడిసెలోని వంటగ్యాస్ సిలిండర్ పేలి మంటలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా దవానంలా వ్యాపించిన మంటలు చుట్టూ ఉన్న సుమారు 50పూరిళ్లకు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకునేసరికే మరో వంటగ్యాస్ సిలిండర్ పేలింది. ఇలా వరుసగా మరో మూడు సిలిండర్లు పేలడంతో చుట్టుపక్కల జనమంతా పరుగులు తీశారు. అతికష్టం మీద అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పేశాయి. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుడిసెలు, అందులోని టీవీ, వంట, ఇతర సామాగ్రి బూడిదయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సమ్మక్క-సారలమ్మ చిత్రపటాల ఎదుట పెట్టిన దీపాలు అంటుకోవడంతోనే అగ్నిప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న గుడిసెవాసులు సాయంత్రానికి అక్కడకు చేరుకున్నారు. ఆనవాళ్లు లేకుండా కాలిపోయిన తమ స్థావరాలను చూసి బోరున విలపించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బాధితులను ఓదార్చారు. బాధితులకు తక్షణమే రూ.లక్షసాయం ఇవ్వాలని, వారందరికీ పక్కా ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డునపడ్డ పేదలు వీరే..

గుడిసె వాసులందరూ మేడారం జాతరకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. అయినప్పటికీ గుడిసెలన్నీ కాలి బూడిదవడంతో నిలువ నీడ లేకుండా రోడ్డునపడ్డారు. సర్వం కోల్పోయిన బాధితుల్లో.. బత్తుల రాంబాబు, చల్లా తిరుమలయ్య చల్లా రమేష్, గుంజ రమేష్, బత్తుల కృష్ణ, కుంచం తిరుమలేష్, వేముల రాములు, వేముల నాగరాజు, వేముల ఎల్లయ్య, అలకుంట నర్సయ్య, చల్లా వెంకటేష్, బత్తుల రాంప్రసాద్, గోగుల యాదయ్య, కుంచపు శివ, వేముల శ్రీను, ఓర్సు శ్రీను, వేముల ఉప్పలయ్య, గుర్రం కుమార్, వెంకన్న, మక్కల్ల శ్రీను, బత్తుల వెంకన్న, ఓర్సు కృష్ణ కుటుంబాలు ఉన్నాయి.

తక్షణసాయం రూ.2లక్షలు ఇవ్వాలి : మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే తక్షణసాయం కింద రూ.2లక్షలు ఇవ్వాలి. అగ్నిప్రమాదానికి గల కారణాలను నిగ్గుతేల్చాలి. వారికి వెంటనే పునరావాసం కల్పించి పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలి.

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగానే ఈసీ బృందం గత కొన్ని రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నది. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం.

వీటితోపాటు జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించాలని ఈసీ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో మార్చి 8, 9 తేదీల్లో ఈసీ బృందం భేటీ కానున్నట్టు తెలుస్తున్నది. ఎన్నికల సంసిద్ధతను పరిశీలించేందుకు మార్చి 12, 13 తేదీల్లో జమ్మూకాశ్మీర్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. లోక్‌సభతో పాటే అక్కడ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్టు తెలుస్తోంది. గతంలోలానే ఈసారి కూడా ఏప్రిల్, మే నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లుచేస్తున్నది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్ ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకూ ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు.

బీజేపీకి షాక్



న్యూఢిల్లీ : వివాదానికి కేంద్ర బిందువుగా మారిన చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటించింది. దీంతో ఆప్‌కు భారీ విజయం సొంతమైంది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి ఎనిమిది బ్యాలెట్ ఓట్లను చెల్లుబాటు చేయకపోవటంతో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన విషయం విదితమే.

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఎన్నికలో విజేతగా తేలారు. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ ద్వారా చెల్లుబాటు కాని ఎనిమిది బ్యాలెట్లు చెల్లుబాటు అయ్యేవనీ, అవి ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌కు అనుకూలంగా ఉన్నాయని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. పిటిషనర్‌కు అనుకూలంగా పోలైన ఎనిమిది ఓట్లను పాడు చేసేందుకు అనిల్ మసీహ్ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారని ధర్మాసనం వెల్లడించింది. ప్రజాస్వామ్య సూత్రాలను పరిరక్షించడం న్యాయస్థానం విధి అని ధర్మాసనం తెలిపింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్‌పై కూడా కోర్టు ధిక్కారం కింద నోటీసులు జారీ అయ్యాయి. చండీగఢ్ మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, వీడియోను సమర్పించాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది.

జనవరి 30న జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేసి, మూడు పదవులను నిలబెట్టుకుని, కాంగ్రెస్-ఆప్ కూటమిని ఓడించింది. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ అవకతవకలు చేశారని ఆరోపిస్తూ, తాజా ఎన్నికలను కోరుతూ ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇందులో సర్వోన్నత న్యాయస్థానం ఆప్‌కు అనుకూలంగా తీర్పును వెలువరించింది.

ఆర్ఆర్ఆర్‌కు పచ్చజెండా..

(మొదటిపేజీ తరువాయి)

రహదారులుగా విస్తరించాల్సిన రాష్ట్ర రహదారుల జాబితాను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి అందజేశారు. ఆయా రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. నితిన్‌గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి ఆయన అధికారిక నివాసంలో కలిశారు. దాదాపు గంటన్నరపాటుసాగిన ఈ భేటీలో సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

తొలుత రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం చౌటుప్పల్-భువనగిరి-తుఫ్రాన్-సంగారెడ్డి-కంది పరిధిలో యుటిలిటీస్ (కరెంటు స్తంభాలు, భవనాల తదితరాలు) తొలగింపునకు సంబంధించి ఖర్చు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. యుటిలిటిస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పది నెలల క్రితం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలపకపోవడంతో ఈ విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరించేందుకు సమ్మతిస్తూ ఎన్‌హెచ్ఏఐకు లేఖ పంపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీ వద్ద ప్రస్తావించగా ఆయన ఈ అంశంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆరా తీశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మెలిక పెట్టినదెవరంటూ అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరిస్తే భవిష్యత్‌లో టోల్ ఆదాయంలో సగం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఆర్ఆర్ఆర్‌కు సంబంధించి భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు.

రాజ్యసభకు సోనియా ఎన్నిక

జైపూర్ : రాజస్థాన్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు మంగళవారం ప్రకటించారు. అలాగే ఇదే రాష్ట్రం నుంచి బీజేపీ అభ్యర్థులు చున్నీలాల్ గరాసియా, మదన్ రాథోర్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. రాజసభ్య ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ గడవు మంగళవారంతో ముగిసింది. దీంతో ఈ ఫలితాలను అధికారులు వెల్లడించారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యులు మన్మోహన్ సింగ్ (కాంగ్రెస్), భూపేంద్ర యాదవ్ (బీజేపీ) పదవీ కాలం ఏప్రిల్ 3తో ముగియనుంది. అలాగే డిసెంబరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో కిరోడి లాల్ మీనా (బీజేపీ) తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో రాజస్థాన్‌లో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుత ఫలితాలతో రాజస్థాన్ నుంచి కాంగ్రెస్‌కు ఆరుగురు, బీజేపీకి నలుగురు రాజ్యసభ సభ్యులున్నారు.

రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్‌లు నామినేషన్లు వేయగా..అవి నిబంధనల మేరకు లేవని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి ప్రకటించారు

మాయావీ తనయ్!



- 56 వికెట్లతో హైదరాబాదీ మాయ
- రంజీ ప్లేట్ విజయంలో ముఖ్యపాత్ర

నవతెలంగాణ-హైదరాబాద్

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్. రంజీ ట్రోఫీని ముద్దాడిన మూడో జట్టుగా ఘన కీర్తి కలిగిన హైదరాబాద్.. గత సీజన్లో పేలవ ప్రదర్శనతో అవమానకర రీతిలో ప్లేట్ లీగ్‌కు పడిపోయింది. పసికూన జట్లతో పోరాటం కావటంతో హైదరాబాద్ శిబిరంలో నైరాశ్యం. విజయం దక్కినా..అందుకు తగిన విలువ ఉంటుందా అనే సంశయం. ఈ సీజన్ ఆరంభానికి ముందు హైదరాబాద్ క్రికెట్ జట్టు సమావేశమైనప్పుడు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్లేట్ లీగ్‌లో విజయాలు హైదరాబాద్‌కు ముఖ్యం కాదు. ఎన్ని సెషన్లు, ఎన్ని రోజుల్లో మ్యాచ్ ముగించామనేది కీలకం. నాలుగు రోజుల మ్యాచ్‌ను రెండు రోజుల్లోనే ముగించాలనే స్వీయ సవాల్‌ను డ్రెస్సింగ్‌రూమ్ స్వీకరించింది. ఈ సీజన్లో హైదరాబాద్ గ్రూప్ దశలో ఐదు మ్యాచుల్లోనూ రెండు రోజుల్లోనే విజయాలు సాధించింది. జట్టులో కీలక పాత్ర పోషిస్తూ, ప్రత్యర్థి బ్యాటర్లను మాయ చేసిన స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ హైదరాబాద్‌ను గెలుపు పథాన నడిపించాడు. 8 ఇన్నింగ్స్‌ల్లో 14.98 సగటుతో ఏకంగా 56 వికెట్లు పడగొట్టాడు. అందులో ఏకంగా ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. హైదరాబాద్ బ్యాటింగ్‌కు తన్మయ్ అగర్వాల్, తిలక్ వర్మ రాహుల్ సింగ్, రోహిత్ రాయుడులు నాయకత్వం వహించగా.. ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా వికెట్ల వేట సాగించిన తనయ్ త్యాగరాజన్ స్పిన్ దళానికి, వికెట్ల జాతరకు సారథిగా నిలిచాడు. టైటిల్ పోరులో రెండు ఇన్నింగ్స్‌ల్లో ఐదేసి వికెట్లతో జట్టు విజయంలో కీలక భూమిక వహించాడు. సహచర బౌలర్లు పరుగులు ధారాళంగా ఇచ్చినా.. తనయ్ త్యాగరాజన్ గొప్పగా కట్టడి చేశాడు. జట్టుకు వికెట్ అవసరమైన ప్రతిసారి కెప్టెన్ బంతిని తనయ్ త్యాగరాజన్‌కు అందించాడు. కండ్లుచెదిరే రీతిలో 56 వికెట్లు పడగొట్టిన తనయ్ త్యాగరాజన్ హైదరాబాద్ మాయావీగా నిలిచాడు!.

> రంజీ ప్లేట్‌లో ఆడటం నిరాశకు లోను చేసింది. కానీ ఓ సవాల్‌గా తీసుకుని బరిలోకి దిగాం. మా తదుపరి లక్ష్యం రంజీ ట్రోఫీ ఎలైట్ టైటిలే. ఈ సీజన్లో బౌలింగ్‌ను ఆస్వాదించాను. సొంతగడ్డ అనుకూలత సైతం కలిసొచ్చింది. ఈ సీజన్ ఐపీఎల్‌కు సన్నద్ధం అవుతాను. త్వరలోనే పంజాబ్ కింగ్స్ శిబిరంలో చేరబోతున్నాను. అక్కడి కోచింగ్ సిబ్బందితో కలిసి టీ20ల్లో బ్యాటర్లకు కట్టడి చేసేందుకు అవసరమైన టెక్నిక్, వేరియేషన్‌పై దృష్టి సారిస్తాను.
>
> - తనయ్ త్యాగరాజన్

హైదరాబాద్ క్రికెట్‌కు కాస్త ఊరట!. గత సీజన్లో ఎలైట్ నుంచి ప్లేట్‌కు దిగజారిన హైదరాబాద్.. ఈ ఏడాది రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ చాంపియన్‌గా అవతరించింది. గ్రూప్ దశ నుంచి నాకౌట్ వరకు ఎదురులేని విజయాలు సాధించిన హైదరాబాద్ అప్రతిహత విజయ యాత్రతో మళ్లీ రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లోకి అడుగుపెట్టింది. ఉప్పల్ స్టేడియంలో మేఘాలయతో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు రూ.10 లక్షల నగదు బహుమతి ప్రకటించాడు.

చాంపియన్ హైదరాబాద్

- రంజీ ట్రోఫీ ప్లేట్ టైటిల్ సొంతం
- ఫైనల్లో మేఘాలయపై 5 వికెట్లతో గెలుపు



నవతెలంగాణ-హైదరాబాద్

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ చాంపియన్‌గా హైదరాబాద్ నిలిచింది. నాలుగు రోజులుగా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో మేఘాలయపై 5 వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్..అజేయ రికార్డుతో ఎలైట్ గ్రూప్‌లోకి ప్రవేశించింది. 198 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ తిలక్ వర్మ (64, 50 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), వైస్ కెప్టెన్ రాహుల్ సింగ్ (62, 40 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీలతో మెరువగా.. రోహిత్ రాయుడు (34, 61 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), తనయ్ త్యాగరాజన్ (26, 41 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. రోహిత్ రాయుడు, తిలక్ వర్మ గెలుపు ముంగిట నిష్క్రమించినా.. నితీశ్ రెడ్డి (3 నాటౌట్), చందన్ సహాని (8 నాటౌట్) లాంఛనం ముగించారు. మేఘాలయ బౌలర్లలో సంగ్మా (3/47) మూడు వికెట్ల ప్రదర్శనతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 304 పరుగులు చేయగా.. రాజ్ బిశ్వ (64), ఆకాశ్ చౌదరి (50), సచ్‌దేవ్ సింగ్ (46) ఆకట్టుకున్నారు. నితీశ్ రెడ్డి (122), ప్రజ్ఞయ్ రెడ్డి (102) శతకాలతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేసింది. రాజ్ బిశ్వ (100), సచ్‌దేవ్ సింగ్ (81) వీరోచిత ఇన్నింగ్స్‌లతో మేఘాలయ రెండో ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసింది. హైదరాబాద్‌కు 198 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ రెండు ఇన్నింగ్స్‌ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5/103, రెండో ఇన్నింగ్స్‌లో 5/86తో మాయజాలం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో హైదరాబాద్‌కు విలువైన ఆధిక్యం అందించిన నితీశ్ రెడ్డి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ప్లేట్ లీగ్‌లో అజేయ రికార్డుతో చాంపియన్‌గా అవతరించిన హైదరాబాద్.. రంజీ ప్లేట్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ సీజన్‌లో హైదరాబాద్ తరఫున తనయ్ త్యాగరాజన్, తన్మయ్ అగర్వాల్ అద్భుత ప్రదర్శన చేశారు. తనయ్ త్యాగరాజన్ 14 ఇన్నింగ్స్‌ల్లో 14.98 సగటుతో 56 వికెట్లు పడగొట్టాడు. అందులో ఏకంగా ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ రికార్డు ట్రిపుల్ సెంచరీ సహా 8 ఇన్నింగ్స్‌ల్లో 95.62 సగటుతో 765 పరుగులు సాధించాడు. తనయ్ త్యాగరాజన్ అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలువగా.. తన్మయ్ అగర్వాల్ బ్యాటర్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

స్కోరు వివరాలు :
మేఘాలయ తొలి ఇన్నింగ్స్ : 304/10
హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ : 350/10
మేఘాలయ రెండో ఇన్నింగ్స్ : 243/10
హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ : తన్మయ్ (సి) సంగ్మా 0, రాహుల్ సింగ్ (సి) ఆకాశ్ (బి) సంగ్మా 62, తనయ్ త్యాగరాజన్ (సి) ఏరియన్ (బి) సంగ్మా 26, తిలక్ వర్మ (సి) కిషన్ (బి) బిశ్వ 64, రోహిత్ రాయుడు (సి) సచ్‌దేవ్ (బి) బోర 34, నితీశ్ రెడ్డి నాటౌట్ 3, చందన్ సహాని నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (34.2 ఓవర్లలో 5 వికెట్లకు) 203. వికెట్ల పతనం :** 1-0, 2-88, 3-109, 4-191, 5-193. **బౌలింగ్ :** సంగ్మా 7-0-47-3, ఆకాశ్ 9-0-52-0, దీపు 5-0-16-0, బోర 2.2-0-13-0, స్వరజిత్ 1-0-4-0, రాజ్ బిశ్వ 7-0-49-1, సచ్‌దేవ్ 3-0-16-0.



10 లక్షల నజరానా

- రంజీ ఎలైట్ నెగ్గితే రూ. 1 కోటి బహుమానం
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు రంజీ జట్టుపై కాసుల వర్షం కురిపించాడు. రంజీ ట్రోఫీ ప్లేట్ విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు రూ.10 లక్షలు నజరానా సహా టోర్నీలో ఉత్తమ వ్యక్తిగత ప్రదర్శన చేసిన క్రికెటర్లకు రూ.50 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించాడు. రంజీ ట్రోఫీ ప్లేట్ ఫైనల్ బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగన్‌మోహన్ రావు.. హైదరాబాద్ క్రికెటర్లలో సరికొత్త ఉత్తేజం నింపాడు. 'హైదరాబాద్ మళ్లీ రంజీ ఎలైట్‌కు చేరటం సంతోషం. ప్లేట్ లీగ్ విజేతలుగా నిలిచిన జట్టుకు అభినందనలు. రానున్న మూడేండ్లలో ఎలైట్ ట్రోఫీ నెగ్గితే జట్టుకు రూ.1 కోటి బహుమానంతో పాటు ప్రతి ఒక్క ఆటగాడికి బిఎండబ్ల్యు కారు బహుమతిగా అందజేస్తామని' ప్రకటించాడు. 'ఈ సీజన్‌లో హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేషన్ నుంచి గొప్ప మద్దతు లభించింది. అన్ని విధాలుగా జట్టుకు సహకారం అందించారు. ఆటగాళ్లుగా మాది ఒకటే లక్ష్యం. రంజీ ట్రోఫీ ఎలైట్ విజేతలుగా నిలువటం. భారీ నగదు బహుమతి ప్రకటన క్రికెటర్లలో సరికొత్త ఉత్సాహం తీసుకొస్తుంది. ప్లేట్ చాంపియన్స్‌గా నిలువటం పట్ల సంతోషంగా ఉంది' అని హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు.

మార్చి 22 నుంచి ఐపీఎల్ 2024

ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సీజన్ మార్చి 22 నుంచి ఆరంభం కానుంది. ఈ మేరకు ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ తెలిపాడు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌ను తొలి 15 మ్యాచులకు మాత్రమే విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ అనంతరం ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు.'ఐపీఎల్ 17 పూర్తిగా భారత్‌లోనే జరుగుతుంది. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నాం. మార్చి 22న తొలి మ్యాచ్‌కు ప్రణాళిక సిద్ధం చేశామని' అరుణ్ ధుమాల్ తెలిపారు. మే 26న ఐపీఎల్ 17 టైటిల్ పోరు షెడ్యూల్ చేసే అవకాశం కనిపిస్తుంది.



రిషబ్ పంత్ సిద్ధం!

ప్రాక్టీస్ మ్యాచ్‌లో జోరు

అలూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న యువ క్రికెటర్ రిషబ్ పంత్ ఐపీఎల్ 17కు సిద్ధమవుతున్నాడు. కొంతకాలంగా బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్‌లో ఉన్న రిషబ్ పంత్ నెట్స్‌లో కఠోరంగా శ్రమిస్తున్నాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్న రిషబ్ పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ దిశగా మరో అడుగు ముందుకేశాడు. ఆలూర్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీఏ ప్రాక్టీస్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ప్రమాదానికి ముందు పంత్ తరహాలో స్వేచ్ఛగా పరుగులు వేట సాగించినట్టు ఎన్‌సీఏ వర్గాల సమాచారం. వికెట్ కీపింగ్‌కు దూరంగా ఉన్న రిషబ్ పంత్ మరికొద్ది రోజుల్లోనే గ్లౌవ్స్‌తోనూ సాధన చేయనున్నట్టు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిషబ్ పంత్ అప్పట్నుంచి ఆటకు పూర్తిగా దూరమైన సంగతి తెలిసిందే.



నవచిత్రం

చారి.. సాహసాల యాత్ర షురూ



వెన్నెల కిశోర్, సంయుక్తా విశ్వనాథన్

'చక చక మొదలిక... సాహసాల యాత్ర ఆగదిక... ఇది ఆపరేషన్ రుద్రనేత్ర' అని 'చారి 111' టీమ్ అంటోంది. స్టైలిష్‌గా పిక్చరైజ్ చేసిన థీమ్ సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు యూట్యూబ్‌లో ఈ సాంగ్ వైరల్ అవుతోంది. 'వెన్నెల' కిశోర్ కథానాయకుడిగా నటించిన సినిమా 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించారు. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్నారు. మురళీ శర్మ ప్రధాన పాత్రధారి. మార్చి 1న థియేటర్లలో విడుదల కానుంది.

తాజాగా 'చారి 111' థీమ్ సాంగ్ విడుదల చేశారు. ఈ పాటను సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాయగా, 'జవాన్' ఫేమ్ సంజీత భట్టాచార్య ఆలపించారు. సైమన్ కె కింగ్ మంచి స్టైలిష్ ట్యూన్ అందించారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమాలో ఒక్కటే సాంగ్ ఉంది. స్టార్టింగ్ టైటిల్స్‌లో వస్తుంది. ఈ పాటను నేపథ్య సంగీతంలో ఉపయోగించాం. ఆల్రెడీ విడుదలైన ట్రైలర్ ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంది. వెన్నెల కిశోర్‌ని ఇంతకు ముందెప్పుడూ ఇలా చూడలేదని ప్రేక్షకులు చెబుతున్నారు. ఆయన లుక్స్, స్టైలిష్ స్టైగా చేసిన కామెడీ సూపరని చెబుతున్నారు. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా 'చారి 111' థీమ్ సాంగ్ విడుదలైంది.

ముఖ్య గమనిక.. రిలీజ్‌కి రెడీ



విశ్వక్‌సేన్, విరాన్ ముత్తంశెట్టి

విరాన్ ముత్తంశెట్టి హీరోగా, లావణ్య హీరోయిన్‌గా శివిన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజశేఖర్, సాయి కృష్ణ నిర్మాతలుగా కొత్త దర్శకుడు వేణు మురళీధర్.వి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'ముఖ్య గమనిక'.

హీరో విశ్వక్ సేన్ ముఖ్యఅతిథిగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సినిమాని ఈనెల 23న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'విరాన్ నేను జిమ్ ఫ్రెండ్స్. విరాన్‌కి ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'కిరణ్ అందించిన మ్యూజిక్ చాలా బాగా వచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్స్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. మంచి సినిమాతో మీముందుకు వస్తున్నాను' అని డైరెక్టర్ వేణు మురళీధర్ అన్నారు. హీరో విరాన్ ముత్తంశెట్టి మాట్లాడుతూ, 'బ్యాగ్రౌండ్, మ్యూజిక్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ అన్ని చాలా బాగుంటాయి. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. ఈ

మెప్పించే యూనిక్ కాన్సెప్ట్



బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు హీరో, హీరోయిన్స్‌గా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్..'. డీడీ క్రియేషన్స్ బ్యానర్ పై దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో బేబీ నిర్మాత ఎస్కేఎన్, దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత వివేక్ కూచిభొట్ల ముఖ్య అతిథులుగా హాజరైన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

హీరో అర్జున్ కళ్యాణ్ మాట్లాడుతూ,'ఈ ప్రాజెక్ట్ నన్ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళుతుందని కోరుకుంటున్నాను. మూడు భాషల్లో ఈ సినిమా చేశాం. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా చేశారు. యూనిక్ కాన్సెప్ట్‌తో థ్రిల్లర్, డ్రామా ఉన్న కథ ఇది' అని తెలిపారు. 'ప్రతి ఒక్కరూ ఫ్యామిలీతో కూర్చుని చూడదగ్గ మూవీ ఇది. తప్పకుండా థియేటర్స్‌కి వెళ్లి సినిమా చూడాలి' అని హీరోయిన్ కుషితకల్లపు అన్నారు.

దర్శకుడు లక్ష్మణ వర్మ మాట్లాడుతూ,'భిన్న కాన్సెప్ట్‌తో చేసిన ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుందే నమ్మకంతో ఉన్నాం' అని చెప్పారు. లక్ష్మణ్ వర్మ, సోనాలి పానిగ్రాహి, మురళీధర్ గౌడ్, భద్రం, రవి వర్మ, జబర్దస్త్ అప్పారావు, బద్రి, సునీత మనోహర్, బేబీ ఆరాధ తదితరులు నటిస్తున్నారు.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా



వరుణ్ తేజ్ నటించిన ఏరియల్ వార్ డ్రామా 'ఆపరేషన్ వాలెంటైన్'. తాజాగా హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్ర ట్రైలర్‌ను సల్మాన్‌ఖాన్, రామ్‌చరణ్ లాంచ్ చేశారు.

ఐఏఎఫ్ అధికారి అయిన అర్జున్ దేవ్ (వరుణ్ తేజ్)కి గతంలో జరిగిన ఒక సంఘటన కారణంగా పీడకలలు వస్తుంటాయి. కానీ అది అతని వైఖరి, విధానాన్ని మార్చలేదు. అతను మొండి పట్టుదలగలవాడు. రాడార్ ఆఫీసర్ సోనాల్ (మానుషి చిల్లర్)తో ప్రేమలో ఉన్న అడ్వెంచర్ లవర్. మరోవైపు పుల్వామా దాడిలో 42 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణిస్తారు. ఇంతకుముందు ఓటమిని ఎదుర్కోని భారత వైమానిక దళం శత్రువులపై వైమానిక దాడిని ప్రకటిస్తుంది. టీంకు నాయకత్వం వహిస్తున్న అర్జున్ తన యుద్ధ విమానానికి గ్రెనేడ్ తగలడంతో ప్రమాదంలో పడతాడు. అయితే, అతనికి మార్గనిర్దేశం చేసేందుకు రాడార్ ఆఫీసర్ సోనాల్ వుంటుంది. వరుణ్ తేజ్ అడ్వెంచరస్ స్క్వాడ్రన్ లీడర్‌గా అద్భుతంగా ఆకట్టుకున్నాడు. యాక్షన్, ఎమోషనల్ సీన్స్ రెండింటిలోనూ అదరగొట్టారు. యూనిఫాంలో వరుణుడిని చూడటం కన్నుల పండువగా వుంది. మానుషితో కెమిస్ట్రీ బాగా కుదిరింది.

> తెలుగులో మొట్టమొదటి ఏరియల్ ఫిల్మ్ అవ్వబోతుంది. చాలా కొత్తగా, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ కూర్చుని గూస్ బంప్స్ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేసే చాలా సీన్స్ ఇందులో ఉన్నాయి. మార్చి 1న ఈ సినిమాని చాలా గర్వంగా, గుండెలు నిండా దేశభక్తితో చూసి మన జవాన్స్‌కి సెల్యూట్ కొడతారు ప్రేక్షకులు. మన జవాన్ల త్యాగాలని గుర్తు చేసుకుంటూ, వారి ధైర్య సాహసాలని మీముందుకు తీసుకురావడాని చేస్తున్న ప్రయత్నం ఈ సినిమా. అందరికీ దేశభక్తి మనసులో ఉంటుంది. ఈ సినిమా చూశాక అది మరింత పెరుగుతుందని నమ్మకంగా చెబుతున్నాం.
>
> - వరుణ్ తేజ్

హీరోయిన్ మానుషి చిల్లర్ మాట్లాడుతూ, 'ఇది చాలా స్పెషల్ మూవీ. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ అద్భుతంగా ఈ సినిమాని తీశారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్ర చేశాను. తెలుగులో మొట్టమొదటి ఎయిర్ ఫోర్స్ యాక్షన్ సినిమా చేసిన ఘనత వరుణ్ తేజ్‌కి దక్కుతుంది. ఈ ట్రైలర్‌లో విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి' అని నవదీప్ చెప్పారు. దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ,'వరుణ్ తేజ్‌కి, నిర్మాతలకు కృతజ్ఞతలు. వారి వలనే ఈ సినిమా సాధ్యపడింది. ఈ సినిమా సమిష్టి కృషి. సినిమా కోసం ప్రాణం పెట్టి పని చేశాం. యాక్షన్ డ్రామా ఫన్ ఎమోషన్ అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి' అని అన్నారు.

ఆ వాస్తవం ఏంటి?



మేఘ శ్యాం, రేఖ నిరోష

మేఘశ్యాం, రేఖ నిరోష హీరో, హీరోయిన్లుగా అంజనిసూట్ ఫిలిమ్స్ సంస్థ పై ఆదిత్య ముద్గల్ నిర్మాతగా జీవన్ బండి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'వాస్తవం'. తాజాగా చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఆదిత్య ముద్గల్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ జీవన్ చెప్పిన కథ, తీసిన విధానం చాలా బాగుంది. పి. ఆర్ అందించిన మ్యూజిక్‌కి చాలా మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'ఈ సినిమాలో చేసిన ప్రతి చిన్న క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. నా టెక్నీషియన్స్, ఆర్టిస్టులు నాకు చాలా బాగా సపోర్ట్ చేశారు. పి.ఆర్ అందించిన మ్యూజిక్ చాలా బాగా వచ్చింది. హీరో మేఘశ్యాం, హీరోయిన్ రేఖ నిరోషా చాలా బాగా నటించారు'అని దర్శకుడు జీవన్ బండి చెప్పారు.

హీరోయిన్ రేఖ నిరోషా మాట్లాడుతూ, 'మా సినిమాలో చాలా మంచి కంటెంట్ ఉంది. అందరికీ నచ్చే కథ అవుతుంది' అని అన్నారు. హీరో మేఘశ్యాం మాట్లాడుతూ, 'ఎక్కడ కథ నుంచి డివియేట్ అవ్వకుండా చాలా బాగా కథని తీసుకుని వచ్చారు. మా సినిమా అందర్నీ అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

అందరికీ సంతృప్తినిచ్చే సుందరం మాస్టర్



సిద్ధు జొన్నలగడ్డ, హర్ష


ఆర్ టీ టీం వర్క్స్, గోల్ డెన్ మీడియా పతాకాలపై రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. ఈ చిత్రంలో హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 23న విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరో సిద్ధు జొన్నలగడ్డ ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ ఈవెంట్‌లో ఆయన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు.

'చిరంజీవి ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేం. నాగ చైతన్య పాటను, సాయి ధరమ్ తేజ్ టీజర్‌ను లాంచ్ చేశారు. పదేళ్ల క్రితం ఆడియెన్స్ మధ్యలో ఉన్నాను. ఇప్పుడు ఈ స్టేజ్ మీద ఉన్నాను. మనం గట్టిగా నమ్మితే ఏదైనా సాధించగలం' అని హర్ష చెముడు చెప్పారు.

సుధీర్ కుమార్ మాట్లాడుతూ,'మా కథను నమ్మి రవితేజ ముందుకు వచ్చారు. అప్పుడు మా మీద మాకు నమ్మకం ఏర్పడింది. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'మా సినిమా పోస్టర్లు, టీజర్,ట్రైలర్‌లు అందరికీ నచ్చాయి. ఈ సినిమాలోని ఇన్నోసెన్స్ వల్లే అందరికీ నచ్చింది. రవితేజ మాకు అందించిన సపోర్ట్‌ను ఎప్పటికీ మరిచిపోలేం. ప్రకృతి అందరికీ ఒకేలా కనిపించదు. రైతుకు వర్షం అన్నం పెడితే.. రోడ్డు పక్కన బిజినెస్ చేసేవాళ్లకు ఫుడ్ లాక్కుంటుంది. అలా ఈ సినిమాను ఎన్నో కోణాల్లో చూపించాం. ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ.. మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది. సినిమాను చూసిన వారందరికీ ఓ సంతృప్తిని మాత్రం ఇస్తుంది' అని డైరెక్టర్ కళ్యాణ్ సంతోష్ చెప్పారు.

ఛాలెంజింగ్ పాత్ర చేశా



దీపక్ సరోజ్

పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్ధార్థ రాయ్'తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ అండ్ విహాన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా నిర్మించారు. ఈనెల 23న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో హీరో దీపక్ సరోజ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో పోషించిన సిద్ధార్థ రాయ్ పాత్ర చాలా లాజికల్‌గా, ఎక్స్ట్రీమిజంలో ఉంటుంది. తను చాలా నాన్ రియాక్టివ్‌గా ఉంటాడు. మొదట్లో ఎంత కంట్రోల్‌గా ఉంటాడో తర్వాత అంత అన్ కంట్రోల్ అయిపోతాడు. ఇది ప్లెయిన్ క్యారెక్టర్ కాదు. ఈ సినిమాకి 'సిద్ధార్థ రాయ్' పేరుపెట్టడానికి బలమైన కారణం వుంది. ఇందులో సిద్ధార్థ అనేది రివర్స్ థీసెస్ అఫ్ గౌతమ బుద్ధ. దర్శకుడు యశస్వీ చాలా అద్భుతంగా స్క్రిప్ట్ చేశారు. నాపాత్రను అందరూ అంగీకరిస్తారు' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

తదుపరి వృద్ధికి ప్రయివేటు పెట్టుబడులే కీలకం

- ఆర్బీఐ బులిటెన్‌లో వెల్లడి



ముంబయి : భారతదేశ తదుపరి వృద్ధికి ప్రయివేటు పెట్టుబడులు కీలకంగా మారను న్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన బులిటెన్‌లో పేర్కొంది. 2023-24 ప్రథ మార్థంలో అంచనాలకు అనుగుణంగానే ఆర్థిక వ్యవస్థ నమోదయ్యిందని పేర్కొంది. కార్పొరేట్ రంగంలోని తాజా పెట్టుబడులు తదుపరి వృద్ధికి ప్రధానం కానున్నాయని పేర్కొంది.

2024లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంచనాల కంటే బలంగానే ఉందని శనివారం విడుదల చేసిన ఆర్బీఐ తన బులిటెన్‌లో పేర్కొంది. 2024-25లో భారత వృద్ధి రేటు 7 శాతంగా చోటు చేసుకోవచ్చని సెంట్రల్ బ్యాంక్ అంచనా వేసింది. 2019 అక్టోబర్‌తో పోల్చితే రిటైల్ ద్రవ్యోల్బణం 2024 జనవరి, అంతక్రితం డిసెంబర్, నవంబర్‌లోనూ తక్కువగానే నమోదయ్యిందని తెలిపింది. వచ్చే 2024-25కు గాను రిటైల్ సీపీఐ 4.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది.

నేటి నుంచి బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య సంప్రదింపులు



న్యూఢిల్లీ: బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) వీలుగా మరిన్ని సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇందుకోసం భారత అధికారులు ఫిబ్రవరి 21-24 తేదిల్లో లండన్ పర్యటనకు వెళ న్నారు. ఈ ప్రతినిధి బృందానికి వాణిజ్య సెక్రటరీ సునీల్ కుమార్ బర్త్వాల్ నాయకత్వం వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య ఎఫ్‌టీఏకు సంబంధించి ఎప్పటి నుంచో అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని.. ఏప్రిల్-మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందే దీనిపై ఓ స్పష్టత కోసం ప్రయత్నిస్తున్నామని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

ఎసూస్ రిటైల్ విస్తరణ



హైదరాబాద్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, గేమింగ్ బ్రాండ్ ఎసుస్ ఇండియా మంగళవారం హైదరాబాద్‌లో తమ రెండవ ఆర్‌ఒజి స్టోర్‌ను ప్రారంభించింది. కొండాపూర్‌లో దాదాపు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో నోట్‌బుక్‌లు, ఆర్‌ఒజి పిసిలు, ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్‌వన్ పిసిలు, యాక్సెసరీస్, క్రియేటర్ సిరీస్‌లను అమ్మకానికి అందుబాటులో ఉంచింది. ఇది హైదరాబాద్‌లో తమకు 4వ స్టోర్ కాగా, తెలుగు రాష్ట్రాలలో మొత్తం 13 ఎఐఎస్ అండ్ ఒర్‌ఒజి స్టోర్లకు విస్తరించినట్లయ్యిందని ఏసుస్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్ జిగ్నేష్ భావ్‌సర్ తెలిపారు. దేశంలో 19 ఆర్‌ఒజి ప్రత్యేక అవుట్‌లెట్‌లను కలిగి ఉందన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

మరిన్ని రాష్ట్రాలకు డ్రోగో డ్రోన్స్ విస్తరణ

హైదరాబాద్ : వచ్చే కొన్ని మాసాల్లో మరిన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు డ్రోగో డ్రోన్స్ తెలిపింది. విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రాజెక్ట్ (విబిఎస్‌వై) కోసం అనేక రాష్ట్రాలలో డ్రోన్‌లను విజయవంతంగా వాడినట్లు తెలిపింది. ఐఎఫ్‌ఎఫ్‌సిఒ, ఎఫ్‌ఎసిటి, ఎన్‌ఎఫ్‌ఎల్ భాగస్వామ్యంతో తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్ ఛత్తీస్‌గఢ్‌లలో 300కి పైగా డ్రోన్‌లను విజయవంతంగా ఉపయోగించినట్లు డ్రోగ్ డ్రోన్స్ సీఈఓ యశ్వంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో డ్రోగో తన డ్రోన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇవి రైతులకు సేవలను అందించేలా క్రిమిసంహారక మందులను స్ప్రే చేస్తున్నాయన్నారు.

ఎఐసిటిఇతో సర్వీస్‌నౌ జట్టు

హైదరాబాద్ : ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రముఖ డిజిటల్ వర్క్‌ఫ్లో కంపెనీ సర్వీస్‌నౌ ప్రకటించింది. దీంతో తమ సర్వీస్‌నౌ వేదికపై తొలి ఏడాదిలో 10వేల మంది విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొంది. ఇందుకోసం ఎఐసిటిఇతో అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకం చేసినట్లు పేర్కొంది. దీంతో వచ్చే మూడేండ్లలో 25,000 మంది విద్యార్థులను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సర్వీస్‌నౌ చీఫ్ స్ట్రాటజీ, కార్పొరేట్ వ్యవహారాల అధికారి నిక్ ట్జిట్జోన్ పేర్కొన్నారు. టెక్, డిజిటల్ రంగంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

నగరంలో మూడు కొత్త సెంటర్లు తెరిచిన ఫిజిక్స్ వాలా

హైదరాబాద్ : నగరంలోని మాదాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లిలో మూడు టెక్ ఎనేబుల్డ్ ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఫిజిక్స్ వాలా (పిడబ్ల్యు) వ్యవస్థాపకుడు, సీఈఓ అలఖ్ పాండే తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకునేందుకు వారితో ఆయన ముఖాముఖిలో మాట్లాడారు. తాము దేశంలోని 49 నగరాల్లో 75 విద్యాపీఠ్ కేంద్రాల ద్వారా 1.5 లక్షల మంది విద్యార్థులకు సేవలు అందిస్తోన్నామన్నారు.

మాదాపూర్‌లో 'స్వాద్ ఆఫ్ సౌత్' కొత్త అవుట్‌లెట్ ఏర్పాటు

హైదరాబాద్ : స్వచ్ఛమైన శాఖాహార దక్షిణ భారతీయ వంటకాలను అందించే 'స్వాద్ ఆఫ్ సౌత్' కొత్తగా మాదాపూర్‌లో తమ అవుట్‌లెట్‌ను తెరిచినట్లు ప్రకటించింది. ఆగస్ట్ 2022లో ప్రారంభమైనప్పటి నుంచి దక్షిణాది వంటకాలలో మహోన్నత వంటకాల రుచులను అందిస్తున్నామని స్వాద్ ఆఫ్ సౌత్ సహ వ్యవస్థాపకుడు రోసక్ సింఘి తెలిపారు. దక్షిణ భారత వంటకాల ఆనందాన్ని హైదరాబాద్‌లో మరియు మరిన్ని ప్రాంతాలలో పంచుకునే అవకాశం గురించి మేము ఆసక్తిగా ఉన్నాము" అని ఆ సంస్థ మరో సహ వ్యవస్థాపకుడు కృష్ణ చౌదరి పేర్కొన్నారు.

ప్రగతి మైదాన్ టన్నెల్‌లో పగుళ్లు, లీకేజీలు

న్యూఢిల్లీ : ప్రారంభించిన రెండు సంవత్సరాలకే ప్రగతి మైదాన్ టన్నెల్‌లో పగుళ్లు కన్పిస్తున్నాయి. నీరు లీక్ అవుతోంది. నోయిడా, ఘజియాబాద్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం 2022 జూన్‌లో 1.3 కిలోమీటర్ల పొడవైన టన్నెల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. అదే సమయంలో మథుర రోడ్డులో ఐదు అండర్‌పాస్‌లు కూడా ప్రారంభమయ్యాయి. ఢిల్లీలోని అతి వెడల్పయిన ఈ టన్నెల్‌ను 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక బృందం గత వారం పరిశీలించింది. కాంక్రీట్ దిమ్మలు, సైడ్ వాల్స్, ఉపరితలం, సీలింగ్ నుండి నీరు లీక్ అవడాన్ని పాత్రికేయుల బృందం గుర్తించింది. డ్రైనేజ్ సమస్యలు కూడా కన్పించాయి. టన్నెల్ ఉపరితలంలో అనేక చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. వాటిటో నీరు నిలిచి ఉంది. టన్నెల్ గోడలు కూడా దెబ్బతిన్నాయి. తరచుగా నీరు లీక్ అవుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాకాలంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. పగుళ్లు, లీకేజీల నేపథ్యంలో మథుర రోడ్డులోని టన్నెల్ ప్రవేశ మార్గాన్ని మూసేశారు. ప్రస్తుతం టన్నెల్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.

'ఢిల్లీ చలో' పునఃప్రారంభం

- టియర్ గ్యాస్ షెల్స్‌ను ఎదుర్కొనేందుకు ఇనుప కవచాలు
- జనపనార బస్తాలతో బారికేడ్లు
- ఇనుప చువ్వలను తొలగించే ప్రత్యేక సామాగ్రి
- భారీ సమీకరణ, సన్నాహాలతో సిద్ధమైన రైతులు
- ప్రత్యేక పార్లమెంటు సమావేశం నిర్వహించి ఎంఎస్‌పీ చేయాలని డిమాండ్
- 177 సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసిన కేంద్రం





నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దులో రైతుల పోరాటం ఉధృతమవుతున్నది. మూడు రకాల పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తిని పాత ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన రైతులు తమ నిరసనలను బుధవారం తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ తరుణంలో పోలీసులు ప్రయోగించే టియర్ గ్యాస్ షెల్స్‌ను ఎదుర్కొనేందుకు ఇనుప కవచాలు, జనపనార బస్తాలతో శంభు సరిహద్దులో పంజాబ్, హర్యానా రైతులు భారీగా చేరుకున్నారు. అలాగే రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లు, ఇనుప చువ్వలను తొలగించేందుకు రైతులు భారీ యంత్రాలను కూడా సిద్ధం చేశారు. పోలీసులు తమ పోరాటానికి అడ్డుతగులుతారని భావించిన రైతులు ఈ ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో దేశ రాజధానిలో జర్నలిస్టులకు అధికారులు ఐడీ కార్డులు జారీ చేశారు. శాంతియుతంగా ఢిల్లీ వైపు పాదయాత్ర కొనసాగిస్తామని రైతులు చెబుతున్నారు. "మాపై బలప్రయోగం చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. మేం శాంతియుతంగా నిరసన తెలియచేయాలనుకుంటున్నాం" అని రైతులు అన్నారు. ఫిబ్రవరి 21 (బుధవారం)న ఉదయం 11 గంటలకు 'చలో ఢిల్లీ' పాదయాత్ర సాగుతుందని రైతు నేతలు ప్రకటించారు.

పంజాబ్ గ్రామాల నుంచి భారీ జన సమీకరణ

ఫిబ్రవరి 21న 'ఢిల్లీ చలో' మార్చ్‌కు ముందు, తమ డిమాండ్ల కోసం శంభు సరిహద్దుకు చేరుకుని తమతో కలిసి ఢిల్లీకి పాదయాత్ర చేయాలని మద్దతుదారులను కోరుతూ రైతు సంఘాలు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాయి. శంభు వద్ద ఆందోళనలో వేలాది మంది రైతులు చేరడంతో మంగళవారం సాయంత్రం నాటికి సంఖ్య భారీగా పెరిగింది.

ప్రభుత్వం ఆలస్యం చేస్తోంది

"ప్రభుత్వం సమస్యను ఆలస్యం చేస్తోంది. మొత్తం 23 పంటలపై ఎంఎస్‌పీ గురించి రాతపూర్వక హామీ అందించకపోతే, మేం ఆందోళన చేయడం తప్ప వేరే మార్గం లేదు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం పంటల ధరలను నిర్ణయించాలి" అని భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా సిద్ధూపూర్) చీఫ్ జగ్జిత్ సింగ్ దల్లేవాల్ అన్నారు.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించి ఎంఎస్‌పీ చట్టం చేయాలి

ఒకరోజు పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించి, ఎంఎస్‌పీ హామీపై చట్టం తీసుకురావాలని రైతు నాయకుడు సర్వన్‌సింగ్ పంధేర్ కేంద్రాన్ని కోరారు. "కార్పొరేట్ లాబీ ఎంఎస్‌పీ చట్టాన్ని ఎప్పటికీ అనుమతించదు.

ఈ చట్టం వస్తే మన వ్యవసాయం, మండీలపై కత్తి కట్టడం శాశ్వతంగా పోతుంది" అని ఆయన అన్నారు. "సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా కూడా చేయదగినదే. కేంద్రం రుణమాఫీ కూడా ప్రకటించాలి. బ్యాంకులు ఆదేశిస్తే వెంటనే ఎంత అప్పు ఉందో చెబుతాయి" అని అన్నారు.

177 సోషల్ మీడియా ఖాతాలను, లింక్‌లను బ్లాక్ చేసిన కేంద్రం

రైతుల 'ఢిల్లీ చలో' పిలుపు నేపథ్యంలో 177 సోషల్ మీడియా ఖాతాలు, రైతుల ఆందోళనలతో అనుబంధం ఉన్న లింక్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిషేధించింది. "పబ్లిక్ ఆర్డర్" నిర్వహించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ అత్యవసర నిషేధ ఆదేశాలను జారీ చేసింది. హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ గత వారం చేసిన అభ్యర్థన మేరకు మంగళవారం ఈ ఉత్తర్వులు కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది.

బండి సంజయ్‌కి బడితె పూజ తప్పదు

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ అధ్యక్ష పదవి పోయిన ఫ్రస్టేషన్‌లో బండి సంజయ్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎంపిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ ఆయన నీచంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పై అవాకులు చెవాకులు పేలితే బండి సంజయ్‌కి బడితె పూజ తప్పదని ఒక ప్రకటనలో హెచ్చరించారు. బండి సంజయ్ నోరు జారితే, ఇలాంటివి రిపీట్ అయితే తాము చేతికి పని చెప్పాలి ఉంటుందని తెలిపారు. కేసీఆర్ ఢిల్లీకి వెళ్తారని మీడియాలో వార్తలు వస్తే, తప్పు పడుతున్న ఆయన, ఎంపీగా తాను, కిషన్ రెడ్డి ఎందుకు ఢిల్లీకి వెళ్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ గ్రూపు తగాదాలు భరించలేక బండి అసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పొత్తుల గురించి మాట్లాడుతున్న బండి సంజయ్ ఎవరిని ఉద్దేశించి, ఆ వ్యాఖ్యలు చేశారో? బిజెపితో పొత్తు కావాలని బండి సంజయ్ ను ఎవరు అడిగారో చెప్పాలని సవాల్ చేశారు.

బీజేపీ నేత ప్రభాకర్‌పై చట్టపరమైన చర్యలు

- ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి సుజాత పౌల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దీపాదాస్‌మున్షిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి సుజాతపౌల్ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ అధికార ప్రతినిధులు భవానిరెడ్డి, రియాజ్, డాక్టర్ లింగం యాదవ్, శ్రీకాంత్ యాదవ్‌తో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ మహిళ వ్యతిరేక పార్టీ అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు.

విజయ సంకల్ప యాత్రలు కాదు...మోసపు యాత్ర

రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ చేపట్టబోయేది సంకల్ప యాత్ర కాదనీ, మోసపూరితమైన యాత్ర అని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. పదేండ్లుగా రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయానికి లెంపలేసుకుని రాష్ట్ర నాయకులు యాత్రలు చేయాలని సూచించారు. ఒక్క ప్రాజెక్టుగానీ, పథకాన్నిగానీ, అభివృద్ధిగానీ ఇచ్చిందా? అని ప్రశ్నించారు.

కేంద్రం కుట్ర

- సీఏఏ-ఎన్నార్సీ అమలు కోసం ఆధార్‌కార్డులు నిష్క్రియం :పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ ఆరోపణ



కోల్‌కతా : పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్స్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్నార్సీ)ల విషయంలో మోడీ సర్కారుపై పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమత బెనర్జీ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి అమలు కోసం కేంద్రం కుట్ర చేస్తున్నదనీ, రాష్ట్రంలో స్థానికుల ఆధార్ కార్డులు నిష్క్రియం (డీయాక్టివేట్) అవుతున్నాయని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి ఆరోపించారు. సీఏఏ ను లోక్‌సభ ఎన్నికలకు ముందే దేశవ్యాప్తంగా అమలు చేస్తామని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారు. అలాగే, ఎన్నార్సీని సైతం దేశవ్యాప్తంగా చేపడతామని కూడా 2019, నవంబర్‌లో ఆయన తెలిపారు. ఇప్పటి వరకు దేశంలో ఒక అసోంలో మాత్రమే ఎన్నార్సీ ప్రక్రియ జరిగింది. ఇది అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. వివాదాస్పదంగా మారిన ఎన్నార్సీ, సీఏఏలు దేశంలో ఇప్పటికే అనేక నిరసనలకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాష్ట్రంలోని బర్ధమాన్‌లో కనీసం 50 ఆధార్ కార్డులు డీయాక్టివేట్ జరిగాయన్న సమాచారం తన దగ్గర ఉన్నదని మమతా తెలిపారు. రాష్ట్రంలోని బిర్‌భూమ్, ఉత్తర 24 పరగణాలు, బుర్ద్వాన్, అనేక ఇతర జిల్లాల్లోనూ ఇవే పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆమె ఆరోపించారు. నిర్లక్ష్యపూరితంగా ఆధార్ ఓకార్డులను, ప్రత్యేకించి ఎస్సీ, స్టీ, ఓబీసీ వర్గాలను లక్ష్యంగా చేసుకుంటూ డీయా ఓక్టివేట్ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నట్టు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆమె స్పందించారు. కేంద్రం తీరును తప్పుబట్టారు. కాగా, ఈ అంశంపై కేంద్రం స్పందించింది. ఆధార్ కార్డులు డీయాక్టివేట్ కావటానికి గల కారణం టెక్నికల్ ఎర్రర్ అని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ స్పష్టం చేశారు. డీయాక్టివేట్ అయిన ఆధార్ కార్డులు త్వరలోనే మళ్లీ యాక్టివేట్ అవుతాయని పత్రికా సమావేశంలో ఆయన స్పష్టం చేశారు.

ప్రతి ఆరుగురు పిల్లల్లో ఒకరికి పోషకాహార లోపం

- గాజాపై యునిసెఫ్ అధ్యయనంలో వెల్లడి



గాజా : గాజాలోని ఉత్తర ప్రాంతంలో ప్రతి ఆరుగురు పిల్లల్లో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్య సమితి బాలల సంస్థ యునిసెఫ్ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. గాజా వ్యాప్తంగా ఈ పరిస్థితులు మరింత తీవ్రంగా వున్నాయని తెలిపింది. ఇజ్రాయిల్ సైన్యం జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు 29వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. మొత్తంగా నివాస ప్రాంతాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. 80శాతానికి పైగా జనాభా నిర్వాసితులయ్యారు. ఈ నేపథ్యంలో యునిసెఫ్ నేతృత్వంలో గ్లోబల్ న్యూట్రిషన్ క్లస్టర్ అధ్యయనం జరిపి నివేదిక ఇచ్చింది. గాజాలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో 90శాతానికి పైగా పిల్లలు రోజుకు రెండు లేదా అంతకంటే తక్కువ ఆహార రకాలు తింటున్నారని పేర్కొంది. ఇది తీవ్ర ఆహార దారిద్ర్యం కిందకు వస్తుందని పేర్కొంది. అంటువ్యాధులతో బాధపడుతున్న పిల్లలు కూడా దాదాపు 90శాతం మంది వున్నారని తెలిపింది. గత రెండు వారాల్లో 70శాతం మంది డయేరియాతో బాధపడుతున్నారని పేర్కొంది.

గాజాలో 80శాతానికి పైగా ఇళ్లకు పరిశుద్ధమైన, సురక్షితమైన నీరు అందుబాటులో వుండడం లేదు. సగటున ఒక కుటుంబానికి ఒక వ్యక్తికి ఒక రోజుకు ఒక లీటరు నీరు లభ్యమవుతోందని ఆ నివేదిక తెలిపింది. మానవతా సాయం చాలావరకు అందుతున్న దక్షిణ ప్రాంత నగరమైన రఫాలో తీవ్రమైన పోషకాహార సమస్య 5శాతంగా వుంది. అదే సమయంలో ఉత్తర గాజాలో 15శాతంగా వుంది. యుద్ధానికి ముందు గాజా వ్యాప్తంగా పోషకాహార సమస్య 1శాతం కన్నా తక్కువగానే వుందని నివేదిక పేర్కొంది. గాజాలో నివారించదగ్గ బాలల మరణాలు కూడా అధికంగానే చోటు చేసుకుంటున్నాయని యునిసెఫ్ అధికారి టెడ్ చాలిబన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాజాలోని 23లక్షలమంది జనాభా ఆహార సంక్షోభాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, అందులో నాల్గవ వంతు జనాభా తీవ్రంగా కరువు బారిన పడ్డారని డిసెంబరులో ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది.

తాము మానవతా సాయాన్ని అడ్డగించడం లేదని ఇజ్రాయిల్ చెబుతున్నప్పటికీ ఇజ్రాయిల్ సైనిక దాడుల్లో ధ్వంసమైన రోడ్లు, మౌలిక వసతుల కారణంగా సహాయ బృందాలు గమ్యస్థానాలను చేరలేకపోతున్నాయి. పది లక్షల మందికి పైగా ప్రజలకు ఆహారాన్ని అందించగల రవాణాను ఇజ్రాయిల్ ఆపేసిందని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ ఈ నెల ఆరంభంలో పేర్కొంది.

'మహా' అసెంబ్లీలోమరాఠా రిజర్వేషన్ బిల్లు ఆమోదం



ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీలో మరాఠా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. రాష్ట్రంలో విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరాఠాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించేదే ఈ మరాఠా రిజర్వేషన్ బిల్లు. మహారాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ నివేదికను రాష్ట్ర క్యాబినేట్ ఆమోదించిన కొన్ని గంటలకే అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లు పాసైంది. మరాఠా వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన తరగతి అనీ, దానికి పది శాతం రిజర్వేషన్ కల్పించాలని సదరు నివేదిక సిఫారసు చేసింది. ఈ రిపోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గత శుక్రవారం అందింది. " మరాఠా రిజర్వేషన్ అంశంపై మనందరిదీ అభిప్రా యాలు ఒకటే. దీనిపై ఇక్కడ నేను ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయదలుచుకోలేదు. ప్రస్తుతమున్న ఓబీసీ కోటాకు ఎలాంటి ఆటంకం కలగకుండా మరాఠాలకు రిజర్వేషన్‌ను ప్రతిపాదించాం" అని రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు.

పాక్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై తొలగని ప్రతిష్టంభన



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా అనిశ్చితి తొలగలేదు. ఇటీవల జరిగిన పాక్ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు కోసం అధికారాన్ని పంచు కునే ఫార్ములాపై పిఎంఎల్-ఎన్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) నేతల మధ్య తాజాగా జరిగిన చర్చలు కూడా సఫలం కాలేదు. ఏకాభిప్రాయానికి రావడంలో ఉభయ పక్షాలు విఫలమయ్యాయి. పిఎంఎల్-ఎన్ సీనియర్ నేత, సెనెటర్ ఇషాక్ దర్ నివాసంలో మంగళవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఎన్నికలు అనంతరం ఏర్పడిన ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు ఇప్పటికి ఇరు పార్టీల సమన్వయ కమిటీల మధ్య ఐదుసార్లు చర్చలు జరిగాయి. సోమవారం మూడు గంటల పాటు చర్చలు జరిగిన తర్వాత తాత్కాలికంగా విరామం ఇచ్చి మళ్లీ రాత్రి 10గంటలకు సమావేశమవాలని నిర్ణయించారు. కానీ ఆ సమావేశం జరగలేదు. చివరకు రాత్రి 11గంటలకు పిఎంఎల్-ఎన్ సమావేశాన్ని ముగిస్తూ, బుధవారం తిరిగి పిపిపితో చర్చలు పునరుద్ధరిస్తామని ప్రకటించింది. పిపిపిని మంత్రివర్గంలోకి తీసుకోవడానికి సంబంధించిన అంశాలపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు పిఎంఎల్-ఎన్ నేత ఆజం నజీర్ విలేకర్లకు తెలిపారు. ఇదిలావుండగా, ముత్తెహిదా క్వామి మూవ్‌మెంట్ (పాకిస్తాన్) పిఎంఎల్-ఎన్‌కు మద్దతునిస్తామని సోమవారం ప్రకటించింది. ఈ పార్టీకి 17సీట్లు వున్నాయి.

పొంజి స్కామ్ కేసు...

- కోల్‌కత్తాలో సిబిఐ సోదాలు



న్యూఢిల్లీ : పొంజి స్కామ్ కేసు 2021 దర్యాప్తులో భాగంగా కోల్‌కత్తాలో మంగళవారం రెండు ప్రాంతాల్లో సిబిఐ సోదాలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అమల్ భట్టాచార్య నివాసంతో పాటు అతని సంస్థ యూనిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి ఈ సోదాలు ప్రారంభమైనట్లు చెప్పారు. అమల్ భట్టాచార్యకు వ్యతిరేకంగా 2022 డిసెంబరులో సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆర్‌బిఐ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యూనిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలా వ్యవహరిస్తోందని ఫిర్యాదులు ఉన్నాయి. భూములను విక్రయించే పేరుతో ప్రజల నుంచి డబ్బు వసూలు చేయడానికి తమను నియమించారని ఆరోపిస్తూ యూనిక్స్ ఏజెంట్లు జిల్లా డిప్యూటీ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించడంతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పశ్చిమ బెంగాల్ పోలీసుల నుంచి ఈ కేసు విచారణను సిబిఐ స్వీకరించింది.

సంధ్యని పరామర్శించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్యని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం ఆమె భర్త రామకృష్ణా రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిమాయత్ నగర్‌లోని సంధ్య నివాసానికి వెళ్లిన కవిత ఆమెను పరామర్శించారు. రామకృష్ణారెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టు అరెస్టుపై ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన

న్యూఢిల్లీ : విధి నిర్వహణలో ఉన్న ఒక టెలివిజన్ జర్నలిస్టును పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేయడం 'ఆందోళనకరం' అని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా పేర్కొంది. రిపబ్లిక్ బంగ్లా అనే వార్తా సంస్థకు చెందిన జర్నలిస్టు సంతు పాన్ లైవ్ రిపోర్టింగ్ చేస్తుండగా పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. 'విధి నిర్వహణలో ఉండగా జర్నలిస్టు అరెస్టు ఆందోళకరం' అని ఎడిటర్స్ గిల్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. జర్నలిస్టుపై ఆరోపణలు వచ్చినట్లయితే పోలీసులు ఖచ్చితంగా దర్యాప్తు చేయాలని, అయితే రిపోర్టింగ్ చేస్తున్నప్పుడు జర్నలిస్టును అరెస్టు చేయడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ప్రకటనలో ఖండించింది. పశ్చిమ బెంగాల్‌లోని పరిపాలన యంత్రాంగం విచారణను తక్షణమే పూర్తి చేసి సంతు పాన్‌కు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని ఎడిటర్స్ గిల్డ్ పిలుపునిచ్చింది.

నిరుద్యోగులకు మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం

- బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ సీఎం కాక ముందు రాష్ట్రంలో 2 లక్షల ఉద్యో గాలు ఖాళీ ఉన్నాయని చెప్పారని గుర్తు చేశారు. వాటిని అధికారంలోకి రాగానే భర్తీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించారని తెలిపారు. ఇంత వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని గుర్తు చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు.కొత్తగా విడుదల చేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్ వెనుక కోచింగ్ కేంద్రాల మాఫియా ఉందని ఆరోపించారు. గ్రూప్ 2 పరీక్షలను వెంటనే పెట్టాలనీ, కొత్త నోటిఫికేషన్ విడుదల చేయకుండా అదే నోటిఫికేషన్ కంటిన్యూ చేయాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ దే హవా

- పీపుల్స్ పల్స్ -సౌత్ ఫస్ట్ ట్రాకర్ పోల్ సర్వేలో వెల్లడి

నవతెలంగాణ- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను, పార్టీల బలబలాలను, లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఆధిక్యత చూపించబోతున్నారు, ప్రజల మనసులో ఎవరున్నారో అంచనా వేయడానికి సౌత్ ఫస్ట్ కోసం పీపుల్స్ పల్స్ రీసర్చ్ సంస్థ ట్రాకర్ పోల్ సర్వే నిర్వహించింది. పీపుల్స్ పల్స్ -సౌత్ ఫస్ట్ ట్రాకర్ పోల్ సర్వే ప్రకారం... పీపుల్స్ పల్స్ -సౌత్ ఫస్ట్ ట్రాకర్ పోల్ సర్వే ప్రకారం... రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 8-10 స్థానాలు, బీఆర్ఎస్ పార్టీ 3-5 స్థానాలు, బీజేపీ 2-4 స్థానాలు, ఇతరులు ఒక స్థానం గెలుచుకునే అవకాశం ఉంది.

24న రాష్ట్రానికి అమిత్‌షా

- విజయ సంకల్ప యాత్రలో పాల్గొనే అవకాశం
- రాష్ట్రంలోని కీలక నేతలతో భేటీ
- అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపుపై ఫోకస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లుగా విభజించి కొనసాగిస్తున్న విజయ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ నెల 24న రాష్ట్రానికి రానున్నారు. సభలో పాల్గొన్న అనంతరం బీజేపీ రాష్ట్ర కీలక నేతలతో ఆయన భేటీ అయ్యే అవకాశముంది. ప్రధానంగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో వీలైనంత మేరకు ఎక్కువ స్థానాల్లో గెలుపునకు చేయాల్సిన కార్యాచరణపై ఆయన దిశానిర్దేశనం చేయనున్నారు.

ధూపదీప నైవేద్యం జీతాలు ఇవ్వటం లేదు

బీఆర్ఎస్ నాయకులు దేవి ప్రసాద్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఆరు నెల్లుగా ధూపదీప నైవేద్యానికి సంబంధించిన కింద జీతాలు ఇవ్వటం లేదని బీఆర్ఎస్ నాయకులు దేవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 6,441 దేవాలయాల్లో ధూప దీప నైవేద్యం నిర్వాహణ, అర్చకుల వేలనాలను ప్రభుత్వం రూ.2,500 నుంచి రూ. ఆరువేలకు గత ప్రభుత్వం పెంచిందనీ, ఆ తర్వాత నెలకు పదివేలు పెంచిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మొదటి తారీఖు నాడే జీతాలు ఇస్తున్నామని చెప్పారనీ, కానీ చాలా మందికి ఇప్పటికీ జీతాలు పడలేదని పేర్కొన్నారు.. ఈ నేపథ్యంలో మంగళవారం చలో సచివాలయం ముట్టడికి వస్తున్న అర్చకులను ఎక్కడికక్కడే అడ్డుకున్నారని తెలిపారు.ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తేవాలనే పిటిషన్ విచారణ వాయిదా

- ఏప్రిల్ 30న తుది వాదనలు వింటామన్న ధర్మాసనం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ పరీవాహ ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సర్వోన్నత న్యాయస్థానం వాయిదా వేసింది. 2021 ఏడాది మొదట్లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడంపై కేంద్రానికి ఫిర్యాదు చేసిన ఏపీ ప్రభుత్వం, అదే ఏడాది జులైలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ నిర్ణయం వల్ల ప్రాజక్టుల్లో నీటి వాటా వినియోగంలో తేడాలు వస్తున్నాయని తెలిపింది. ఈ పిటిషన్ పై గతంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రానికి, కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో సీఎండిలకు నోటీసులు జారీ చేసింది. కాగా ఈ పిటిషన్ మంగళవారం మరోసారి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై సుదీర్ఘ వాదనలు వినిపించాల్సి ఉందని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ధర్మాసనానికి విన్నవించారు. అయితే, తొలుత సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా మరో కోర్టులో ఉన్నందున పాస్ ఓవర్ అడిగినప్పటికీ విచారణ వాయిదా వేసే ఉద్దేశం ఉంటే తాము వాదనలకు సిద్ధమని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఉమాపతి కోరారు. ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం... ఏప్రిల్ 30న తుది వాదనలు వింటామని స్పష్టం చేసింది.

కొత్త క్రిమినల్ చట్టాలను ప్రచారం చేయాలి

- వాటి చుట్టూ ఉన్న "అపోహలను" తొలగించాలి
- యూనివర్సిటీలు,ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలను ప్రచారం చేయాలని, వాటి చుట్టూ ఉన్న "అపోహలను" తొలగించాలని దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థ (హెచ్ఈఐ)లను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశించింది. కొత్త చట్టాలు వ్యక్తి స్వేచ్ఛను "బెదిరించేవి", "పోలీసు రాజ్యం" స్థాపన లక్ష్యంగా ఉన్నాయని, దేశద్రోహ నిబంధనల కింద అలాగే ఉన్నాయని, ఈ చట్టం "పోలీసు చిత్రహింసలకు" వీలు కల్పిస్తుందని ఉన్న అపోహలను విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు పోగొట్టి, అవి మంచి చట్టాలని ప్రచారం చేయాలని ఆదేశించింది. యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి మాట్లాడుతూ, "భారతీయ న్యాయ సంహిత- 2023 గురించి ప్రచారం చేయాలని, స్టాండీలతో ప్రదర్శనలు, ఫ్లైయర్‌లను పంపిణీ చేయాలి. న్యాయవాదులచే సెమినార్‌లు, చర్చలు నిర్వహించడంతో ప్రచారం చేయాలని ఉన్నత విద్యా సంస్థలను అభ్యర్థించాం" అని తెలిపారు. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు పంపడం కోసం ఉన్నత విద్యా సంస్థలు నిర్వహించిన కార్యకలాపాల వివరాలను పంచుకోవాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కోరినట్లు ఆయన తెలిపారు.భారతీయ సాక్ష్యా సంహిత (బిఎస్ఎస్)-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్)-2023, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)-2023 శీతాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం ముద్ర తరువాత అవి చట్టాలుగా రూపొందాయి. ఆ చట్టాలను ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఎ)-1872, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)-1973, ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి)ల స్థానంలో తీసుకొచ్చారు."కొత్త క్రిమినల్ చట్టాలు వ్యక్తి స్వేచ్ఛను బెదిరిస్తాయి. పోలీసు రాజ్యాన్ని స్థాపించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయిటీ అవిఇప్పటికే ఉన్న క్రూరమైన నిబంధనలను తిరిగి ప్యాకేజింగ్ చేయడంలో భాగమే. కస్టడీని 15 నుండి 90 రోజులకు పొడిగించడం కొత్త క్రిమినల్ చట్టాలలో పోలీసు చిత్రహింసలకు అవకాశం కల్పించే ఒక దిగ్భ్రాంతికరమైన నిబంధన ఉంది. దేశద్రోహం పోయింది, కానీ భారతీయ న్యాయ సంహిత-2023లో 'దేశద్రోహ'గా కనిపిస్తుంది. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023 కింద హిట్-అండ్-రన్ కేసుల్లో కఠినమైన శిక్ష విధించబడుతుంది" వంటి వాటిని మంచిగా ప్రచారం చేయాలి."బిఎన్ఎస్ లో 20 కొత్త నేరాలు చేర్చగా, ఐపిసిలో ఉన్న 19 నిబంధనలు తొలగించబడ్డాయి.


కాళేశ్వరం కుంభకోణంతో ఖజానా ఖాళీ

- బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అన్నవారిని చెప్పుతో కొట్టండి
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు : కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- తాండూరులో బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభం



నవతెలంగాణ-తాండూరు

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కాళేశ్వరంలో జరిగిన కుంభకోణంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. మీడియాకు లీకులు ఇస్తూ లేనిపోని ప్రచారాలు చేస్తున్న వారికి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణలో బీజేపీ పొత్తు పెట్టుకోలేదని, ఇప్పుడు ఓడిపోయిన పార్టీతో పొత్తు ఎలా పెట్టుకుంటామని, పొత్తు ఉంటుందన్న వారిని చెప్పుతో కొట్టాలన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తాండూర్ పట్టణ కేంద్రంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను ప్రారంభించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, చేవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్‌పై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉంటే కేసీఆర్‌ను ఇప్పటికే జైల్లో పెట్టేవాళ్లమన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ఆస్తులను జప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, కృష్ణా జలాల అప్పగింతపై రెండు పార్టీలు విమర్శలు చేసుకుంటూ అసెంబ్లీలో బైపాస్ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో కచ్చితంగా మూడోసారి మోడీ ప్రభుత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ, జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, సీనియర్ నాయకులు యు.రమేష్ కుమార్, ఎం.నరేష్‌మహరాజ్, గాజుల శాంతుకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు బాలి శివకుమార్, అంతారం లలిత, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, కౌన్సిలర్ సాహు శ్రీలత, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో..
బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,560	▼	110
22 క్యారెట్లు	- 57,350	▼	100
కిలో వెండి	- 77,000	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	135
రిటైల్ (లైవ్)	రూ.	157
స్కిన్‌తో	రూ.	228
స్కిన్‌లెస్	రూ.	259

మన కంచంలో బ్రెజిల్ పప్పు

దిగుమతులపైనే మోడీ సర్కార్ దృష్టి

శాస్త్రవేత్తల పరిశోధనలు..దిగుబడులు ఉన్నా విదేశాలపైనే ఆధారం





భారతదేశంలో పండించే పంటలకు బహిరంగ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. విదేశాల్లోనూ ఎగబడి కొనుగోలు చేస్తారు. అయితే ఇప్పటికే నూనెలు..ఇతర వస్తువులను విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటుండగా ..ఇకపై మన కంచంలోకి బ్రెజిల్ పప్పు కూడా రాబోతోంది. విదేశాల నుంచి అవసరం ఉన్నా.. లేకపోయినా మోడీ పర్యటనల్లో ఎంఓయూలు కుదుర్చుకోవటం సర్వసాధారణమైపోయింది. అయితే ఇక్కడి రైతు మద్దతు ధర ఇవ్వాలని వీధుల్లోకొచ్చి మొత్తుకుంటున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. మీరు పంట పండించకపోయినా..విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామన్న ధోరణి కనిపిస్తోంది.

న్యూఢిల్లీ: పప్పులు...ముఖ్యంగా కందిపప్పు, మినపపప్పు వాణిజ్యంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి భారత్, బ్రెజిల్ కృషి చేస్తున్నాయి. ఇటీవల రెండు దేశాల అధికారులు సమావేశమై దీనిపై చర్చించారు. పప్పుల సరఫరాలో బ్రెజిల్‌ను విశ్వసనీయ దేశంగా తాము పరిగణిస్తున్నామని ఈ సందర్భంగా భారత అధికారులు తెలిపారు. పప్పు ధాన్యాలకు సంబంధించిన ఆహార భద్రతలో ఉమ్మడి భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడం పై చర్చించామని న్యూఢిల్లీలోని బ్రెజిల్ రాయబార కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతాధికారి మరీసియో తెలిపారు.


గత సంవత్సరం బ్రెజిల్ నుండి మూడు వేల టన్నుల మినపపప్పును దిగుమతి చేసుకున్నామని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఇటీవల చెప్పారు. పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మరో 20 వేల టన్నులను దిగుమతి చేసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ద్వైపాక్షిక వ్యవసాయ వాణిజ్యాన్ని విస్తరించుకునేందుకు పప్పు ధాన్యాలు దోహదపడతాయని ఆయన చెప్పారు. కాగా దేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పడిపోతున్న నేపథ్యంలో మినుము, కంది పంటలు పండించాలని బ్రెజిల్‌లోని వ్యాపారులు, అధికారులను రోహిత్ కుమార్ గత నవంబరులో కోరారు.

ప్రపంచంలో భారత్‌లోనే అత్యధికంగా పప్పు ధాన్యాల పంటలు పండిస్తున్నారు. వాటి వినియోగం కూడా మన దేశంలో ఎక్కువే. ఏటా 28 మిలియన్ టన్నుల పప్పులు అవసరమవుతున్నాయి. దేశీయంగా డిమాండ్ పెరుగుతుండడంతో పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోంది.

విదేశీ దిగుమతులు ఎంతంటే..

మన దేశంలో పప్పుధాన్యాలను ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఉత్పత్తిలో 20 శాతం వరకు ఇతర దేశాల (కెనడా, మయన్మార్, రష్యా అమెరికా, ఆస్ట్రేలియా) నుంచి దిగుమతి అవుతున్నాయి. 2001-02లో దిగుమతి ఖర్చు రూ. 3,160 కోట్లు వుండగా, 2013-14లో రూ.10,551 కోట్లు వుంది. తలసరి పప్పుధాన్యాల లభ్యత మన దేశంలో 51.1 గ్రా/ ఒక రోజుకు (1971) నుంచి 41.9 గ్రా. / ఒక రోజుకు (2013) పడిపోయింది, ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన 80 గ్రా. / ఒక రోజుకు కంటే చాలా తక్కువ, జాతీయ పప్పుధాన్యాల పరిశోధనా సంస్థ, కాన్పూరు వారి ప్రకారం మన దేశంలో జనాభా 2030 నాటికి 1.68 మిలియన్ల అవుతుందని, అందుకనుగుణంగా 32 మి.ట. పప్పుధాన్యాలు అవసరమవు తాయని తెలుపుతోంది. ఈ అవసరాన్ని అందుకోవాలంటే అదనంగా 3-5 మి.హె. విస్తీర్ణంలో పప్పుధాన్యాలు సాగు కావాలని, అలాగే ఉత్పాదకతను హెక్టారుకు 1361 కిలోలు సాధించాల్సిన అవసరం వుంది.

భారత్‌లో పప్పుధాన్యాల పంటల ఉత్పత్తి ఎంతంటే..



ప్రపంచ వ్యాప్తంగా 171 దేశాలలో పప్పుధాన్యపు పంటలను పండిస్తున్నారు. మన భారత దేశం పప్పుధాన్యాల పంటల ఉత్పత్తి 25 శాతంగా, ఆహారంగా తీసుకోవడం 27 శాతంగా ఉన్నది. అంటే ఈ లెక్కన గ్యాప్ చాలా తక్కువ. కాని కేంద్రం దిగుమతి చేసుకోవడంలోనే 14 శాతం ముందుంది. ఆహార గింజల విస్తీర్ణంలో పప్పుధాన్యాలు 20 శాతం, అదే విధంగా ఉత్పత్తిలో 7-10 శాతం వరకు ఆక్రమిస్తున్నాయి. పప్పుధాన్యాలను ఖరీఫ్, రబీ కాలంలో పండిస్తున్నప్పటికీ, రబీలో పప్పుధాన్యపు పంటల సాగు 60 శాతము వరకు ఉంది. పప్పుధాన్యపు పంటల విస్తీర్ణం 1950-1951వ సంవత్సరములో 19 మి.హెగా వుండగా, 2013-14వ సంవత్సరంలో 25 మి.హె.గా వుంది. అదే కాలంలో ఉత్పత్తి 8.41 మి.ట. నుండి 19.27 మి.ట. గా పెరిగింది. మన దేశంలో పప్పుధాన్యాలను పండించే ఐదు రాష్ట్రాలు వరుసగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ , కర్నాటక ఉన్నాయి.

మన దేశంలో పప్పుధాన్యపు పంటల ఉత్పాదకత హెక్టారుకు 440 కిలోల (1950-51) నుంచి 769 కిలోల (2013-14) వరకు, అంటే 46 శాతం పెరిగింది. ఉత్పాదకత ఫ్రాన్స్ హెక్టారుకు 4,219 కిలోల, కెనడాలో 1986 కిలోలు, అమెరికాలో 1882 కిలోలు, రష్యాలో 1648 కిలోలు, చైనాలో 1,596 కిలోలుగా వుండగా, మన దేశంలో 764 కిలోలు మాత్రమే. పప్పుధాన్యపు పంటల విస్తీర్ణం (0.08 శాతం), ఆహార గింజలు (0.21 శాతం), వరి (0.058 శాతం), గోధుమ (1.7 శాతం) మరియు నూనెగింజలు (1.4 శాతం) తో పోలిస్తే వార్షిక సమ్మేళన వృద్ధి రేటు (సీఏజీఆర్) 1950-51 వ సంవత్సరం నుంచి 2013-14 సంవత్సరం వరకు తగ్గింది. కారణం, ఇప్పటికీ మన దేశంలో పప్పుధాన్యాలను సారవంతం లేని నేలల్లో , చౌడు నేలల్లో పండించడమే.

అంతే కాకుండా ఎక్కువగా వర్షాధారంగా పండిస్తుండమే. అయితే ఈ పంటను కూడా మధ్యదళారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించటంతో అటు రైతుకు, ఇటు వినియోగదారులని నిలువునా మోసం జరుగుతోంది. దీనిపై మోడీ ప్రభుత్వం కట్టడి చేయాల్సి ఉండగా..అందుకు భిన్నంగా వ్యవహరించటంతో..విదేశాల నుంచి దిగుమతిపైనే కేంద్రం ఆధారపడుతోంది.

పరిశోధనలు ఉన్నా..

జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు , కృషి విజ్ఞాన కేంద్రాలు పప్పుధాన్యపు పంటలలో అధిక దిగుబడి నిచ్చే రకాలు, పురుగు, తెగుళ్ళను తట్టుకునే రకాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులపై ప్రదర్శనా క్షేత్రాలు, శిక్షణా కార్యక్రమాలు , ఇతర విస్తరణ కార్యక్రమాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడం జరుగుతోంది. 2010-11వ సంవత్సరం నుంచి జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా పప్పుధాన్యాపు పంటలలో ఉత్పాదకతను పెంచడానికి రైతుల పొలాల్లో మొదటి తరహా ప్రదర్శనా క్షేత్రాలను నిర్వహించి, రైతులను ప్రోత్సహించడం జరుగుతోంది. అలాగే వ్యవసాయం , రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా కూడా పప్పుధాన్యపు పంటలలో ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించడం జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి, అన్ని సభ్యదేశాల అనుమతితో 2016వ సంవత్సరాన్ని "ప్రపంచ పప్పుధాన్యపు పంటల సంవత్సరంగా" ప్రకటించింది. పప్పుధాన్యపు పంటల ఉపయోగాలను, దిగుబడులు పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలను, పోషకాహారంలో పప్పుధాన్యపు ప్రాముఖ్యతను గురించి తెలియజేయడానికి మోడీ ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపటంలేదని రైతులు, రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

రద్దీ పెరిగితే.. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంపు

ప్రస్తుతం 3 నుంచి 3.5 నిమిషాలకో మెట్రో రైలు

జేబీఎస్-ఎంజీబీఎస్ రూట్లో 6 నిమిషాలకో రైలు

- మెట్రోలో ప్రతిరోజూ 5లక్షల మంది జర్నీ



నవతెలంగాణ-సిటీబ్యూరో


గ్రేటర్ హైదరాబాద్ నుంచి మేడారం జాతరకు వందలాది ఆర్టీసీ బస్సులను పంపించారు. నేటి నుంచి మేడారం మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే సిటీ నుంచి దాదాపు 2వేలకుపైగా బస్సులు అవసరమైన పాయింట్లకు వెళ్లగా.. గ్రేటర్‌లో కేవలం 600 బస్సులే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు వివిధ వృత్తి పనుల కోసం వెళ్లేవారు బస్సుల్లేక అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి బస్టాపుల్లో బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. టీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రజలను ప్రత్యామ్నాయ రవాణా చూసుకోవాలని కోరింది. సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే సందర్శకులకు, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. బస్సుల సంఖ్య తగ్గడంతో మెట్రోలో రద్దీ పెరిగింది.

అవసరమైతే ట్రిప్పులు పెంచుతాం..

గ్రేటర్ జోన్‌లో ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసులను తగ్గించడంతో ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్యాసింజర్ వాహనదారులు, డ్రైవర్లు అడ్డగోలుగా ధరలు పెంచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ జనం గమ్యస్థానాలకు చేరేందుకు హైదరాబాద్ మెట్రో రైలును ఆశ్రయించనున్నారు. ట్రాఫిక్ రహితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న మెట్రోకు ఆదరణ బాగుంది. ఆటోలు, బస్సులతో పోల్చితే నిమిషాల వ్యవధిలో, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గమ్యస్థానాలకు వెళ్లే అవకాశం ఉండటంతో చాలామంది మెట్రోకే మొగ్గు చూపుతున్నారు. అయితే, ఇప్పటికి హైదరాబాద్ మెట్రో అధికారులు ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. కానీ, ప్రయాణికుల రద్దీ పెరిగితే ప్రస్తుతమున్న రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచుతామని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గ్ కారిడార్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 3, 3.5 నిమిషాలకో ట్రైన్.. ఎంజీబీఎస్- జేబీఎస్ రూట్లో ఆరు నిమిషాలకో రైల్ నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. ఒకవేళ అవసరమైతే అప్పుడు రద్దీకి అనుగుణంగా 3నిమిషాలకో ట్రైన్ నడుపుతామని చెబుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్, నాగోలు- రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ కారిడార్ల పరిధిలోని 57 స్టేషన్ల ద్వారా రోజుకు 1,065 సర్వీసులను నడిపిస్తున్నారు. ప్రతిరోజూ 5-5.10లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం కూడా ఇదే స్థాయిలో ప్రయాణికుల ఫుట్‌పాల్ నమోదైందని మెట్రో అధికారులు తెలిపారు.

మతోన్మాద బీజేపీ, దానికి మద్దతిచ్చే టీడీపీ - జనసేన కూటమి, నిరంకుశ వైసీపీలను ఓడించండి

సీపీఐ(ఎం), సీపీఐ(ఏపీ) రాష్ట్ర సదస్సు పిలుపు



విజయవాడ : రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని, దానికి మద్దతిస్తున్న టీడీపీ-జనసేన కూటమిని, నిరంకుశ వైసిపిలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం)-సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. విజయవాడలోని ఎంబీవీకేలో మంగళవారం జరిగిన ఈ సదస్సుకు భారీ స్పందన లభించింది. వామపక్షాలు, కాంగ్రెస్‌తో పాటు రాష్ట్రంలోని బీజేపీ యేతర పార్టీలు ఒకే వేదికపైకి వచ్చిన ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో ప్రజానీకం కదలిరావడంతో ఎంబివికె కిటకిట లాడింది. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మతం పేరిట ప్రజలను విభజిస్తూ, అదే సమయంలో అదాని, అంబాని వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న తీరును, . ప్రత్యేక హోదాతోపాటు, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహంచేస్తున్నా టీడీపీ-జనసేన, వైసీపీలు బీజేపీని బలపరుస్తున్న తీరును వక్తలు వివరించారు. బీజేపీని, దానికి మద్దతిస్తున్న టీడీపీ-జనసేన కూటమిని, నిరంకుశ వైసీపీలను ఓడించాలన్న తీర్మానాన్ని సదస్సు హర్షధ్వానాలతో ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో బీజేపీని ఓడించడమంటే, దానికి కొమ్ముకాస్తున్న టీడీపీ-జనసేన కూటమి, నిరంకుశ వైసీపీని ఓడించడమే. రాష్ట్రం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం, మత సామరస్యం కోసం వామపక్ష లౌకిక శక్తులను బలపర్చాలని ఈ సదస్సు రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేసింది.

మతపరమైన మైనారిటీలకు అన్యాయం

ఐదేండ్లలో భారీగా క్షీణించిన సాధారణ వేతన ఉద్యోగాలు

- 2018 నుంచి 2023 మధ్య అధికంగా పడిపోయిన వైనం
- హిందూ జనాభాల్లో ఇది తక్కువ
- పీఎల్ఎఫ్ఎస్ డేటా





న్యూఢిల్లీ : దేశంలోని మోడీ పాలనలో మైనారిటీలకు భద్రతా పరంగానే కాదు.. ఉద్యోగపరంగానూ రక్షణ కరువైంది. గత ఐదేండ్లలో మెజారిటీ హిందూ జనాభాతో పోలిస్తే ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు వంటి మతపరమైన మైనారిటీ వర్గాల్లో సాధారణ వేతన ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి వాటా బాగా తగ్గింది. వార్షిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) సమాచారమే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. మతపరమైన మైనారిటీలలో, ముస్లిం కమ్యూనిటీకి చెందిన కార్మికులు 2018-19 నుంచి 2022-23 మధ్య అత్యధిక క్షీణతను చూడటం గమనార్హం.

పీఎల్ఎఫ్ఎస్‌ను నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ 2017, ఏప్రిల్‌లో ప్రారంభించింది. ఇది వర్కర్ పాపులేషన్ రేషియో, లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్, నిరుద్యోగిత రేటు వంటి కీలక ఉపాధి, నిరుద్యోగ సూచికలను అంచనా వేస్తుంది. ఇది సామాజిక, మత సమూహాల మధ్య ఉద్యోగ స్థితిని మరింత అంచనా వేస్తుంది.

ఈ సర్వే సమాచారం ప్రకారం.. 2018-19లో ముస్లిం కమ్యూనిటీకి చెందిన 22.1 శాతం కార్మికులు వేతన ఉద్యోగులుగా పని చేయగా, 2022-23లో అది 15.3 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల 6.8 శాతం. అదేవిధంగా, క్రిస్టియన్ కమ్యూనిటీకి చెందిన జనాభా 3.2 శాతం పాయింట్ల క్షీణతను చూసింది. 2022-23లో కేవలం 28 శాతం క్రైస్తవ కార్మికులు మాత్రమే సాధారణ ఉద్యోగాలను కలిగి ఉన్నారు.

ఇది 2018-19లో 31.2 శాతం నుంచి తగ్గింది. సిక్కు సమాజం జనాభా 2.5 శాతం పాయింట్ల క్షీణతను చూసింది. 2022-23లో 26 శాతం సిక్కు కార్మికులు మాత్రమే వేతన ఉపాధిని కలిగి ఉన్నారు. 2018-19లో ఇది 28.5 శాతం నుంచి పడిపోవటం గమనార్హం.

ఇక మెజారిటీ హిందూ సమాజానికి ఉపాధి నాణ్యతలో క్షీణత చాలా తక్కువగా ఉన్నది. ఇక్కడ, 2022-23లో 21.4 శాతం మంది కార్మికులు రెగ్యులర్ జీతాలతో కూడిన ఉద్యోగాలను కలిగి ఉన్నారు. ఇది 2018-19లో 23.7 శాతం నుంచి 2.3 శాతం పడిపోయింది. అన్ని మత సమూహాలలో స్వయం ఉపాధి పెరిగినప్పటికీ, సాధారణ కార్మికుల వాటా ముస్లిం సమాజంలో మాత్రమే పెరగటం గమనార్హం.

2018-19లో 25.7 శాతం నుంచి 2022-23లో దాదాపు 26.3 శాతం మంది ముస్లిం కార్మికులు సాధారణ కార్మికులుగా పనిచేశారు. ఇది హిందువులు, సిక్కులు, క్రైస్తవుల వంటి ఇతర మత సమూహాలకు భిన్నంగా ఉన్నది. ప్రధాన మత సమూహాలలో, ముస్లింల శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్), కార్మికుల జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) ఒకే సమయంలో క్షీణించిందనీ గతేడాది అక్టోబర్‌లో ఒక వార్త సంస్థ నివేదించింది. ఇది 2020-21లో 35.5 శాతం ఉండగా.. 2022-23లో 32.5 శాతానికి తగ్గింది.

హర్యానా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం...

అసెంబ్లీలో రేపు చర్చ

చండీగఢ్: హర్యానా ప్రభుత్వంపై అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ జియాన్ చంద్ గుప్తా అంగీకరించారు. మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన చర్చను 22న(గురువారం) నిర్వహిస్తామని తెలిపారు. ఇటీవల ప్రతిపక్ష నాయకుడు భూపిందర్ సింగ్ హుడా ఖట్టర్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం తీసుకువస్తుందని ఆయన చెప్పారు.

మూడేండ్ల కిందట బీజేపీ-జేజేపీ(జననాయక్ జనతా పార్టీ) ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం తెచ్చినా అది వీగిపోయింది. కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి మనోహర్ ఖట్టర్ గతంలోని అవిశ్వాస తీర్మానం గురించి ప్రస్తావించారు. ప్రతి సెషన్‌లో తమ ప్రభుత్వం చేసిన పని గురించి తెలుసుకోవడానికి ప్రతిపక్షాలు తప్పనిసరిగా అలాంటి తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ మళ్లీ అవిశ్వాస తీర్మానం తీసుకువస్తే, ప్రభుత్వం చేసిన పనుల గురించి వారు వినాల్సివస్తుందన్నారు.90 మంది సభ్యులు ఉన్న సభలో బీజేపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉండగా, దాని భాగస్వామి (జేజేపీ)కి 10 మంది ఉన్నారు. సభలోని ఏడుగురు స్వతంత్ర సభ్యుల్లో ఆరుగురు బీజేపీకి మద్దతిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 30మంది ఎమ్మెల్యేలుండగా, ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్డి)కి ఒకరు ఉన్నారు.